


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ | 22-03-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 307 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on

# పోటాపోటీగా యుద్ధం

## మూడు వారాలైనా చల్లారని గల్ఫ్ రణరంగం

- ఇరాన్‌లోని నతాంజ్ అణుకేంద్రంపై మళ్లీ దాడి
- ఆంక్షలపై దిగివచ్చిన అమెరికా
- సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్
- చమురు నౌకలపై ఆంక్షలు ఎత్తివేత
- ఇరాన్ చమురు అమ్మకాలకు 30 రోజులపాటు ఆంక్షల నుంచి మినహాయింపు : అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్
- అంతర్జాతీయ మార్కెట్లకు అమ్మడానికి తమ వద్ద ఆయిల్ నిల్వలు లేవన్న ఇరాన్
- ఇరాన్‌కు రష్యా విశ్వసనీయ మిత్రుడు : పుతిన్
- ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోడీ



**వుదయం డెస్క్, మార్చి 21 :** ఇరాన్, యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్ మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా యుద్ధం మూడవ వారం దాటినా భీషణంగా కొనసాగుతోంది. ఈ దాడి ప్రతిదాడుల్లో సైనిక, దౌత్యపరమైన, గల్ఫ్‌లోని ఇంధన కేంద్రాలు ధ్వంసం అవుతున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ దాడులు, ఘర్షణ ఆ ప్రాంత వ్యాప్తమై, ఇంధన మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నది. ముఖ్యంగా హొర్ముజ్ జలసంధిని టెహ్రాన్ మూసివేయడంతో చమురు ధరలు చుక్కలను అంటుతున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుని లెబనాన్‌పై భూతల దాడులు చేస్తోంది. **ముఖ్యపరిణామాలు..** చమురు కేంద్రమైన ఇరాన్ ఖర్గ్ ద్వీపాన్ని ఆక్రమించుకోవడానికి లేదా దిగ్బంధం చేయడానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు పరిశీలిస్తోందన్న నివేదిక వెలువడిన తర్వాత, అమెరికా తనకు కావలసినప్పుడు ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోగలదని వైట్ హౌస్ పేర్కొంది. హొర్ముజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడిని నిరోధించే ఆపరేషన్లలో భాగంగా, యూకే సైనిక స్థావరాలను అమెరికా సైన్యం ఉపయోగించుకోవడానికి యూకే మంత్రులు అంగీకరించారు. శత్రువు ఓడిపోయాడన్న మొజ్తాబాః పర్షియన్ నూతన సంవత్సరం నౌరూజ్ సందర్భంగా పంపిన ఒక లిఖిత సందేశంలో, అమెరికా, ఇజ్రాయెల్‌లతో జరుగుతున్న యుద్ధంలో ఇస్లామిక్ రిపబ్లిక్ శత్రువులు ఓడిపోతున్నారని ఇరాన్ సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో మరిన్న యుఎస్ దళాలుః ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ పోరాటం ప్రారంభమై మూడు వారాలు గడిచిన నేపథ్యంలో, రాబోయే భూతల ఆపరేషన్‌కు సంకేతంగా అమెరికా పశ్చిమ ఆసియాకు అదనంగా 2,500 మంది మెరైన్‌లను పంపుతోందని అమెరికా మీడియా పేర్కొంది. నాటో మిత్రులు పిరికిపందలన్న ట్రంప్ః హోర్ముజ్ జలసంధి నౌకా రవాణా మార్గాన్ని ఇరాన్ నియంత్రించడానికి వ్యతిరేకంగా సైనిక సహాయం అందించాలన్న తన డిమాండ్‌ను పట్టించుకోనందుకు, అమెరికా నాటో మిత్రదేశాలను ట్రంప్ పిరికిపందలని అని ముద్ర వేశారు. ఇరాన్ సైనిక బెదిరింపులుః అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు, సైనిక కమాండర్లు సెలవుల్లో ఉన్నప్పుడు గానీ, వినోద కేంద్రాలను సందర్శిస్తున్నప్పుడు గానీ వారిని వెంటాడి వేటాడతామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

మిగతా 2లో

### నతాంజ్‌పై మళ్లీ దాడి

**వుదయం డెస్క్, మార్చి 21 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే సూచనలు కనిపించడంలేదు. తాజాగా శనివారం నాడు ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రంపై దాడి జరిగినట్టు ఇరాన్ వార్తా సంస్థ మిజాన్ పేర్కొంది. ఈ దాడులు అమెరికా– ఇజ్రాయెల్ దళాలే చేశాయని తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ అణు శుద్ధి కేంద్రంపై ఇది తొలి దాడి కాదు. మొదటిసారి దాడి చేసినప్పుడు అనేక భవనాలు విధ్వంసమైనట్టు ఉపగ్రహ చిత్రాల్లో కనిపించింది. ఆ దాడుల్లో ఎటువంటి రేడియో ధార్మిక పదార్థాల లీకేజీ ఏమీ లేదని ఐక్యరాజ్య సమితి న్యూక్లియర్ వాచ్‌డాగ్ తెలిపింది. ఇప్పుడు కూడా అటువంటి లీకేజీలు లేవని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం లేదని అక్కడి మీడియా పేర్కొంది. కాగా, ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. ఇది అమెరికా, ఇజ్రాయెల్‌ల నేరపూరిత చర్య అని అభివర్ణించింది.

### ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు

**వుదయం డెస్క్, మార్చి 21 :** పశ్చిమాసియాలో యుద్ధం మూడవ వారంలోకి ప్రవేశించడం, చమురు రవాణా అయ్యే జలసంధిని ఇరాన్ దిగ్బంధనం చేయడంతో చమురు ధరలు చుక్కలనంటుతూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. దీనితో అమెరికా దిగిరాక తప్పలేదు. అందులో భాగంగా ట్రంప్ ప్రభుత్వం సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించింది. ఇరాన్ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ మేరకు ప్రకటన చేశారు. అంతర్జాతీయ మార్కెట్లోకి చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. దీనితో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లో ప్రవేశించనందుని తెలిపారు. ఇది తాత్కాలిక చర్య అని, అంటే ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని పేర్కొన్నారు.

మిగతా 2లో


### ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోడీ సంభాషణ





**న్యూఢిల్లీ, మార్చి 21 (వుదయం) :** పశ్చిమాసియా సంక్షోభం నడుమ కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖండించారు. శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తో మాట్లాడిన మోడీ ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా లంకెకు ఆటంకం కలిగించేలా మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని, నౌకా మార్గాలను తెరిచి ఉంచడం, వాటిని సురక్షితంగా చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలకు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్, నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాన్ని తీసుకురావాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

### ఇరాన్‌కు రష్యా విశ్వసనీయ మిత్రుడు: పుతిన్



**వుదయం డెస్క్, మార్చి 21 :** నౌరోజ్ సందర్భంగా ఇరాన్ నాయకులకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు చెప్పారు. టెహ్రాన్‌కు తాము ఎప్పుడూ విశ్వసనీయ మిత్రుడిగా, నమ్మకమైన భాగస్వామిగా ఉంటామని ఆయన పునరుద్ఘాటించారని క్రెమ్లిన్ తెలిపింది. యుద్ధానికి తెరిపి లేకుండా సాగుతున్న తరుణంలో ఇరాన్‌కు రష్యా మద్దతు ప్రకటించడం విశేషం.ఈ నేపథ్యంలోనే ఇరాన్‌కు నిఘా సమాచారం ఇవ్వడాన్ని నిలిపివేస్తామంటూ అమెరికాకు తాము ప్రతిపాదించినట్టు మీడియాలో వచ్చిన వార్తలను క్రెమ్లిన్ తోసిపుచ్చింది. తాము అటువంటి ప్రతిపాదనలు ఏవీ చేయలేదని పేర్కొంది. అమెరికాకు చెందిన పొలిటికో వార్తా సంస్థలో ఈ వార్త వెలువడింది. అమెరికా నిఘా సమాచారాన్ని ఉక్రెయిన్‌కు అందించకపోతే, తామూ ఇరాన్ విషయంలో వెనక్కి తగ్గుతామని రష్యా అన్నట్టు ఈ సంస్థ పేర్కొంది. పొలిటికో కథనం ప్రకారం, అమెరికా ప్రతినిధులు, రష్యన్ ప్రతినిధితో గతవారం ఈ అంశాన్ని ప్రతిపాదించగా, ఉక్రెయిన్‌కు నిఘా సమాచారాన్ని నిలిపివేయమని ఆయన అమెరికాను కోరారని, ఇందుకు ప్రతిగా తమ ఇరాన్ కు తోడ్పాటు ఇవ్వమని రష్యన్ ప్రతినిధి పేర్కొన్నారని పొలిటికో పేర్కొంది.

మిగతా 2లో

# డీగోపై ఇరాన్ గురి

## హిందూ మహాసముద్రంలోని అమెరికా స్థావరం దిశగా క్షిపణుల ప్రయోగం
## ఇరాన్ కు 4 వేల కిలో మీటర్ల దూరంలో గల డీగో గార్షియా



**వుదయం డెస్క్, మార్చి 21 :** ఇరాన్ యుద్ధం ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతాన్ని దాటి హిందూ మహాసముద్రం దరిదాపుల్లోకి వచ్చింది. హిందూ మహా సముద్రంలోని డీగో గార్షియాలో గల యుఎస్– యుకె స్థావరం దిశగా ఇరాన్ రెండు ఇంటర్మీడియెట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడంతో యుద్ధాన్ని తీవ్రతరం చేయాలని ఇరాన్ నిశ్చయించుకున్నట్టు అర్థమవుతోంది. కాగా, లక్ష్యం 4,000 కిమీ దూరంలో ఉండటంతో అవి తాకలేదని తెలుస్తోంది. ఒక క్షిపణి మధ్యలో విఫలం కాగా, రెండవ దాన్ని తాము అడ్డగించి ఉండవచ్చని మీడియా కథనాలు చెప్తున్నాయి.

ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డీగో గార్షియా ఇరాన్‌కు సుమారు 4,000 కి.మీ. దూరంలో ఉంది. తమ బాలిస్టిక్ క్షిపణుల పరిధి 2,000 కి.మీ.లకు పరిమితమని టెహ్రాన్ బహిరంగంగా చెబుతోంది. అయితే, ఇరాన్ గనుక ఆ బహిరంగ పరిమితికి రెట్టింపు దూరంలో దాడికి

మిగతా 2లో

### భార్య మృతితో మనస్తాపం
# ఎస్ఐ ఆత్మహత్య



కరీంనగర్ రెండవ ఠాణా ఎస్ ఐ చంద్రశేఖర్ ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గత ఐదు రోజుల క్రితం చంద్రశేఖర్ భార్య దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకోగా కడుపు నొప్పి తో ఆత్మహత్య చేసుకుందనీ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దివ్య మృతదేహాన్ని స్వగ్రామం ఇల్లందకుంట మండలం సీతంపేట కు తరలించగా సీతంపేట గ్రామంలో దివ్య ఆత్మహత్యకు భర్త చంద్రశేఖర్ కారణమని మృతురాలి బంధువులు దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు, బంధువుల నిరసనల మధ్య మృతురాలి తల్లి దండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

మిగతా 2లో

# ద్రవ్యోల్బణం దరువు

## రూపాయి విలువ పతనమే దీనికి సంకేతం
## వంట గ్యాస్ కొరత ప్రభుత్వ వైఫల్యం : రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి 21 (వుదయం) :** ఇటీవలి కాలంలో రూపాయి విలువ పతనంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. ద్రవ్యోల్బణం అనివార్యమనడానికి ఇది స్పష్టమైన సంకేతం అని ఆయన పేర్కొన్నారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఎల్పీజీ కొరత కారణంగా దేశం ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటున్న తరుణంలో, కేంద్రం నిష్ఫలమైన మాటలను ఆయన విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెంచుతారని ఆయన హెచ్చరించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడి 100 దిశగా పయనించడం, ఇందుకు తోడు పారిశ్రామిక ఇంధన ధరలు విపరీతంగా పెరగడం.. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు; రానున్న ద్రవ్యోల్బణానికి ఇవి స్పష్టమైన సంకేతాలు, అని రాహుల్ ఎక్స్‌పై చేసిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రభు త్వం దీనిని సాధారణం అని పిలవవచ్చు, కానీ వాస్తవం ఏమిటంటే, ఉత్పత్తి, రవాణా మరింత ఖరీదైనవిగా మారతాయి; ఎంఎస్ఎంఈలు అత్యంత తీవ్రంగా దెబ్బతింటాయి, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి, విదేశీ పెట్టుబడుల డబ్బు మరింత వేగంగా బయటకు తరలిపోతుంది, ఇది షేర్ మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచుతుంది, అని ఆయన వివరించారు. మరో మాటలో చెప్పాలంటే, ఇది ప్రతి కుటుంబం జేబుపై ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావం చూపడం ఖాయం.

మిగతా 2లో

# న్యాయ సంస్కరణల ఆవశ్యకత

## పెండింగ్ కేసులు తగ్గించడానికి కమిషన్ : జస్టిస్ నాగరత్న



**బెంగళూరు, మార్చి 21 (వుదయం) :** న్యాయస్థానాలలో పేరుకుపోతున్న కేసులను తగ్గించడానికి ఒక న్యాయ సంస్కరణల కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరాత్న శనివారం పిలుపునిచ్చారు. వివిధ వర్గాలకు ఉన్న వ్యవస్థాగత ప్రోత్సాహకాలు న్యాయం అందించడంలో జాప్యానికి దోహదపడుతున్నాయని ఆమె అన్నారు. ఆమె ఇక్కడ న్యాయ పరిపాలనను పునఃసమీక్షించడం: ప్రజాస్వామ్య న్యాయం కోసం సంస్థలను బలోపేతం చేయడం అనే అంశంపై సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) నిర్వహించిన మొదటి జాతీయ సదస్సులో ప్రసంగించారు. అందులో భాగంగా జరిగిన ప్యానెల్ సెషన్‌లో పాల్గొన్న నాగారత్న మాట్లాడుతూ, ఈ సంస్కరణల కమిషన్‌లో కేవలం సుప్రీం కోర్టు, హైకోర్టు, జిల్లా న్యాయవ్యవస్థల నుండే కాకుండా, బార్, అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ నుండి కూడా సభ్యులు ఉండాలని, పెండింగ్‌ను తగ్గించడంపై సంస్థల మధ్య చర్చలను సులభతరం చేయడానికి బార్ అధ్యక్షుడు వంటి సంస్థాగత స్థాయిలో బార్‌కు ప్రాతినిధ్యం వహించే కొంతమంది సభ్యులు, ప్రభుత్వ పక్షం నుండి కూడా సభ్యులు ఉండాలని అన్నారు. ఒక న్యాయవాది లేదా అడ్వకేట్ వాయిదాలను, వాయిదా వేయడాన్ని ఇష్టపడతారు, ఎందుకంటే వారు ప్రతి హాజరుకు, పొడిగించిన కాలపరిమితుల నుండి ప్రయోజనం పొందుతారు.

మిగతా 2లో

# విద్య, వైద్యాలకు నిధులు పెంచాలి

- బడ్జెట్‌ను సవరించాల్సిందే..లేకుంటే ఉద్యమాలే
- రాష్ట్రాల హక్కులను కేంద్రం లాక్కోవడం దారుణం
- బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు తక్కువ నిధుల కేటాయింపు దారుణం
- పేదల సంక్షేమం కోసం సంపన్నులపై పన్నుల శాతాన్ని పెంచాల్సిందే
- సీపీఐ(ఎం) రౌండ్‌టేబుల్‌లో వక్తలు




**హైదరాబాద్, మార్చి 21 (ఎఎంఎస్) :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక నిధులను కేటాయించాలనీ, ఆ రెండు రంగాలను ప్రభుత్వ వ్యవస్థలో బలోపేతం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ, సంక్షేమం లాంటి ప్రాధాన్యతా రంగాలకు నిధుల కేటాయింపును పెంచాలనీ, లేకుంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్రాల ఆదాయ వనరులను కేంద్ర ప్రభుత్వం లాక్కోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒలా, బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు మరోలా నిధులు కేటాయించడాన్ని తప్పుబట్టారు. పేదల సంక్షేమం కోసం సంపన్నులపై పన్నుల భారాన్ని పెంచాల్సిందేనని నొక్కి చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో కాకుండా సెస్‌లు, సర్‌చార్జీల రూపంలో వసూలు చేస్తున్నదనీ, దీనివల్ల రాష్ట్రాలకు వాటా దక్కకుండా పోతున్నదని ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే నిధులు ఇస్తాం,

మిగతా 2లో

## భార్య మృతి తో భర్త మనస్తాపం
# ఎస్ఐ ఆత్మహత్య



**కరీంనగర్, మార్చి21(వుదయం ప్రతినిధి) :** కరీంనగర్ రెండవ ఠాణా ఎస్ ఐ చంద్రశేఖర్ ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గత ఐదు రోజుల క్రితం చంద్రశేఖర్ భార్య దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకోగా కడుపు నొప్పి తో ఆత్మహత్య చేసుకుందనీ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో దివ్య మృతదేహాన్ని స్వగ్రామం ఇల్లందకుంట మండలం సీతంపేట కు తరలించగా సీతంపేట గ్రామంలో దివ్య ఆత్మహత్యకు భర్త చంద్రశేఖర్ కారణమని మృతురాలి బంధువులు దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు, బంధువుల నిరసనల మధ్య మృతురాలి తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం ఐదు రోజుల కార్యక్రమానికి అత్తగారింటికి వచ్చిన ఎస్సై చంద్రశేఖర్ అత్తగారింట్లోనే ఉరి వేసుకొని బలవర్మరణానికి పాల్పడ్డాడు. గదిలో నుండి బయటికి రాకపోవడం తో అనుమానం తో చూడగా ఉరి వేసుకొని ఉండడం తో జమ్మికుంట లోనీ ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

**అనాథలుగా పిల్లలు :** ఎస్సై చంద్రశేఖర్, అతని భార్య దివ్య మరణంతో ఈ సంఘటన జిల్లాలో హృదయ విదార కత నెలకొంది. వీరికి కలిగిన సంతానం అనాథలుగా మిగిలిపోవాల్సి వచ్చింది

# న్యాయ సంస్కరణల ఆవశ్యకత

మొదటి పేజీ తరువాయి

ఒక ప్రభుత్వ శాఖ ఓటమిని అంగీకరించడం కంటే అప్పీల్ చేయడం ద్వారా అధికారికపరమైన రిస్క్‌ను తగ్గిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విషయంలో, న్యాయమూర్తి లోపభూయిష్టమైన ఫైలింగ్‌లను కోర్టు గణాంకాలలో చేర్చడాన్ని ప్రశ్నించారు. విచారణకు విధానపరంగా సిద్ధమయ్యే వరకు అటువంటి కేసులను లెక్కలోకి తీసుకోకూడదని ఆమె సూచించారు. అంతేకాకుండా, వ్యాజ్యాలకు అతిపెద్ద మూలం ప్రభుత్వమేనని ఆమె నొక్కిచెప్పారు. వివాదాలను ముందుగానే పరిష్కరించుకోగలిగే కేసులలో కూడా, అధికారులు పరిశీలనను తప్పించుకోవడానికి అప్పీళ్లను దాఖలు చేస్తారని ఆమె పేర్కొన్నారు. దీని ఫలితంగా, కేసులు అనవసరంగా అనేక న్యాయస్థాయిల గుండా ప్రయాణించాల్సి వస్తుందని ఆమె అన్నారు.ప్రభుత్వం బహిరంగంగా న్యాయవ్యవస్థలో పేరుకుపోయిన కేసుల గురించి ఆందోళన వ్యక్తం చేస్తూనే, అదే సమయంలో నిరంతర వ్యాజ్యాల ద్వారా ఆ పెండింగ్‌ను మరింత పెంచుతోంది, అని ఆమె వ్యాఖ్యానించారు. న్యాయమూర్తుల నియామకాలలో జాప్యం, మౌలిక సదుపాయాల కొరత, సాంకేతిక పరిజ్ఞానాన్ని తగినంతగా ఉపయోగించకపోవడం వంటి తగినంత ప్రభుత్వ పెట్టుబడులు లేకపోవడం వల్ల న్యాయవ్యవస్థ సామర్థ్యం పరిమితమైందని జస్టిస్ నాగారత్న పేర్కొన్నారు. ఆమె సూచించిన చర్యలలో, మెరుగైన కేసుల నిర్వహణ, అనవసర వాయిదాలపై నియంత్రణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడం, కేసులకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాలను ప్రోత్సహించడం, ప్రత్యేక ధర్మాసనాలను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. న్యాయవాదులు వృత్తిపరమైన, నైతిక ప్రమాణాలను పాటించాలని, వ్యాజ్యదారులు నిరాధారమైన అప్పీళ్లకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం ఆచరణాత్మక వ్యాజ్య విధానాన్ని అవలంబించి, న్యాయవ్యవస్థకు సకాలంలో నిధులు, నియామకాలు అందేలా చూడాలని ఆమె కోరారు.

# డీగోపై ఇరాన్ గురి

మొదటి పేజీ తరువాయి

ప్రయత్నిస్తే, ప్రపంచానికి తెలియని, అది వెల్లడించని సామర్థ్యాలు ఇరాన్ వద్ద ఉన్నాయని దీని అర్థం. ఇరాన్, నిజమైన ఐఆర్‌బిఎంలకు దగ్గరగా ఉండే వ్యవస్థలను పరీక్షిస్తూ ఉండవచ్చు. ఇవి హిందూ మహాసముద్రంలో మరింత లోతుగా, దక్షిణ ఐరోపాలోకి కూడా ప్రవేశించే అవకాశం ఉంది. తన వాస్తవ దాడి పరిధిపై శత్రువులకు స్పష్టత లేకుండా చేయడం ద్వారా, టెహ్రాన్‌కు ఇది పైచేయి సాధించడానికి కూడా తోడ్పడుతుంది. ఈ సిద్ధాంతపరమైన అస్పష్టత అమెరికా, యూకేల ప్రణాళికలను క్లిష్టతరం చేస్తుంది. బాలిస్టిక్ క్షిపణి పరిధిని పెంచడం అన్నది గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌పై ఒత్తిడిని పెంచుతుంది. వారి రక్షణ వ్యవస్థల సామర్థ్యాలను తిరిగి అంచనా వేసుకోవలసిన పరిస్థితిని కల్పిస్తుంది. డీగో గార్సియా ఒక చిన్న లక్ష్యం కాదు. ఇది అమెరికా శక్తి ప్రదర్శనకు ఒక అత్యంత విలువైన కేంద్రం. ఇది ఒక కీలకమైన లాజిస్టిక్స్, స్ట్రైక్ వేదికగా పనిచేస్తుంది. ఇది అమెరికా భారీ బాంబర్లు, నిఘా విమానాలకు నిలయం. ఈ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకోవడం అనేది చెప్పుకోదగిన అడుగని, శత్రువు ఊహించిన దానికన్నా ఇరాన్ క్షిపణుల పరిధి ఉందని ఇది చూపుతుందని ఇరాన్ వార్తా సంస్థ మెహర్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. డీగో గార్సియాపై దాడికి ప్రయత్నించడం ద్వారా, ఇరాన్ సంఘర్షణ క్షేత్రాన్ని మధ్యప్రాచ్యం నుండి హిందూ మహాసముద్ర ప్రాంతానికి మార్చింది. దీనివల్ల అమెరికా-యూకే కూటమికి ఆటంకాలు ఏర్పడవచ్చు.

# ద్రవ్యోల్బణం దరువు

మొదటి పేజీ తరువాయి

ఇక ఇది జరగడానికి ఎంతో సమయం పట్టదు——ఎన్నికల తర్వాత, పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి ధరలు కూడా పెంచుతారు. మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశం గానీ, వ్యూహం గానీ లేదు——కేవలం డొల్ల మాటలు మాత్రమే వారికి ఆసరా. ప్రభుత్వం ఏమి చెబుతోందన్నది ప్రశ్న కాదు——దాని ఫలితంగా మీ నెత్తిన పడే భారం ఏమిటన్నదే అసలు ప్రశ్న, అని ఆయన అన్నారు. రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తూ, ఇరాన్ ప్రతీకార చర్య భారతదేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తుందని అన్నారు. ఎందుకంటే మనం అక్కడి నుండి వచ్చే గ్యాస్, ఎల్‌పిజి, ముడి చమురుపై ఆధారపడి ఉన్నాము, ఈ వనరులను పునరుద్ధరించడానికి సంవత్సరాలు పడుతుంది అని పేర్కొన్నారు. మన వాణిజ్యం కోసం మనం అమెరికాపై ఆధారపడి ఉన్నామన్నదే మొత్తం వాదన. కానీ వాస్తవం ఏమిటంటే, ఇంధనం లేకుండా ఏ వాణిజ్యం కానీ, ఏ తయారీ కానీ జరగదు. మనకు ఇంధనం ఎక్కడి నుంచి వస్తుంది? అది హోర్ముజ్ జలసంధి ద్వారా మధ్యప్రాచ్యం నుంచి వస్తుంది. మన ఇంధన వనరులు తరిగిపోతే మనకు మిగిలే బలం ఏముంటుంది. ఇది మౌనంగా ఉండే సమయం కాదని నేను ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. గల్ఫ్‌లోని పెట్రోలియం, గ్యాస్ వనరుల కోసం ఇరాన్ తీసుకునే ప్రతీకార చర్యలు చివరికి మన ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తాయి, ఎందుకంటే మనం అక్కడి నుంచి వచ్చే గ్యాస్, ఎల్‌పిజి, ముడి చమురుపై ఆధారపడి ఉన్నాం, ఈ వనరులను పునరుద్ధరించడానికి సంవత్సరాలు పడుతుంది, అని ఆయన అన్నారు. శుక్రవారం నాడు రూపాయి రికార్డు స్థాయిలో 93.71 కనిష్టానికి పడిపోయింది. గత నాలుగేళ్లలో ఒక్కరోజులో ఇంత భారీ పతనాన్ని నమోదు చేయడం ఇదే తొలిసారి.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలి

**హైదరాబాద్, మార్చి 21 (వుదయం ప్రతినిధి) :** కొద్ది మంది ధనవంతుల కోసం విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం శనివారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో చావ రవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ రాష్ట్రంలో యుకె పాఠశాలల ఏర్పాటు కోసం ఆయా యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపి ఆహ్వానించడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు.



# పోటాపోటీగా యుద్ధం

మొదటి పేజీ తరువాయి

నాటో మిత్రులు పిరికిపందలన్న ట్రంప్‌ః హోర్ముజ్ జలసంధి నౌకా రవాణా మార్గాన్ని ఇరాన్ నియంత్రించడానికి వ్యతిరేకంగా సైనిక సహాయం అందించాలన్న తన డిమాండ్‌ను పట్టించుకోనందుకు, అమెరికా నాటో మిత్రదేశాలను ట్రంప్ పిరికిపందలని అని ముద్ర వేశారు.

**ఇరాన్ సైనిక బెదిరింపులు :** అమెరికా, ఇజ్రాయెల్ అధికారులు, సైనిక కమాండర్లు సెలవుల్లో ఉన్నప్పుడు గానీ, వినోద కేంద్రాలను సందర్శిస్తున్నప్పుడు గానీ వారిని వెంటాడి వేటాడతామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

## ఇరాన్ చమురుపై ఆంక్షల సడలింపు

మొదటి పేజీ తరువాయి

టెహ్రాన్ మాత్రం రాజీ పడటానికి సిద్ధంగా లేదు. అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ వెల్లడించింది. ఈ విషయం గురించి ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. చమురు గురించి ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ఆందోళనలను తగ్గించేందుకే యుఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

**జోక్యం చేసుకోవడానికి ఐరాస సిద్ధం**

ఇలా ఉండగా, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు ఐరాస సిద్ధంగా ఉందని ఐరాస సెక్రెటరీ జనరల్ ఆంటొనియో గుటిరెజ్ ప్రకటించారు. ఉక్రెయిన ధాన్యాలు, ఎరువులను 2022లో బ్లాక్ సీలో అడ్డుకున్న సమయంలో అంతర్జాతీయ సంస్థ రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య ఇటువంటి ఒప్పందాన్ని కుదిర్చేందుకు తోడ్పడిందని వివరించారు. గతంలో ఉన్న పరిస్థితుల వంటి పరిస్థితులను హోర్ముజ్ జలసంధిలో సృష్టించడం సాధ్యమా కాదా అని పరిశీలించాలన్నది తన లక్ష్యమని గుటెరెజ్ పొలిటికో వార్తా సంస్థకు తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని గురించి ఐరాస గల్ఫ్ దేశాలతో, యూరోపియన్ కౌన్సల్‌తోనూ చర్చిస్తోందని తెలిపారు.

# నతాంజ్ పై మళ్లీ దాడి

మొదటి పేజీ తరువాయి

అందుకే వారు నతాంజ్ ను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. ఇదిలా ఉండగా, తమ దాడుల వల్ల ఇరాన్‌కు భారీ నష్టం కలిగిందని, ఆ దేశానికి యురేనియం శుద్ధి చేసే, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన కొద్ది సమయంలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. యుద్ధం ప్రారంభమైన తొలి వారంలోనే నతాంజ్‌పై దాడి జరిగిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ_ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అనేక భవనాలు ధ్వంసమైనట్టు ఉపగ్రహ చిత్రాలు చూపాయి. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండేంత భారీ దాడి కాదని, అణు కేంద్రానికి పెద్దగా నష్టం జరగలేదని తెలిపింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు సుమారు 220 కిమీ దూరంలో ఉన్న ఈ అణుశుద్ధి కేంద్రంపై గత ఏడాది కూడా అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే.

# ఇరాన్‌కు రష్యా విశ్వసనీయ మిత్రుడు: పుతిన్

మొదటి పేజీ తరువాయి

చర్చల్లో పాల్గొన్న విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆ వార్తా సంస్థ ఈ కథనాన్ని ప్రచురించింది. రష్యా ప్రతినిధి డిమిట్రియేవ్ ఎక్స్ ను వేదికగా చేసుకొని ఈ తప్పుడు కథనాల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లోని యుద్ధ అనుకూల వర్గాలకు పొలిటికో కరపత్రంగా మారిందని అమెరికా రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్వేత సౌధంలోని వ్యవహారాలు, అంతర్గత చర్చలపై పొలిటికోకు ఎలాంటి సమాచారం లేదని అన్నారు. రష్యా, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు పెంచే ఇలాంటి కథనాలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. ఇక పశ్చిమాసియా ఉద్రిక్తతలకు సంబంధించి మరో అంతర్జాతీయ మీడియా సంస్థ వాషింగ్టన్ పోస్టు ఇటీవల కీలక కథనాన్ని ప్రచురించింది. అమెరికా యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్‌ల కదలికలకు సంబంధించిన కీలక నిఘా సమాచారాన్ని రష్యా ఇరాన్‌కు చేరవేసిందని పేర్కొంది. ఈ వార్తలను కూడా క్రెమ్లిన్ అప్పట్లో తోసిపుచ్చింది.

# విద్య, వైద్యాలకు నిధులు పెంచాలి

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు ఇవ్వబోమన్నట్టుగా కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు స్టేట్ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ పడిపోతున్నాయనీ, కేంద్రం ఆధిపత్యంతో రాష్ట్రాల ఆదాయ వనరులు గణనీయంగా పడిపోయాయని వివరించారు. వనరులు తగ్గటంతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేని పరిస్థితిలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చెప్పారు. ద్రవ్యోల్బణం తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటనీ, దీంతో తెలంగాణ ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్నదని తెలిపారు. ధనికుల, పేదల సంపదను కలిపి తలసరి ఆదాయం రూ.4 లక్షల కోట్లకుపైగా ఉందని గొప్పలు చెప్పుకోవడం వల్ల ప్రయోజనం లేదన్నారు. సంపద పంపిణీలో తీవ్ర అసమానతలు ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ సర్కారును మించి అప్పులు చేస్తూ పోతున్నదని విమర్శించారు. కేసీఆర్ పదేండ్లలో ఆరు లక్షల కోట్లకుపైగా అప్పు చేసి పోతే కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేండ్లలోనే 3.49 లక్షల కోట్ల అప్పు చేసిందని ఎత్తిచూపారు. ఈసారి బడ్జెట్‌లో రూ.82 వేల కోట్ల అప్పు చేయబోతున్నట్టు పొందుపర్చారని వివరించారు. అప్పు పరిమితుల మేరకు ఓకేగానీ విపరీత అప్పులు ప్రమాదకారం అని హెచ్చరించారు. మిగులు ఆదాయం ఉన్న తెలంగాణ రాష్ట్రం పదేండ్లలో అత్యధిక అప్పులున్న పది రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఏమోనా 65 వేల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమంగా తొలగించాలని రాష్ట్ర సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. విద్యారంగానికి 15 శాతం కేటాయిస్తామని చెప్పి 8 శాతం కేటాయించడమేంటని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో పైపై మెరుగులు తప్ప ఏమీ లేదనీ, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి మనుగడ కష్టమని హెచ్చరించారు. తెలంగాణ అస్తిత్వ ఉనికి ప్రమాదంలో పడిందనీ, తెలంగాణను కాపాడుకునేందుకు మరోమారు ఉద్యమాలు చేయాల్సిన అవసరం నెలకొందని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ...సామాజిక పరిణామ క్రమానికి బడ్జెట్ ఒక సాధనం అని చెప్పారు. అతి సంపన్నుల నుంచి పన్నులు తీసుకోకుండా పేదలకు సంక్షేమం ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. యూఎస్‌లో తమపై 40 శాతం పన్ను వేయాలని అక్కడి ధనికులు కోరుతున్నారనీ, ప్రజల్లో క్రమంగా తిరుగుబాట్లు మొదలవుతుండటం, సోషలిస్టు భావజాలం విస్తరిస్తుండంతోనే ఇలా చేస్తున్నారని తెలిపారు. మన దేశంలోని సంపన్నులపై అదనంగా రెండు శాతం పన్ను వేస్తే పేదలకు సంక్షేమం సాధ్యమని ప్రభాత్ పట్నాయక్ చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. స్వీడన్‌లో ధనికులపై 60 శాతం పన్నులు వేస్తారనీ, ఆ దేశంలో విద్య, వైద్యం, రవాణా రంగాలనే ప్రభుత్వమే ఉచితంగా కల్పిస్తున్నదని వివరించారు. ఆ మూడూ ప్రజలకు ఉచితంగా ఇస్తే ఆటోమేటిక్‌గా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని చెప్పారు. మన దేశంలో ధనికులకు, పేదలకు ఒకేలా 30 శాతం పన్నుల ఫిక్స్‌డ్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రాల నుంచి పన్నుల అధికారాన్ని కేంద్రం లాక్కున్నదని తెలిపారు. తమిళనాడు, కర్నాటక, బెంగాల్ తో పోల్చినప్పుడు మనది మంచి బడ్జెట్ అనీ, అయితే రూ.6 లక్షల కోట్ల అప్పు చేయడం హెచ్చరిక లాంటిదని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యకు 12 నుంచి 13 శాతం నిధులు కేటాయించేవారనీ, ఇప్పుడు 8 శాతానికి పరిమితం చేయడం దారుణమన్నారు. చిన్నరాష్ట్రంలో 13 ప్రయివేటు వర్సిటీలు ఎందుకని ప్రశ్నించారు. దీని వెనుక ప్రభుత్వ స్కూళ్లను, కాలేజీలను, వర్సిటీలను నిర్వీర్యం చేసే కుట్ర ఉందని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మిగిలిన డబ్బులను ఏం చేస్తున్నారని మహిళలను ప్రశ్నిస్తే తమ పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో చదివిస్తూ ఫీజులు కడుతున్నామని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని కార్పొరేట్ సంస్థలకు మళ్లించే ఆలోచన కూడా పాలకులకు ఉందని తెలిపారు. ప్రభుత్వ రంగంలోని పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేస్తే పిల్లలను ప్రయివేటుకు పంపాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. బడ్జెట్‌లో విద్యకు ఢిల్లీ 24 శాతం, కేరళ 23 శాతం, రాజస్తాన్ 21 శాతం కేటాయిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మన దగ్గర ఎనిమిది శాతానికే ఎందుకు పరిమితం చేస్తున్నారని నిలదీశారు. బ్రెజిల్ దేశం తన బడ్జెట్‌లో విద్యకు 24 శాతం కేటాయిస్తుంటే మన కేంద్ర ప్రభుత్వం మూడు శాతం కేటాయించడాన్ని బట్టే మన పాలకులు విద్య రంగాన్ని ఎంత మేరకు విస్మరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చునన్నారు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయిస్తే సంక్షేమానికి ఆటోమేటిక్‌గా కొంత మేర తగ్గించవచ్చునన్నారు. నిమ్స్‌కు రూ.600 కోట్లు ఇస్తే అత్యున్నత ప్రమాణాలతో పేదలకు వైద్యం ఉచితంగా అందించడం సాధ్యం కాదా? అని ప్రశ్నించారు. టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ... ఒకపక్క రాష్ట్రాల ఆదాయ వనరులు,



కేంద్రం నుంచి వచ్చేవాటాలు తగ్గుతున్నాయనీ, మరోపక్క ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రానికే పంపే వాటాలో తిరిగి 42 శాతమే వస్తున్నదనీ, ఆ కేటాయింపుల్లోనూ బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒకలా, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలకు మరోలా ఉంటున్నదని ఎత్తిచూపారు. ఎక్సైజ్, స్టాంప్స్, కస్టమ్స్, వాహనాల కొనుగోళ్ల ద్వారా వచ్చే ఆదాయమే కీలంగా మారుతున్నదని చెప్పారు. కేంద్రం తీరుతో సంక్షేమం, అభివృద్ధికి నిధులను బ్యాలెన్స్ చేయలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి 24 వేల కోట్ల గ్రాంట్లు వస్తాయని రాసుకున్నప్పటికీ వాస్తవానికి అవి రూ.7 నుంచి రూ.8 వేల కోట్లకు మించడం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిధుల్లో కోత పెట్టిందనీ, సర్వశిక్ష అభియాన్ జీతభత్యాలను కూడా పెంచడం లేదని ఎత్తిచూపారు. కేంద్రం వాటాలు తగ్గినప్పుడు ఆదాయ వనరుల సమీకరణలో రాష్ట్రాలకు ఇబ్బందులు తప్పవన్నారు. గతంలో తక్కువ వడ్డీకి ఎల్ఐసీ, చిన్నమొత్తాల సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు తీసుకునేవనీ, దీనిపై కేంద్రం ఆంక్షలు విధించడంతో రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరి పరిస్థితుల్లో 10 శాతం వడ్డీకి అప్పులు తేవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధికి లోబడి అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం నుంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు బడ్జెట్ ప్రతిపాదనలు, కేటాయింపులు, ఖర్చుల విషయానికి వచ్చేసరికి 10 నుంచి 15 శాతం మేరకు వ్యత్యాసం ఉంటున్నదని ఎత్తిచూపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..బడ్జెట్‌లో ఎక్కువగా రుణాలు, వడ్డీలు, జీతభత్యాలకే పోతే సంక్షేమం, అభివృద్ధి ఎలా అని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీలకు నిర్దిష్ట కేటాయింపులు ఏవని నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 వేల కోట్లు ఎలా సరిపోతాయని అడిగారు. కొత్తరేషన్ కార్డులు ఇచ్చారు సరే నిధుల పెంపు ఏది అని ప్రశ్నించారు. విద్యకు 8.2 శాతం కేటాయించడం దారుణమన్నారు.

దళిత సంక్షేమానికి నిధులు తగ్గించడాన్ని తప్పుబట్టారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నేత డీజీ నర్సింహారావు, రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ రమణ, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, డీవైఎఫ్ ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. వెంకటేశ్, ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, తదితరులు మాట్లాడారు. తమ రంగాలకు బడ్జెట్లో నిధులు పెంచాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

# నల్గొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

**నల్లగొండ, మార్చి 21 (వుదయం ప్రతినిధి) :** బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా నల్లగొండ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు అన్నారు. శనివారం నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామంలో ద్విచక్ర వాహనం నడుపుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ నిర్మాణ పనులకు అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణవెలంల ప్రాజెక్టు మంచి కాలువల ద్వారా నల్గొండ నియోజకవర్గంలోని చెరువులన్నింటిని నింపి ప్రతి ఎకరానికి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తన ధ్యేయమని తెలిపారు. బ్రాహ్మణవల్ల ప్రాజెక్టు నియోజకవర్గ ప్రజలకు వరం లాంటిదని, ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నీటి ద్వారా రైతులందరిలో సంతోషం వెల్లువిరుస్తుందని తెలిపారు. నల్లగొండ నియోజకవర్గం తనకు గుండెకాయ లాంటిదని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు తో భూగర్భజాలాలు పెరగడంతో పాటు కాలుల ద్వారా గ్రామంలో ప్రతి చెరువును నింపడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని అన్నారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. అప్పాజీపేట గ్రామంలో



పిల కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమ ంలో స్థానిక సర్పంచ్ గంగుల అండాలు సైదులు, ఇరిగేషన్ ఈఈ సతీష్ చంద్ర, డిఈ పిచ్చయ్య, ఏఈ నవీన్ కుమార్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పిటిసిలు పాశం, రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు, ఉప సర్పంచ్ పోలే సతీష్, రాపర్తి సతీష్, అయితగోని శేఖర్, కట్ట అంజయ్య ,కాసర్ల బిక్షపతి, గంగుల నరేందర్, నందిపాటి అశోక్ ,ఐత రాజు గణేష్, కాసర్ల సురేందర్ రెడ్డి, జాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్‌కు అధిక ప్రాధాన్యత

**మంత్రి సీతక్క ఆదేశాలతో**

**సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్**

**తీసుకున్న మిషన్ భగీరథ**

**ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం**

**సర్పంచులు గుర్తించిన తాగు నీటి**

**సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు**



**హైదరాబాద్, మార్చి 21 (ఎఎంఎస్) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గత పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్రదింపులు జరిపి, మొత్తం 12,728 గ్రామ పంచాయతీలలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పంపుల పనితీరు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన తదితర 16 కీలక అంశాలపై వివరాలు సేకరించారు. దీనిపై మంత్రి సీతక్క శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్హించారు. సర్పంచ్ ల అభిప్రాయ సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, "గ్రామ స్థాయిలో సర్పంచ్‌ల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా మిషన్ భగీరథ సేవలను మరింత మెరుగుపరుస్తాం. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. సర్పంచులు గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ వ్యవస్థ లేని మారుమూల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వర్షాకాలానికి ముందే చెక్‌డ్యాంలు నిర్మించాలని మంత్రి సూచించారు. "స్థానిక నీటి వనరులను బలోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుంది" అని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ 1916కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నట్లే, ఈ వేసవిలో కూడా మిషన్ భగీరథ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాపై వచ్చే ప్రతి సమాచారం పట్ల వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్క మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.

## నేడు సిద్ధిపేట జిల్లా నర్మేట లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన

**హైదరాబాద్, మార్చి 21 (వుదయం ప్రతినిధి) :** ఈనెల 22 ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్నారు. నంగునూరు మండలం నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో గత మూడు రోజులుగా రైతు మహోత్సవాలు జరుగుతున్నాయి. రైతు మహోత్సవాలకు వివిధ జిల్లాల నుండి భారీగా రైతులు తరలివస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన 150 స్టాల్ లలో వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ ఫామ్ తోటల పెంపకంలో మెలుకువలు ,వ్యవసాయం తో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యానవన, పాడి పరిశ్రమ, మత్స్య రంగాల ద్వారా అధిక దిగుబడి సాధించడానికి శాస్త్రవేత్తల ద్వారా మెలుకువలు నేర్చుకోవడంతో ఆధునిక వ్యవసాయాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఆదివారం 22 మార్చ్ సాయంత్రం 4 గంటలకు నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరగనుంది.

ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం పై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ,పోలీస్ కమిషనర్ ,అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటన లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించి పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శిస్తారు.తెలంగాణ లో మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీ కి శంకుస్థాపన చేస్తారు. సభ కి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రులు సూచనలు చేశారు. హెలిపాడ్ , సభ వేదిక , భద్రత, తాగు నీరు , ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్ ,విద్యుత్ ,సౌండ్ సిస్టమ్, ఫైర్,అంబులెన్స్ తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు.

## మహిళలు, విద్య, వైద్యం పట్ల మొండి చెయ్యి

**తెలంగాణ బడ్జెట్‌పై ఐద్వా ఆగ్రహం**

**హైదరాబాద్, మార్చి 21 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్ మరోసారి పాలకుల అమలు తీరు నిర్లక్ష్య వైఖరి. ఎన్నికల ముందు మహిళల అభివృద్ధే మా ధ్యేయం , మహిళా సాధికారతే మా ధ్యేయం అంటూ మహాలక్ష్మి పథకం ఉచిత సేవలు అంటూ గొప్పలు చెప్పిన ప్రభుత్వం, బడ్జెట్‌లో మాత్రం మహిళలకు, విద్య, వైద్యం రంగాలపై మొండి చెయ్యి చూపింది. ఇది హామీలకు పూర్తి వ్యతిరేకం, మహిళల పట్ల స్పష్టమైన నిర్లక్ష్యం అని ఐద్వా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. మొత్తం సుమారు ₹3,24,234వేల లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించినది కేవలం ₹26 వేల కోట్ల పరిధిలోనే ఉండటం గమనార్హం. అంటే మొత్తం బడ్జెట్‌లో 8.22 శాతం. యునెస్కో సూచించిన 15-20 శాతం కేటాయింపులతో పోలిస్తే ఇది సగానికి కూడా చేరని దుస్థితి. ఇదే సమయంలో ఆరోగ్య రంగానికి కేటాయింపు ₹12-13 వేల కోట్ల మధ్యే ఉండటం, మొత్తం బడ్జెట్‌లో 5 శాతానికి కూడా తక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ ఆరోగ్య విధానం సూచించిన కనీస 8 శాతం లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. మహిళల ఆర్థిక భద్రతకు అడ్డుగోడగా ప్రచారం చేసిన మహాలక్ష్మి పథకం విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 6040. కోట్ల రూపాయలు అవసరమయ్యే ఈ పథకానికి బడ్జెట్‌లో కేవలం 4305 కోట్లు కేటాయింపు చేసి,సరిపడ నిధులు కేటాయించకుండా మాటలకే పరిమితం చేసింది. ఇది మహిళలతో చేసిన ఎన్నికల మోసం తప్ప మరొకటి కాదు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకానికి 3 వేల కోట్లు కేటాయించగా వాటిలో వడ్డిలకే 2 వేల కోట్లు పోతాయని ఒక్క వెయ్యి కోట్లతో సన్నబియ్యం ఎలా అందరికీ అందిస్తారని ఐద్వా ప్రశ్నిస్తుంది. గత బడ్జె ట్‌లతో పోలిస్తే మహిళా మరియు శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులు సరిపోవని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ విఫలమైంది.ఆశా వర్కర్లు మరియు అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపు లేదా ఇతర ప్రయోజనాలపై బడ్జెట్‌లో ఎటువంటి సానుకూల ప్రకటన లేదు.



# జాతీయం-అంతర్జాతీయం



## బిజెపి ఉనికిలేకుండా చేయడమే లక్ష్యం



**కోల్‌కత, మార్చి 21 (వుదయం):** పశ్చిమ బెంగాల్‌లో వచ్చే నెలలో జరుగనున్న ఎన్నికలకు ప్రచారం తీవ్ర విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలతో సాగుతోంది. ఈ నేపథ్యంలోనే టిఎంసి అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బిజెపిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు.

ఓటరు జాబితా సవరణ (సర్)పై పోరాటం కొనసాగిస్తానంటూ ప్రతిన బూనిన ఆమె, ప్రజల హక్కులను బలవంతంగా హరించడానికి ప్రధాని మోడీ చేస్తున్న యత్నాలను అడ్డుకుంటానని శపథం చేశారు. శనివారం రంజాన్ సందర్భంగా సెంట్రల్ కోల్‌కతలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రంలో బిజెపి ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. సర్ సాకుతో రాష్ట్రంలోని అనేక మంది ప్రజల పేర్లను తొలగించారన్నారు. కులం, వర్గంతో సంబంధం లేకుండా బెంగాల్‌లోని ప్రజలందరికీ తాను తోడుగా నిలబడ్డానన్నారు. సర్‌పై తన పోరాటాన్ని కొనసాగిస్తానని తెలిపారు. ప్రజల హక్కులను లాక్కోవడానికి ప్రధాని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటానని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, రాష్ట్రపతి పాలన కూడా విధించాలని చూస్తోందని ఆరోపించారు. అయితే, వీటన్నింటికీ తాము భయపడమన్నారు. ఈ సందర్భంగా బిజెపిపై మమత పలు విమర్శలు చేశారు. ఓట్లు చీల్చేందుకు కొందరు ద్రోహులు బిజెపి నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు.

ఇలా ఉండగా, ప్రధాని మోడీపై మమతా చేసిన ఆరోపణలను బిజెపి తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగబద్ధమైన పదవికి ఆమె అనర్హురాలని పేర్కొంది. మోడీ మైనారిటీల వ్యతిరేకి అంటూ మమతా విమర్శలు చేయడంపై బిజెపి నేత శిశిర్ బజోరియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం సీఎంను వెంటాడుతుందని ఎద్దేవా చేశారు.

## తమిళనాడులో కొత్త రాజకీయ కూటమి

**పీఎంకే రామదాస్ తో చేతులు కలిపిన శశికళ**

**234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని నిర్ణయం**



**చెన్నై :** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో మరో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. పట్టాలి మక్కల్ కచ్చి (పీఎంకే) వ్యవస్థాపకుడైన రామదాస్, దివంగత మాజీ సీఎం జయలలిత సన్నిహితురాలైన శశికళ దీని కోసం చేతులు కలిపారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని ఈ కూటమి యోచిస్తున్నది. విల్లుపురం జిల్లా తైలపురంలోని రామదాస్ నివాసానికి శశికళ వెళ్లారు. కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు గురించి సుమారు రెండు గంటల పాటు ఆయనతో చర్చించారు. కాగా, శశికళ సొంతంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కజగం (ఏఐపీటీఎంఎంకే)తో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాము ఒప్పందం కుదుర్చుకున్నట్లు రామదాస్ తెలిపారు. 'ఈ పొత్తు ఇప్పటికే తమిళనాడులో బలమైన ప్రభావాన్ని చూపింది. పలువురు ప్రత్యర్థులను కలవరపరిచింది. మరిన్ని పార్టీలు మాతో చేరుతాయని భావిస్తున్నాం' అని మీడియాతో అన్నారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని తమ కూటమి యోచిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు పీఎంకే వ్యవస్థాపకుడైన రామదాస్, ఆయన కుమారుడు అన్బుమణి రామదాస్ మధ్య పార్టీపై నియంత్రణ అంశంలో విభేదాలున్నాయి. అలాగే అన్నాడీఎంకేలో తన ప్రభావాన్ని తిరిగి పొందడానికి శశికళ పోరాడుతున్నారు. పార్టీని ఏకం చేయడంలో విఫలమైన తర్వాత తన సొంత పార్టీ ఏఐపీటీఎంఎంకేను ఆమె ఏర్పాటు చేశారు. అయితే తమ మాతృ పార్టీల్లో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న రామదాస్, శశికళ రాజకీయ ప్రాబల్యం పునరుద్ధరణ, తమ క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడానికి ఈ పొత్తును ఒక మార్గంగా భావిస్తున్నారు. దీంతో వీరిద్దరూ కలిసి కొత్త రాజకీయ కూటమిని ఏర్పాటు చేశారు. కాగా, తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నది.




## గ్లోబల్ ట్రేడ్ సంక్షోభం వైపు.

**హర్మూజ్ జలసంధిని తెరవండి.. ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి..**

**న్యూ డిల్లీ ;**

గత కొన్ని రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్‌అమెరికా మధ్య భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ యుద్ధంలో ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు కోల్పోగా.. ఎన్నో కోట్ల విలువైన ఆస్తిలు ధ్వంసమయ్యాయి. ఇంత జరిగిన ఈ యుద్ధ వాతావరణం చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. ఈ యుద్ధం కారణంగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేసింది. దీంతో ఇంధన లోటుతో పలు దేశాలు ఇబ్బందులు ఎదురుకుంటున్నాయి. తాజాగా హర్మూజ్ జలసంధిని తెరవాలని పలు దేశాలు ఇరాన్‌ను కోరాయి. దాడులను ఆపాలని కూడా ఇరాన్‌ను 22 సంయుక్త ప్రకటన చేశాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను పలు దేశాలు ఖండించాయి. యుఎఇ, బహ్రెయిన్, యుకె, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా సహా పలు దేశాలు ఈ దాడులను ఆపాలని విజ్ఞప్తి చేశాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాల ప్రజలపై దుష్ప్రభావం పడుతోందని ప్రకటించాయి.

## సోషల్ మీడియాలో వీడియోలు పారదర్శక విచారణకు ముప్పు

**న్యూఢిల్లీ, మార్చి 21 (వుదయం):** తాము చూసిన ఘటనలను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి, ఆ వీడియోలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణి పట్ల సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రజల మనస్సుల్లో పక్షపాతాన్ని సృష్టించేలా నిందితుల వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చీ, విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు.

ఆ మార్గదర్శకాల ఫలితం కోసం వేచి ఉండాలని పిటిషనర్ హేమేంద్ర పటేల్‌కు ధర్మాసనం సూచించింది. పటేల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ మీడియాగా మారారని ఆయన అంగీకరించారు.

నిందితులకు సంకెళ్లు వేయడం, తాళ్లతో కట్టడం, ఊరేగించడం, మోకాళ్లపై కూర్చోబెట్టడం వంటి చిత్రాలను పోలీసులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అనేది ఇటీవలి కాలంలో ఒక ధోరణిగా మారిందని, ఇది వారి వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రజలలో పక్షపాతాన్ని కూడా పెంచుతుందని సీనియర్ న్యాయవాది ఎత్తి చూపారు.

పోలీసు మీడియా సమావేశాలపై ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని రూపొందించడానికి పోలీసులకు మూడు నెలల సమయం ఇచ్చామని, ఇప్పుడు పోలీసుల గురించి మాట్లాడటం మానేసి, పోలీసు, సాంప్రదాయ, సోషల్ మీడియా కోసం ఒక సమగ్ర యంత్రాంగాన్ని కోరాలని జస్టిస్ బాగ్చి శంకరనారాయణన్‌కు సూచించారు.

కాగా, మీడియా——ముఖ్యంగా సోషల్ మీడియా, ప్రజల సంగతేమిటి? వారిని నియంత్రించగలమా? పోల్చి చూస్తే, వారి అభిప్రాయాలతో ఎవరైనా విభేదించవచ్చినప్పటికీ, టీవీ ఛానళ్లు చాలా వరకు సంయమనం పాటిస్తున్నాయి, అని జస్టిస్ బాగ్చి వ్యాఖ్యానించారు.

పిటిషన్‌లో లేవనెత్తిన తక్షణ ప్రశ్నకు మించి, ప్రస్తుత అంశానికి మరింత విస్తృతమైన పరిశీలన అవసరం కావచ్చని ఆయన అన్నారు.






పోలీసులు మీడియాకు ఇచ్చే వివరణలు బాధ్యతాయుతంగానూ, సమంజసంగానూ ఉండాలని, వాటిలో ఎటువంటి పక్షపాతానికీ తావు ఉండకూడదని మేము అర్థం చేసుకున్నాం; ఎందుకంటే, న్యాయ వ్యవస్థలో దర్యాప్తు సంస్థ అనేది బాధితుడికి అనుకూలంగానో లేదా నిందితుడికి అనుకూలంగానో వ్యవహరించదు అని జస్టిస్ బాగ్చి అన్నారు.

మీడియా ట్రయల్ అంశాన్ని సుప్రీం కోర్టు మొట్టమొదటగా, 2012 నాటి సహారా వర్సెస్ సెబీ తీర్పులో ప్రస్తావించిందని న్యాయవాది శంకరనారాయణన్ పేర్కొన్నారు. పోలీసు అధికారులు మీడియా సమావేశాల సమయంలో ఉద్వేగానికి లోనవడం, అలాగే విచారణలో ఉన్న కేసులలో మీడియా ట్రయల్స్ వల్ల తలెత్తుతున్న ప్రమాదాలే తమ ఆందోళనకు కారణమని జస్టిస్ బాగ్చి తెలిపారు. సత్యాన్ని వెలికితీయడానికి స్వతంత్ర విచారణను నిర్వహించడం దర్యాప్తు సంస్థ విధి. ఈ ప్రక్రియలో సమతుల్యత పాటించేలా చూడటంలో, ఈ నియమావళి అత్యంత సానుకూలమైన ముందడుగు అని ధర్మాసనం పేర్కొంది.

న్యాయమైన విచారణ అనే అంశానికి సమగ్రమైన విధానం అవసరం కాబట్టి, పోలీసుల కోసం మార్గదర్శకాలు లేదా ప్రామాణిక కార్యాచరణ విధానం అమలులోకి వచ్చే ఏప్రిల్ తర్వాత, విస్తృత పరిధితో తిరిగి దాఖలు చేయడం మంచిదని ధర్మాసనం సూచించింది. ఈ క్రమంలో ప్రస్తుత పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరింది. కోర్టు సూచనను పరిగణనలోకి తీసుకుని, శంకరనారాయణన్ ఈ విషయాన్ని ఉపసంహరించుకోవడానికి అంగీకరించారు.



## ఆధునిక యుద్ధం..సరిహద్దులు దాటింది

నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలన్నారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు.

ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్.. షేర్ చేసిన ప్రధాని మోదీ.. దేని గురించంటే?

ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యం పెంపు దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజాప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'నారీ శక్తి'కి ఊతంసైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

## ఆరు బ్యాంకుల్లో దొంగతనం

అమెరికా )లో ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఒకే బ్యాంకుకి చెందిన పలు బ్రాంచిలలో ఓ వ్యక్తి వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. అయితే, ఆ చోరీల్లో అతడు దోచుకున్న మొత్తం విలువ రూ.56వేలు మాత్రమే ఉండటం గమనార్హం. నిందితుడిని గుస్తావో డిజీసస్ టోర్రెస్ (33)గా పోలీసులు గుర్తించారు. న్యూయార్క్‌లోని ఛేజ్ బ్యాంక్‌లో టోర్రెస్ ఇటీవల దోపిడీ చేసేందుకు వెళ్లాడు. 'డబ్బులు ఇవ్వకపోతే.. బ్యాంక్‌లోని కస్టమర్‌లను గాయపరుస్తా' అని రాసి ఉన్న స్లిప్‌ను క్యాషియర్‌కి ఇచ్చాడు. దీంతో భయపడిన ఆ బ్యాంకు సిబ్బంది.. అతడికి కొంత డబ్బు ఇచ్చారు. ఇలా నగరంలోని ఛేజ్ బ్యాంక్‌కు చెందిన పలు బ్రాంచీలకు వెళ్లి సిబ్బందిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, కొన్నిచోట్ల అతడికి ఎలాంటి నగదు లభించకపోవడం గమనార్హం. హార్లెమ్‌లోని బ్యాంకులో కేవలం 20 డాలర్లతోనే టోర్రెస్ వెనుదిరగాల్సి వచ్చింది. అలా అతడు దోచుకున్న మొత్తం విలువ 605 డాలర్లు (భారత కరెన్సీలో రూ.56వేలు) మాత్రమే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. టోర్రెస్‌కు గతంలో నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. 2021 జూన్‌లో బెల్లెవిల్లేలోని ఛేజ్ బ్యాంక్‌లో చోరీకి పాల్పడింది కూడా ఇతడేనని అనుమానిస్తున్నారు. నాటి దోపిడీలో కూడా ఇలాగే క్యాషియర్‌కు స్లిప్ ఇచ్చి.. బెదిరించినట్లు వెల్లడించారు.

## జీడి రైతుకు 'సిరి' వెల్లువ

### ఉప ఉత్పత్తులతో రెట్టింపు ఆదాయం!

సాధారణంగా జీడి తోటలంటే కేవలం జీడిపిక్కల కోసమేననే భావన రైతుల్లో బలంగా ఉంది. కానీ, ఆ పిక్కకు అనుబంధంగా ఉండే 'జీడిపండు' రైతు ఆర్థిక స్థితిగతులను మార్చేయగల అద్భుత శక్తి అని వ్యవసాయ రంగ నిపుణులు నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం దేశంలో ఏటా లక్షలాది టన్నుల జీడిపండు వృథాగా నేలపాలవుతోందని, దీన్ని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పుత్తూరులోని ఐకార్‌జీడి పరిశోధన డైరెక్టరేట్ (డీసీఆర్) నిర్వహించిన పరిశ్రమల ముఖాముఖి సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది.

డీసీఆర్ డైరెక్టర్ జె.దినకర అడిగా సమర్పించిన వివరాల ప్రకారం, దేశంలో జీడిపండు వినియోగం అత్యల్పంగా ఉంది. భారతదేశంలో ఏటా సుమారు 60 లక్షల టన్నుల జీడిపండు ఉత్పత్తి అవుతోంది. ఇందులో కేవలం 1 శాతం మాత్రమే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి వాడుతున్నారు. ఒక హెక్టారు జీడి తోటలో సగటున 1 టన్ను జీడిపిక్కలు లభిస్తే ఏకంగా 8 టన్నుల జీడిపండు లభిస్తుంది. అంటే మనం ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తున్న పిక్కల కంటే 8 రెట్లు ఎక్కువగా పండ్లు అందుబాటులో ఉన్నప్పటికీ సరైన అవగాహన, సాంకేతికత లేక వాటిని వృథా చేస్తున్నాం. జీడిపండు నుంచి రసం తీసిన తర్వాత మిగిలే పిప్పితోనూ ఆదాయం పొందే మార్గాలను శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. కర్ణాటక వెటర్నరీ, యానిమల్ అండ్ ఫిషరీస్ సైన్సెస్ యూనివర్సిటీ సహకారంతో జీడిపండు పిప్పి పొడితో చేపల మేతను తయారు చేసే సాంకేతికతను డీసీఆర్ అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే స్వచ్ఛమైన జీడిపండు రసం, పాశ్చరైజ్డ్ జ్యూస్, లిక్విడ్ స్వీటెనర్, జీడిపండు పిప్పి టీ వంటి వినూత్న ఉత్పత్తుల సాంకేతికతను డైరెక్టరేట్ సిద్ధం చేసింది.

బ్రెజిల్ ఆదర్శంబ్రెజిల్ వంటి దేశాల్లో జీడిపండును అత్యధికంగా వినియోగించుకుంటున్నారని నిపుణులు పేర్కొన్నారు. భారతదేశంలో చిన్న స్థాయిలోనైనా ఈ ప్రయత్నం మొదలుపెడితే భవిష్యత్తులో ఇది పెద్ద పరిశ్రమగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రభుత్వ సంస్థలు తాము అభివృద్ధి చేసిన సాంకేతికతను బదిలీ చేసేటప్పుడు వసూలు చేసే రాయల్టీలు స్టార్టప్‌లను నిరుత్సాహపరిచేలా ఉండకూడదు. నామమాత్రపు ధరలకే సాంకేతికతను అందిస్తే యువత ఈ రంగంలోకి వస్తారు' అని చెబుతున్నారు. కేవలం జీడిపిక్కల అమ్మకానికే పరిమితం కాకుండా జీడిపండును కూడా ఒక వాణిజ్య పంటగా గుర్తిస్తే రైతులకు ఇది బోనస్ ఆదాయం అవుతుంది. ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించి ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది కొత్త ఊపిరి పోయడం ఖాయం.

## ఖతార్ ఎల్‌ఎన్‌జి ఎగుమతులకు 5 ఏళ్ల పాటు అంతరాయం


వుదయం డెస్క్, మార్చి పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాన్ జరిపిన దాడులు ఖతార్ ఎల్‌ఎన్‌జి ఎగుమతి సామర్థ్యాన్ని 17 శాతం నష్టం కలిగించాయి. దీనివల్ల ఆ దేశానికి వార్షిక ఆదాయ నష్టం 20 బిలియన్ డాలర్లని ఖతార్ ఇంధన సిఇఒ, ఇంధన వ్యవహారాల మంత్రి సాద్ అల్ కాబీ వెల్లడించారు.

అల్‌కాబీ ప్రకారం, ఈ మరమ్మతుల కారణంగా ఏటా 12.8 మిలియన్ టన్నుల ఎన్ ఎన్‌జి ఉత్పత్తి మూడు నుండి ఐదు సంవత్సరాల పాటు నిలిచిపోనుంది; ఇది చైనా, భారతదేశంతో సహా యూరోపియన్, ఆసియా దేశాలకు సరఫరాలను ప్రమాదంలో పడేస్తుంది.

గత కొన్ని రోజులుగా ఇరాన్ జరిపిన దాడులలో, ఖతార్‌కు చెందిన 14 ఎల్ ఎన్‌జి రైళ్లలో కనీసం రెండు, అలాగే దాని రెండు 'గ్యాస్‌టులిక్విడ్స్' (జిటిఎల్) కేంద్రాలలో ఒకటి దెబ్బతిన్నాయి.

"ఖతార్ —— కేవలం ఖతార్ మాత్రమే కాదు, ఈ ప్రాంతం మొత్తం —— ఇటువంటి దాడికి గురవుతుందని నేను నా కలలో కూడా ఊహించలేదు. మరీ ముఖ్యంగా రంజాన్ మాసంలో, ఒక సోదర ముస్లిం దేశమే మాపై ఈ విధంగా దాడి చేస్తుందని నేను అస్సలు అనుకోలేదు," అని అల్‌కాబీ వార్తా సంస్థ రాయిటర్స్ తో అన్నారు.

దెబ్బతిన్న రెండు ఉత్పత్తి యూనిట్ల కారణంగా, ఇటలీ, బెల్జియం, దక్షిణ కొరియా, చైనాలకు సరఫరా కావాల్సిన ఎల్ ఎన్‌జికి సంబంధించి గరిష్టంగా ఐదేళ్ల దీర్ఘకాలిక ఒప్పందాలపై 'ఫోర్స్ మేజర్' (అనివార్య పరిస్థితుల ప్రకటన) ప్రకటించాల్సి వస్తుందని ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఖతార్ ఎనర్జీ తెలిపింది. మేము ఇంతకుముందే ఒకసారి ఇలా ప్రకటించాము, కానీ అది స్వల్పకాలికానికి మాత్రమే పరిమితం. ఇప్పుడు మాత్రం, ఆ ప్రభావం ఎంత కాలం ఉంటుందో, ఆ కాలమంతటికీ ఇది వర్తిస్తుంది, అని అల్‌కాబీ పేర్కొన్నారు.



తన సొంత గ్యాస్ మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ దాడులు చేసిన తర్వాత, గల్ఫ్ చమురు, గ్యాస్ కేంద్రాలపై ఇరాన్ వరుస దాడులకు పాల్పడింది. , ఖతార్‌లోని అతిపెద్ద ఎల్ ఎన్‌జి ప్లాంట్ అయిన రాస్ లఫాన్‌పై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో ఈ గందరగోళం మరింత తీవ్రమైంది. దీని తరువాత, ఖతార్ ఎనర్జీ తన మొత్తం ఎల్ ఎన్‌జి ఉత్పత్తిపై ఫోర్స్ మేజర్ ప్రకటించవలసి వచ్చింది.

ఉత్పత్తిని తిరిగి ప్రారంభించాలంటే, ముందుగా మనం ఘర్షణలను ఆపాలి, అని అల్‌కాబీ రాయిటర్స్‌తో అన్నారు. ఈ దాడుల వల్ల జరిగిన నష్టం ఈ ప్రాంతాన్ని 10 నుండి 20 సంవత్సరాలు వెనక్కి నెట్టిందని ఆయన అన్నారు. వాస్తవానికి, చాలా మందికి సురక్షితంగా నివసించడానికి ఇది ఒక సురక్షితమైన ప్రదేశం. ఆ ప్రతిష్ట దెబ్బతిందని నేను భావిస్తున్నాను అని ఆయన అన్నారు.

మంత్రి ప్రకారం, దెబ్బతిన్న ఎల్ ఎన్‌జి కేంద్రాలలో అమెరికాకు చెందిన ప్రముఖ చమురు సంస్థ ఎక్సాన్‌మొబిల్ భాగస్వామిగా ఉండగా, దెబ్బతిన్న జిటిఎల్ కేంద్రంలో షెల్ భాగస్వామిగా ఉంది. దీని మరమ్మతులకు ఒక సంవత్సరం వరకు పడుతుంది.

ఎల్‌ఎన్‌జికి మించిన పరిణామాలు

ప్రాథమిక అంచనాల ప్రకారం, దాడుల సమయంలో జరిగిన నష్టం కారణంగా, ఖతార్ కండెన్సేట్ ఎగుమతులు సుమారు 24 శాతం, ఎల్‌పిజి ఎగుమతులు 13 శాతం తగ్గుతాయి. హీలియం ఉత్పత్తి 14 శాతం, నాఫ్తా, సల్ఫర్ రెండూ 6 శాతం తగ్గుతాయి.

ఈ నష్టాల ప్రభావం భారతదేశంలోని రెస్టారెంట్లలో ఉపయోగించే ఎల్‌పిజి నుండి, హీలియంను ఉపయోగించే దక్షిణ కొరియా చిప్‌మేకర్ల వరకు విస్తరించి ఉంది. దెబ్బతిన్న యూనిట్ల నిర్మాణానికి సుమారు 26 బిలియన్ డాలర్లు ఖర్చవుతాయని అల్‌కాబీ తెలిపారు.

భారతదేశం తన సహజ వాయువు అవసరాలలో సుమారు 20 శాతాన్ని ఖతార్ నుండి దిగుమతి చేసుకుంటున్నట్లు సమాచారం.

ఖతార్‌కు చెందిన భారీ 'నార్త్ ఫీల్డ్' విస్తరణ ప్రాజెక్టు పనులు ప్రస్తుతం ఏవీ జరగడం లేదని, ఈ ప్రాజెక్టు ఏడాదికి పైగా ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఒకవేళ ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేస్తే, అది ఇరాన్ , ఇజ్రాయెల్ మధ్య ఉన్న విషయం మాత్రమే. దానికి మాకూ, ఈ ప్రాంతానికీ ఎటువంటి సంబంధం లేదు, అని ఆయన అన్నారు.

## శత్రుదేశాల మిత్రపక్షాలే లక్ష్యం

**తమ శత్రుదేశాలకు సహకరించే దేశాల్లోని పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తాం**

**ఇరాన్ హెచ్చరిక**



న్యూ డిల్లీ );తమ శత్రుదేశాలతోపాటు, అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే దేశాల్లోని పర్యాటక కేంద్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఆయా దేశాల్లోని రిక్రియేషనల్ పార్కులు, ఇతర టూరిస్ట్ డెస్టినేషన్స్ లక్ష్యంగా చేసుకుంటామని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైనిక అధికారి జనరల్ అబోల్ఫాజి షెకార్చి హెచ్చరించారు. అంటే, ఇకపై వైమానిక దాడులే కాకుండా తీవ్రవాద దాడులకు కూడా పాల్పడుతుందా అనే అనుమానాలు మొదలయ్యాయి.

ఇదే సమయంలో ఇరాన్‌లోని నంటాజ్ అణుకేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్‌అమెరికా సైన్యం దాడులకు పాల్పడింది. నంటాజ్ అణుకేంద్రంపై శనివారం ఉదయం మిస్సైళ్లతో ఇజ్రాయెల్ దాడి చేసింది. అయితే, ఈ దాడుల్లో అణుకేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి లీకేజీ, రేడియేషన్ లేదని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇరాన్‌కు నంటాజ్ అణుకేంద్రం చాలా కీలకం. ఈ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేయడం ఇది రెండోసారి. యుద్ధం ప్రారంభమైన తొలి వారంలోనే ఈ కేంద్రంపై దాడి జరిగింది. అప్పుడు సమీపంలోని కొన్ని బిల్డింగులు ధ్వంసమయ్యాయి. అయితే, అప్పుడు కూడా ఎలాంటి రేడియోధార్మికత విడుదల కావడం లేదని ఇరాన్ సహా ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. ఈ అణుకేంద్రం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 220 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. గత ఏడాది జూన్‌లో జరిగిన వైమానిక దాడుల సందర్భంగా కూడా ఇజ్రాయెల్ ఈ కేంద్రంపై దాడికి పాల్పడింది. ఇరాన్‌పై దాడిని త్వరలోనే ముగిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఈ దాడి జరగడం విశేషం. ఇరాన్ యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలకు చేరింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ట్రంప్ దాదాపు 3,000 మంది మెరైన్ సైనికుల్ని మోహరిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్.. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది.

## ఎఫ్-35 ప్రతిష్ఠకు దెబ్బ!

ఎఫ్35 ప్రధాన బలం.. స్టెల్త్! ప్రత్యర్థి రాడార్లు నింగిలోకి పంపే తరంగాలు ఒక విమానానికి తగలగానే.. ఒక నిర్దిష్ట పద్ధతిలో అవి పరావర్తనం చెందుతాయి. దాన్ని ఆ జెట్‌కు సంబంధించిన 'రాడార్ ముద్ర'గా పిలుస్తారు. ఇలా పరావర్తనం చెందిన తరంగాలు రాడార్‌కు సంబంధించిన రిసీవర్‌కు తిరిగొస్తాయి. వాటి ఆధారంగా ఆ విమానాన్ని ప్రత్యర్థి సైన్యం గుర్తిస్తుంది. పరావర్తనం చెందే సంకేతాన్ని చాలా వరకూ తగ్గించడమే స్టెల్త్ పరిజ్ఞానంలో కీలకం. ఇందుకోసం స్టెల్త్ యుద్ధవిమానాల ఉపరితలాలపై ప్రత్యేక కోణాలు కలిగిన ఆకృతులు ఉంటాయి. అవి రాడార్ తరంగాలు తిరిగి రిసీవర్ వైపు వెళ్లకుండా చెల్లాచెదురు చేస్తాయి. రాడార్ తరంగాలను శోషించుకునే మిశ్రమ పదార్థాలు, కార్బన్ ఫైబర్ నిర్మాణాలు, ప్రత్యేక పూతనూ ఈ యుద్ధవిమానాలు కలిగి ఉంటాయి. ప్రత్యర్థులు రాడార్లతో పాటు పరారుణ వ్యవస్థలనూ గగనతల రక్షణకు వాడుతుంటారు. ఈ పరారుణ సాధనాలు శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే వేడి ఆధారంగా వాటిని గుర్తిస్తాయి. అందువల్ల స్టెల్త్ యుద్ధవిమానంలో ఇంజిన్లను ఎయిర్‌ఫ్రేమ్‌లో ఉంచుతారు. వాటి నుంచి వచ్చే వేడి వాయువులనూ చల్లబరచడం, చెల్లాచెదురు చేస్తారు. అలాగే ఈ జెట్ నింగిలోకి వెళ్లాక దాని రాడార్ల వినియోగం, దాని నుంచి వచ్చే ఎలక్ట్రానిక్ ఉద్గారాలు తక్కువగా ఉండేలా చూస్తారు. ప్రత్యర్థి పసిగట్టకుండా కమ్యూనికేషన్లు సాగిస్తారు.

యుద్ధవిమాన కింది భాగంలో ఉండే క్షిపణులు, రాకెట్లు.. ప్రత్యర్థి రాడార్లకు ఇట్టే దొరికిపోతాయి. అందువల్ల ఎఫ్35లో ఈ ఆయుధాలను ప్రత్యేకంగా అమర్చిన అంతర్గత అరల్లో దాచి ఉంచుతారు. ఫలితంగా అవి పటిష్ఠ గగనతల రక్షణ వ్యవస్థ కలిగిన దేశాల్లోకి చొచ్చుకెళ్లగలుగుతాయి. సైద్ధాంతికంగా చూస్తే ఈ సామర్థ్యం వల్ల.. నింగిలో ఈ జెట్‌ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించడం, వాటిని లక్ష్యంగా చేసుకోవడం శత్రు గగనతల రక్షణ వ్యవస్థలకు చాలా కష్టం. సెన్సర్ల సంధానత

స్టెల్త్ యుద్ధవిమానంలో సెన్సర్ల సంధానత కూడా చాలా కీలకం. ఎఫ్35లోని ఎలక్ట్రానిక్ పరికరాలు కేవలం డేటాను సేకరించడమే కాదు.. దాన్ని విశ్లేషిస్తాయి. జెట్‌లోని రాడార్, పరారుణ సెన్సర్లు.. ఉపగ్రహాలు, ఇతర విమానాల నుంచి అందే డేటాను కలగలిపి.. యుద్ధరంగానికి సంబంధించిన ఒకే వాస్తవ చిత్రాన్ని ఆవిష్కరిస్తాయి. దీనివల్ల పైలట్లు.. చాలా ముందుగానే ముప్పులను పసిగట్టి, వాటిని ధ్వంసం చేయగలుగుతారు. నెట్‌వర్క్ ఆధారిత పోరాటం..ఎఫ్35.. విస్తృత డిజిటల్ పోరాట వ్యవస్థలో భాగంగా ఉంటుంది. తద్వారా స్వపక్షానికి చెందిన ఇతర యుద్ధవిమానాలు, నౌకలు, భూతల వ్యవస్థలతో డేటాను పంచుకుంటుంది.




"సర్‌లో అనేకమంది ప్రజల పేర్లను తొలగించారు. నేను కోల్‌కత నుంచి ఢిల్లీకి వెళ్లాను. దీనికోసం కలకత్తా హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకూ వెళ్లాను. ప్రజల హక్కులు పరిరక్షిస్తారని నేను ఆశిస్తున్నాను. బెంగాల్‌లోని ప్రతి ఒక్కరి, అన్ని కులాలు, వర్గాలు, మతాల పక్షాన నిలబడతాను. పోరాటాన్ని కొనసాగిస్తాను. మన హక్కులను మోడీజీ లాక్కోవడానికి అనుమతించను. మీరు మా ప్రభుత్వాన్ని బలవంతంగా నియంత్రించడానికి ప్రయత్ని స్తున్నారు. రాష్ట్రపతి పాలన విధించాలని కోరుకుంటున్నారు. అయినా, మేం భయపడం. భయపడే వాళ్లు మరణిస్తారు, పోరాడేవాళ్లే జీవితంలో విజయం సాధిస్తారు. బిజెపి దొంగలు, గూండాల పార్టీ ఓట్లను చీల్చడానికి బిజెపి నుంచి డబ్బు తీసుకునే దేశద్రోహులు కూడా ఉన్నారు. వారికి నేను చెప్పేది ఏమిటంటే, అవతలి వాళ్లు ఎంత చెడుకోరుకున్నా, దేవుడికి ఆమోదయోగ్యమైనది మాత్రమే జరుగుతుంది."

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

## వే'మన'పద్యం

కానివానితోడ గలసి మెలగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# అప్పు కూడు

అప్పుచేసి పప్పు కూడు అనేది అందరికీ తెలిసిన సామెతే కాదు, నిత్య జీవన చేదు సత్యం. ప్రభుత్వాల విషయంలో ఇది మరింత నిజం.ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా రుణభారమే 32 ట్రిలియన్ డాలర్లు.దాని స్థూల దేశీయ ఉత్పత్తిలో అది 81–84 శాతం. అయితే దేశ దేశాలను కొట్టుకుతినే రాబందు అమెరికాకు ఇది భారమైన విషయం కాదు.భారత ప్రభుత్వ రుణం 2014 లో రూ 53.11లక్షల కోట్లు కాగా 2023నాటికి నాటికి రూ 156 లక్షల కోట్ల కు చేరిపోయింది.కోవిడ్ –19 దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీసింది.తెలంగాణ ప్రభుత్వ రుణభారం ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రూ 5.62 లక్షల కోట్లు.ఈ ఏడాది ( 2026–27) llబడ్జెట్ పెట్టుబడి రూ 3.24, 234 లక్షల కోట్లు. అయితే రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయం రూ 2.41 లక్షల కోట్లే.ఇది సిబ్బంది జీతాలకు, పెన్షన్లకు,పాత అప్పుల కిస్తీల చెల్లింపులు వగైరాలకే సరిపోతుంది. మరి అభివృద్ధి ఎట్లా? అందుచేత అప్పుల బాట పట్టడం అనివార్యం. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వస్తు, సేవలపన్ను రూపంలో రాష్ట్రాలన్నీ కట్టగట్టుకొని తమ తలలన్నిటినీ మూటగట్టి కేంద్రం హుండీలో పడేశాయి.2017 జూలై 1న అట్టహాసంగా తీసుకొచ్చిన జి ఎస్ టి తో వస్తు, సేవలపై పన్నును వసూలు చేసే హక్కును రాష్ట్రాలు కోల్పోయాయి. ఆ అధికారాన్ని సొంతం చేసుకున్న కేంద్రం తన దయాభిక్షంగా రాష్ట్రలకు నిధులను కేటాయిస్తున్నది. ముఖ్యంగా ప్రతిపక్షాలు పరిపాలిస్తున్న రాష్ట్రాల పట్ల కక్ష సాధింపు ధోరణితో ఆలస్యంగా, అరకొరగా వాటికి నిధులను విదిలిస్తున్నది. బిజెపి, దాని మిత్ర పక్షాల పాలిత రాష్ట్రాలకు మితిమించి కేటాయిస్తున్నది. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి అవసరాల కోసం రాష్ట్రాలు అందినంత మేరకు అప్పులు చేస్తున్నాయి. వాస్తవానికి రుణ విత్తాన్ని నిజాయితీగా అవసరం మేరకు మాత్రమే ఖర్చు చేస్తే దానివల్ల మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి, ప్రాజెక్టులు , పరిశ్రమల నిర్మాణం జరిగి ఆదాయం పెరుగుతుంది.తీసుకున్న రుణాన్ని సునాయాసంగా తీర్చవచ్చు. కాని ప్రతి ఒక్క ప్రాజెక్టు లోను దళారుల, కాంట్రాక్టుల ఉద్యోగుల, అధికారుల అవినీతి తిమింగలం స్థాయి విజృంభణ శృతి మించిపోయి కేంద్ర, రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు కుక్కలు చింపిన విస్తళ్ళు అయిపోతున్నాయి. అడ్డుకట్ట ఎవరు ఎలా వేస్తారో ! దీనిని ఇలా ఉంచితే బడ్జెట్ల కేటాయింపులో ప్రజల క్షేమానికి ప్రాణప్రదమైన విద్య, వైద్య రంగాలకు అతి స్వల్ప కేటాయింపులు చేసి ఆ రెండు రంగాలను ప్రైవేట్ గుత్తాధిపత్యానికి వదిలివేయడం ప్రభుత్వాలకు ప్రీతిపాత్రమైన పని అయిపోయింది. విద్యకు గతంలో(ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ బడ్జెట్లలో ) 12 నుంచి 13 శాతం నిధులు కేటయించగా రాష్ట్ర తాజా బడ్జెట్లో 8శాతమే ఖర్చు చేయడాన్ని పరిశీలకులు విమర్శిస్తున్నారు. విద్యకు ఢిల్లీలో 24 శాతం, రాజస్తాన్ లో 21 శాతం కేటాయిస్తున్న వాస్తవాన్ని గుర్తు చేస్తున్నారు. పాలకులు దీనిని గమనించి తగిన సవరణలు చేసుకోవాలి. అప్పు చేయాలి, ఆ డబ్బును నిజాయితీగా ప్రజలకోసం వెచ్చించాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# బ్రిక్స్ అధినేతగా ఇండియాకు ఇరకాటం

కేవలం విదేశాంగ మంత్రి జై శంకర్ ప్రకటనతో సరిపెడదామని చూసిన పాలక కూటమి యత్నంతో సోమవారం నాడు పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. పశ్చిమాసియాలో పరిస్థితి గురించి ప్రకటన కాదు, చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. గల్ఫ్‌లో చిక్కుకు పోయిన భారతీయుల గురించి ఆందోళన చెందుతున్నట్లు, చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి మంత్రి చెప్పారు.యుద్ధం, దాని పర్యవసానాల గురించి కేంద్ర ప్రభుత్వ వై*రి ఏమిటో చర్చించాలని ప్రతిపక్షం పట్టుబట్టటంతో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే సమావేశాలు వాయిదా పడ్డాయి, పశ్చిమాసియా పరిస్థితి గురించి ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ స్థానం అనుమతించలేదు. యుద్ధాలు, ప్రపంచాన్ని కుదిపివేసే ఇతర సంక్షోభాలు అప్పటి వరకు ఉదాసీనంగా ఉన్నవారిలో, కొందరు నేతల మీద ఉన్న భ్రమలు పటాపంచలు అవుతాయి, అయితే కొందరు వాటిని బహిరంగంగా అంగీకరించటానికి ముందుకు రారు. ఫర్లేదు, ఒకసారి బుర్ర ఆలోచించటం ప్రారంభించిన తరువాత ఎంతకాలం బిడియపడతారు ! ఎన్‌డిఏ ప్రభుత్వం, నరేంద్రమోడీ అనుసరించే లొంగుబాటు విధానాల గురించి వామపక్షాలు, ఇతర పార్టీలు ఎంతగా మొత్తుకున్నా చెవికి ఎక్కని వారికి గూబగుయ్యి మనిపించేలా వినిపించినందుకు నిజంగా డోనాల్డ్ ట్రంప్‌కు " అభినందనలు " చెప్పక తప్పదు.ప్రతి తరంలోనూ ఒక మహానుభావుడు అవతరిస్తాడు మరి ! జీవ పరిణామ క్రమంలో కొన్ని జీవుల మెదళ్లు ఎదగలేదు, మనుషుల్లో కూడా అలాంటి వారు ఉంటే వారి పట్ల జాలి చూపుదాం !! నెల రోజుల పాటు రష్యన్ ముడిచమురు కొనుగోలు చేసేందుకు భారత్‌కు అనుమతి ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించగానే నరేంద్రమోడీ భక్తి మైకంలో ఉన్నవారికి చెర్నాకోల దెబ్బలా తగిలి మత్తువదిలింది. ఎవడు వాడు ఎచటి వాడు ఇటు వచ్చిన తెల్లవాడు అన్న శ్రీశ్రీ పాట చాలా మందికి డోనాల్డ్ ట్రంప్‌ను గుర్తుకు తెచ్చింది. అది కూడా కొత్తగా రష్యాలో కొనుగోలు చేసేందుకు కాదు. అమెరికా ఆంక్షల కారణంగా రష్యన్ రేవుల నుంచి బయలుదేరి, ఏ దేశానికి వెళ్లాలో తెలియక సముద్రంలో లంగరు వేసిన చమురు టాంకర్లలో ఉన్న సరకు మాత్రమే కొనుగోలు చేసుకోవాలి.ఈ ఉదంతాన్ని చూస్తే బందీగా ఉన్న బానిసకు రెండు నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకురా అన్న యజమాని ఉదారత్వం కనిపించింది. ఇంతకీ మనం అసలైన దేశభక్తులం అని చెప్పుకొనే కాషాయదళాల పాలనలో ఉన్న స్వేచ్ఛా జీవులమా, అమెరికా యజమానులకు బానిసలమా ? ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిందే ! యావత్ దేశంలో ఆత్మగౌరవం గలవారందరూ అమెరికా ప్రకటనపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే బిజెపి మాత్రం నరేంద్రమోడీ దౌత్య విజయం అంటూ భజన చేస్తున్నది. మొత్తం మీద ఈ పరిణామం ఆ పార్టీ నిజస్వరూపాన్ని వెల్లడించింది. నిజంగా విజయమే అయితే 30 రోజులే గడువు ఎందుకు ? నీ ఆంక్షలను మేము ఖాతరు చేయం, ఇప్పటి వరకు రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురు ఇది, ముందు ముందు కూడా కొనసాగిస్తాం అని మోడీ సర్కార్ ఎందుకు చెప్పలేకపోయింది ? మధ్యలో రష్యా నుంచి దిగుమతులను ఎందుకు తగ్గించినట్లు ? పిల్లి పాలుతాగుతూ తనను ఎవరూ చూడలేదు అనుకుంటుందట. అమెరికా బెదిరింపులకు లొంగి మాస్కో నుంచి దిగుమతులు ఎలా తగ్గించారో లోకం కోడై కూస్తున్నది.చైనా అలా తగ్గించినట్లు వార్తలు లేవు. మన ఛాతీ 56 నుంచి 6 అంగుళాలకు తగ్గిపోయిందా ! ఇంతా చేసి ఇంటా బయటా పరువుపోయినా భారత్ సాధించింది కేవలం 30రోజుల పాటు దిగుమతులకు అనుమతా, సిగ్గుచేటు !ఈ చమురు గురించి మీడియాలో వచ్చిన వార్త ప్రకారం ప్రామాణిక బ్రెంట్ రకం ముడి చమురు ధర కంటే నాలుగైదు డాలర్లు ఎక్కువగా ఉంటుందట, గతంలో రష్యా మనకు ఇచ్చిన 13 డాలర్ల రాయితీ పోయి ఇది అదనం. అవసరం మనదైపుడు వ్యాపారులు కొండెక్కుతారని తెలిసిందే. నియంత జూలియస్ సీజర్ చరిత్రలో అతగాడి నమ్మినబంటు బ్రూటస్ వెన్నుపోటు పొడుస్తాడు, అప్పుడు బ్రూటస్ నువ్వు కూడానా ( యూ టూ బ్రూటస్) అంటాడు సీజర్.ఇది ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే అధికారమే పరమావధిగా ఉన్నవారు ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో తెలియదు. ముఖ్యంగా పరీక్షా సమయం వచ్చినపుడు అసలు రంగు బయటపడుతుంది. బ్రిక్స్ కూటమిలో స్థాపక సభ్యులైన బ్రెజిల్,రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేషియా, ఈజిప్టు,ఇథియోపియా ఉన్నాయి.ఒక సభ్యురాలైన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరుపుతున్నాయి, వాటిని ఇరాన్ ప్రతిఘటిస్తున్నది.ఈ క్రమంలో కూటమిలోని సౌదీ అరేబియా,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న అమెరికా సైనిక కేంద్రాలు, ఎంబసీల మీద ఇరాన్ దాడులు చేస్తున్నది.ఈ పరిణామంపై కూటమికి ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో నాయకత్వం వహిస్తున్న భారత్ నోరుమెదపలేదు. ఇది మన గురించి ప్రపంచానికి ఎలాంటి సందేశం ఇస్తున్నది ? గతేడాది ఇదే అమెరికా, ఇజ్రాయెల్ పన్నెండు రోజుల పాటు ఇరాన్‌పై దాడులు చేసినపుడు బ్రిక్స్ అధ్యక్ష స్థానంలో ఉన్న బ్రెజిల్ వెంటనే ఆ చర్య అంతర్జాతీయ న్యాయాన్ని ఉల్లంఘించటమే అని ఖండించింది. అప్పుడు అది తన ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. గత డిసెంబరు నుంచి భారత్ అధ్యక్ష స్థానంలోకి వచ్చింది. కూటమి కంటే తన ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నదని, అమెరికా–ఇజ్రాయెల్‌కు దగ్గర ఉన్నట్లు సంకేతాలు పంపినట్లు అల్ జజీరా పత్రిక, సండే గార్డియన్ వ్యాఖ్యానించాయి. సరిగ్గా యుద్ధ ప్రారంభానికి ముందు నరేంద్రమోడి ఇజ్రాయెల్ పర్యటన, ఇతర అంశాల గురించి పేర్కొన్నాయి. పారిశ్రామిక దేశాలతో కూడిన జి 7 కూటమికి ప్రత్యామ్నాయంగా పేద దేశాల ప్రయోజనాల కోసం ఏర్పడిందే బ్రిక్స్, దాని అజెండాల్లో ఇప్పుడు సభ్య దేశాల భద్రత అంశం



కూడా ఉంది. అందువలన ఇరాన్ భద్రతకు ముప్పు తెచ్చిన వారి గురించి మౌనంగా ఉంటే కుదరదు, మనకు మన ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే అధ్యక్ష స్థానం నుంచి తప్పుకోవాలి. బ్రిక్స్ అమెరికా వ్యతిరేక కూటమి అని ట్రంప్ ఆరోపించాడు. సభ్య దేశాల సంగతి తేలుస్తాం అని మాట్లాడాడు. ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన మిలిటరీ విన్యాసాలకు భారత్ దూరంగా ఉంది.అమెరికాకు ఆగ్రహం కలిగించే చర్యలేవీ చేపట్టబోమని చెప్పకనే చెప్పింది. విశాఖపట్టణంలో మనదేశం మిలన్ 2026 విన్యాసాల్లో ఇరాన్ పాల్గొనగా అమెరికా మొఖం చాటేసింది. తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే, తమ్ముడు తవాడైనా ధర్మాన్ని ధర్మంగా చెప్పాలి అన్న లోకోక్తులు తెలిసిందే. అమెరికాతో అన్ని దేశాలూ వాణిజ్యం చేస్తున్నాయి, అయినా ఒక పరిణామం జరిగినపుడు వాటి గురించి పట్టించుకోకుండా స్పందిస్తున్నాయి. అమెరికా దాడులను ఒక్క మనదేశం తప్ప బ్రిక్స్ స్థాపకసభ్యులైన నాలుగు దేశాలూ విడివిగా ఖండించాయి. మూడు రోజులు ఆలశ్యంగా ఈ ఉన్మాదానికి స్వస్థి పలకాలని దక్షిణాఫ్రికా స్పందించింది. ముందుగా పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఖండిస్తూ ఒక ప్రకటన చేసింది. అవసరమైతే మధ్యవర్తి పాత్రపోషిస్తామని కూడా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా ప్రకటించాడు. ఇదే దక్షిణాఫ్రికా జనవరి నెలలో నిర్వహించిన బ్రిక్స్ నౌకాదళ విన్యాసాలలో ఇరాన్ భాగస్వామిగా ఉండటానికి అంగీకరించినందుకు దక్షిణాఫ్రికాపై ట్రంప్ తీవ్రంగా విమర్శించాడు. తొలి దాడి, ఖమేనీ హత్య జరిగిన మూడు రోజుల తరువాత భారత విదేశాంగశాఖ ఒక ప్రకటన చేస్తూ చర్చలు, దౌత్యాన్ని కోరుతున్నామని, వివాదం త్వరగా ముగియాలని పేర్కొన్నది. ఇరాన్ నేతలతో ఎలాంటి మాటలు లేకపోగా దాని పేరు ఎత్తకుండా గల్ఫ్ దేశాల నేతలతో మాట్లాడుతూ వాటి భూభాగాలపై జరుగుతున్న దాడులను నరేంద్రమోడీ విమర్శించారు. గాజాలో ఇజ్రాయెల్ జరుపుతున్న మారణకాండ, వెస్ట్‌బాంక్ ప్రాంతంలో పాలస్తీనియన్లపై కొనసాగుతున్న మారణకాండను ప్రపంచ దేశాలు ఖండిస్తుండగా ఫిబ్రవరి 25,25 తేదీలలో పర్యటన జరిపి పార్లమెంట్ నెసెట్‌లో మాట్లాడుతూ వర్తమానంలో, తరువాత కూడా తాము ఇజ్రాయెల్‌తోనే ఉంటామని స్పష్టం చేశారు.హమస్ దాడులను ఖండించారు గానీ వారిని అణచేపేరుతో గాజాలో టెల్‌అవీవ్ జరిపిన మారణకాండ గురించి పల్లెత్తుమాట అనలేదు. గాజాలో యుద్ధ నేరాల కేసులో తమ ముందు హాజరు కావాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు కోరిన నెతన్యాహును ఆలింగనాలు చేసుకున్నారు. రెండు దేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగాయని కూడా మోడీ చెప్పారు. ఆ మాటలు చెబుతున్న సమాయానికే అమెరికా, ఇజ్రాయెల్ అన్ని యుద్ధ సన్నాహాలు చేసుకున్నాయి.ఒక రోజు తేడాతో దాడులను ప్రారంభించాయంటే మోడీకి ఆ విషయం తెలియకుండా ఎలా ఉంటుందని విమర్శకులు అంటున్నారు. నిజంగా తెలియదంటే మన వేగుల వ్యవస్థ ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించాల్సి ఉంటుంది. తెలుసు అంటే ఎరుకలో ఉండి కూడా మోడీ వెళ్లారంటే ఇజ్రాయెల్‌కు సమర్ధనే అన్నది స్పష్టం. దీని గురించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. గల్ఫ్‌లో ఉన్న భారతీయుల గురించే మా తపన అని జైశంకర్ చెప్పారు. ఇరాన్‌లో కూడా ఉన్నారుగా, అయినా తమ మీద దాడి చేస్తే ఎక్కడ అమెరికా మిలిటరీ స్థావరాలు ఉన్నా వాటి మీద దాడి చేస్తామని ముందే ఇరాన్ ప్రకటించింది. దాని అర్థం తెలియనంత అమాయకంగా కేంద్ర ప్రభుత్వం ఉందని నమ్మటానికి ఎవరూ చెవుల్లో పూలు పెట్టుకొని లేరు. గతంలో ఉక్రెయిన్‌లో చిక్కుకు పోయిన భారతీయులను తీసుకు వచ్చేందుకు తన పలుకుబడిని ఉపయోగించి యుద్ధాన్ని కొద్ది రోజులు ఆపారని మోడీ గురించి పెద్ద ప్రచారం చేశారు కదా, ఆ పని ఇప్పుడెందుకు చేయలేదు ? పశ్చిమాసియా సంక్షోభ సమయంలో భ్రమ్మ ఉన్న అనేక మంది భారతీయులను మరో అంశంలో కూడా అమెరికా కళ్లు తెరిపించింది. మన స్వేచ్ఛా మీడియా దాని గురించి పెద్దగా వార్తలు ఇవ్వటానికి చర్చిందేందుకు భయపడింది. తమను దెబ్బతీసేందుకు భారత్‌ను అనుమతించనివ్వం, ఇరవై ఏండ్ల క్రితం చైనా వ్యవహారంలో చేసిన తప్పిదాన్ని పునరావృతం కానివ్వం, ఇది భారత్‌కు అర్థమైంది, మాకు పోటీగా మరొక అర్థిక వ్యవస్థ ఎదగటం మా పౌరుల ప్రయోజనాలకు విరుద్ధం అని న్యూఢిల్లీ గడ్డమీద రైసినా 2026 చర్చల్లో అమెరికా విదేశాంగశాఖ ఉపమంత్రి క్రిస్టోఫర్ లాండవ్ తెగేసి చెప్పినా మనం గొణగటం తప్ప గట్టిగా మాట్లాడలేకపోయాం. దీని అర్థం ఏమిటి ? గత పన్నెండు సంవత్సరాలుగా చైనాను పక్కకు నెట్టి మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా పథకాలతో భారత్‌ను ప్రపంచ ఫ్యాక్టరీగా మారుస్తాని మోడీ అండ్‌కో చెబుతున్నది.దానికి మేం అనుమతించం అని అమెరికా చెప్పింది. అంతే కాదు భారత్‌తో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం కూడా తొలుత తమ ప్రయోజనాలకే పెద్ద పీటవేసిందని కూడా క్రిస్టోఫర్ ఎలాంటి శషభిషలు లేకుండా చెప్పాడు. ముందే చెప్పినట్లుగా సంచలనాత్మక పరిణామాలు జరిగినపుడు జనంలో అనేక ఆలోచనలకు నాంది పడుతుంది. భారత్‌ను విశ్వగురువుగా మారుస్తానని చెప్పిన నరేంద్రమోడీ అమెరికా తోకగా మారుస్తున్నారని పశ్చిమాసియా సంక్షోభం వెల్లడించింది. గతంలో వామపక్షాలు, ఇతర పార్టీలు, ఎందరో మేథావులు చెప్పినా పట్టించుకోని వారు ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ తీరుతో ఆలోచించకతప్పటం లేదు !



ఎం కోటేశ్వరరావు
8331013288

# గెలిచింది పాండవులే.. కానీ ధర్మం ఎక్కడ?

కురుక్షేత్ర యుద్ధభూమిలో ఆఖరి బాణం అమ్ములపొదిని వీడింది. రణరంగం నిశ్శబ్దమైంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ కేవలం గాలి పలకరింపులు, అక్కడక్కడ వినిపించే నక్కల అరుపులు మాత్రమే మిగిలాయి. పాండవులు విజయులుగా నిలిచారు. శంఖనాదాలు మిన్నంటాయి. కానీ, ఆ విజయపు వెలుగుల్లో ఒక నల్లని నీడ వెన్నాడుతూనే ఉంది. అది ఈ విజయం ధర్మబద్ధమేనా?అనే ప్రశ్న. వేల ఏళ్లు గడిచినా, ఈ ప్రశ్న నేటికీ తత్వవేత్తలను, సామాన్యులను వెంటాడుతూనే ఉంది. అసలు ధర్మం అంటే ఏమిటి? అది ఒక స్థిరమైన చట్టమా? లేక గెలిచినవాడు రాసుకునే చరిత్ర పుటల్లో ఒదిగిపోయే మైనపు ముద్దనా? మహాభారతాన్ని మనం కేవలం ఒక వీరగాథగా చూస్తే పొరపాటే. అది మనిషి అంతరాత్మకు, బాహ్య ప్రపంచానికి మధ్య జరిగే యుద్ధం. కథ ప్రారంభంలో ధర్మరాజు యుధిష్ఠిరుడు సత్యానికి మారుపేరు. అబద్ధం ఆడని నోరు, అధర్మానికి తలొగ్గని మనసు అతని ఆయుధాలు. కానీ యుద్ధం ముగిసేసరికి అదే యుధిష్ఠిరుడు అశ్వత్థామ మరణం గురించి సగం అబద్ధం (నరోవా కుంజరోవా) చెప్పాల్సి వచ్చింది. ఇక్కడే అసలు చిక్కు మొదలవుతుంది. ధర్మం గెలవాలంటే సత్యం బలికావాలా? సత్యం లేని చోట ధర్మం ఎలా నిలబడుతుంది? యుద్ధ నియమాల ప్రకారం సూర్యాస్తమయం తర్వాత యుద్ధం చేయకూడదు, నిరాయుధుడిని కొట్టకూడదు, రథం దిగిన వాడిపై బాణం వేయకూడదు. కానీ కురుక్షేత్రంలో ఇవన్నీ తుంగలో తొక్కబడ్డాయి. ద్రోణాచార్యుడి వధ చూస్తేఒక గురువును చంపడానికి కొడుకు చనిపోయాడనే అబద్ధాన్ని ఆశ్రయించడం. భీష్ముడి పతనం లో ఆడది అని తెలిసిన శిఖండిని అడ్డం పెట్టుకుని ఇచ్ఛా మరణిని నేలకూల్చడం.కర్ణుడి మరణం విషయం లో రథ చక్రం భూమిలో కూరుకుపోయి, ధర్మం గురించి వేడుకుంటున్నప్పుడు అతడిని వధించడం.ఇవన్నీ చూస్తుంటే, విజయం కోసం ధర్మం తన ముసుగును తొలగించి, అవసరానికి తగ్గట్టుగా రూపాన్ని మార్చుకుందని అనిపిస్తుంది. ఇక్కడ కృష్ణుడు ఒక వింతైన వాదనను తెరపైకి తెస్తాడు. అధర్మాన్ని అణచడానికి అధర్మ మార్గాన్ని పట్టక తప్పదు అంటాడు ఆయన. అంటే, ఒక పెద్ద చెడును ఆపడానికి చిన్న చిన్న తప్పులు చేయవచ్చా? దీనినే ఆధునిక తత్వశాస్త్రంలో ప్రాగ్మాటిజం అంటారు. కానీ, ఆ చిన్న తప్పుల వల్ల కలిగే నైతిక గాయాలు మానవుడి అంతరాత్మను ఎప్పటికీ వేధిస్తూనే ఉంటాయి. యుద్ధం గెలిచిన తర్వాత పాండవులు సంతోషంగా ఉన్నారా? లేదు. 18 రోజుల యుద్ధం తర్వాత వారికి మిగిలింది శ్మశాన వైరాగ్యం. కోట్లాది మంది వీరుల రక్తం తాగిన ఆ నేల మీద సింహాసనం వేసుకుని కూర్చోవడం వారికి గర్వంగా అనిపించలేదు. గాంధారి శాపం, కుంతి దాచిన రహస్యం (కర్ణుడు తమ సోదరుడనే విషయం) బయటపడినప్పుడు యుధిష్ఠిరుడికి కలిగిన వేదన వర్ణనాతీతం.భీష్ముడు అంపశయ్యపై ఉండి రాజధర్మం గురించి బోధిస్తున్నప్పుడు, యుధిష్ఠిరుడు మౌనంగా వింటాడు. కానీ లోలోపల ఒక ప్రశ్న ఈ ధర్మం ద్రౌపది వస్త్రాపహరణం



జరుగుతున్నప్పుడు ఎక్కడికి పోయింది? అని. ధర్మం అనేది కేవలం శక్తివంతుల చేతుల్లో ఉండే ఆయుధంగా మారిందా? అనే అనుమానం మనకు కలుగుతుంది. బహుశా, విజయం అనేది ధర్మానికి లభించిన బహుమతి కాదు, అది ధర్మం చేసిన త్యాగాల ఫలితం. ధర్మం అనేది ఒక రాయి లాంటిది కాదు, అది ప్రవహించే నది లాంటిది. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిస్తే, ద్వాపర యుగం నాటికి అది ఒంటికాలిపై నిలబడింది. మహాభారతం మనకు నేర్పే ఒక ముఖ్యమైన పాఠం ఆపద్ధర్మం . అంటే అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన ధర్మం. ఒక వైపు భార్యను జూదంలో ఒడ్డటం మహాపరాధం. కానీ రాజుగా, క్షత్రియుడిగా పందెం కాదనలేకపోవడం ఆనాటి సామాజిక ధర్మం. ఇక్కడ వ్యక్తిగత నైతికతకు, సామాజిక నిబంధనలకు మధ్య ఘర్షణ కనిపిస్తుంది. ధర్మం అనేది పరిస్థితులకు అనుగుణంగా మారిపోతుందా? లేక మనుషులే తమ స్వార్థానికి అనుగుణంగా ధర్మాన్ని వంచుకుంటున్నారా? అనే సందేహం కలుగుతుంది.[Image illustrating the scale of justice balancing traditional ethics versus pragmatic victory]కృష్ణుడు మహాభారతంలో ఒక అద్భుతమైన మేనేజర్ . ఆయనకు ఫలితం ముఖ్యం. ధర్మం గెలవాలి, అది ఏ మార్గంలో గెలిచినా పర్వాలేదు అనేది ఆయన సిద్ధాంతం. అర్జునుడు తన బంధువులను చంప లేక గాండీవాన్ని జారవిడిచినపుడు, కృష్ణుడు చెప్పిన స్వధర్మం ఒక గొప్ప ప్రేరణ. కానీ అదే కృష్ణుడు జయద్రథుడిని చంపడానికి సూర్యుడిని మాయ చేయడం వంటి పనులు చేస్తాడు.ఇది మనకు ఒక పాఠాన్ని నేర్పుతుంది. లోక కల్యాణం కోసం చేసే ఏ పనైనా ధర్మమే అవుతుంది. "యతో ధర్మస్తతో జయః" (ఎక్కడ ధర్మం ఉంటే అక్కడ విజయం ఉంటుంది) అని అంటారు. కానీ ఇక్కడ ధర్మం అంటే కేవలం నియమాలు పాటించడం కాదు, న్యాయాన్ని నిలబెట్టడం. కొన్నిసార్లు న్యాయాన్ని కాపాడటానికి నియమాలను ఉల్లంఘించాల్సి వస్తుంది. కృష్ణుడు ఆ పనిని నిర్మోహమాటంగా చేశాడు.

కొందరు విమర్శకుల అభిప్రాయం ప్రకారం, కురుక్షేత్రంలో ధర్మం గెలవలేదు, అది రూపాంతరం చెందింది. యుద్ధానికి ముందు ఉన్న పాండవుల ధర్మం, యుద్ధం తర్వాత వారు అనుసరించిన ధర్మం వేరు. యుద్ధం వారిలోని అమాయకత్వాన్ని చంపేసింది. లోకం ఎప్పుడూ నలుపు తెలుపు (Black and White) గా ఉండదు, అది ఎక్కువగా బూడిద (Grey) రంగులో ఉంటుంది. మహాభారతంలోని ప్రతి పాత్రలోనూ కొన్ని లోపాలు ఉన్నాయి, కొన్ని ఉదాత్తమైన గుణాలు ఉన్నాయి. ధర్మం కూడా ఈ వైరుధ్యాల మధ్యే ప్రయాణిస్తుంది.నేటి సమాజంలో కూడా మనం ప్రతిరోజూ కురుక్షేత్రాన్ని ఎదుర్కొంటున్నాము. ఆఫీసుల్లో, కుటుంబాల్లో, రాజకీయాల్లో మనం తరచుగా ఎదుర్కొనే ప్రశ్న నేను నిబద్ధతతో ఉండి ఓడిపోవాలా? లేక కొంచెం సర్దుబాటు చేసుకుని గెలవాలా? . మహాభారతం మనకు ఇచ్చే సమాధానం ఏమిటంటే ఏ నిర్ణయానికైనా ఒక ఖరీదు ఉంటుంది. మీరు గెలవడానికి ధర్మాన్ని వంచితే, ఆ గెలుపు మీకు పూర్తి శాంతిని ఇవ్వదు. చివరలో, యుధిష్ఠిరుడు స్వర్గానికి వెళ్లేటప్పుడు తనతో వచ్చిన కుక్కను (యమధర్మరాజు రూపం) విడిచిపెట్టడానికి నిరాకరిస్తాడు. ఆ చిన్న జీవి పట్ల అతను చూపిన విశ్వసనీయత, అతను యుద్ధంలో చేసిన అన్ని తప్పులను కడిగివేసి, అతడిని నిజమైన ధర్మరాజు గా నిలబెడుతుంది.కాబట్టి, విజయం కోసం ధర్మం మారిపోయిందా? అంటే, అవును, కొన్నిసార్లు వ్యూహాత్మకంగా మారింది. కానీ, ఆ మార్పు వెనుక ఉన్న ఉద్దేశ్యం (Intent) పవిత్రమైనది అయినపుడు, ఆ విజయం ధర్మ విజయంగానే పరిగణించబడుతుంది. ధర్మం అనేది ఒక గమ్యం కాదు, అది ఒక నిరంతర ప్రయాణం. మనం చేసే ప్రతి పనిలోనూ, మనం తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ధర్మాన్ని వెతుక్కోవడమే మన బాధ్యత. చివరికి మిగిలేది ఇదే, విజయం సాధించడం ముఖ్యం కాదు, ఆ విజయం తర్వాత కూడా నీ మనస్సాక్షికి నువ్వు జవాబు చెప్పుకోగలుగుతున్నావా లేదా అనేదే ముఖ్యం. మహాభారతం మనకు నేర్పే పరమ సత్యం ఇదే.



డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

# హిమానీ నదాల పరిరక్షణ కీలకం

ప్రపంచ జనాభాలో దాదాపు 2.2 బిలియన్ల ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదు. రాను రాను నీటి కొరత పెరిగి గొంతులు ఎండి పోయే ప్రమాదం కూడా ఏర్పడనుందని అర్థం అవుతున్నది. మంచి నీటి వనరుల్లో నదులు, చెరువులు, సరస్సులు, వాగులు వంకలు, భూగర్భ జలాలు లాంటి నీటి నిల్వలు వస్తాయి. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–6 ప్రకారం "2030 నాటికి అందరికీ నీరు – పారిశుద్ధ్యం" అనే లక్ష్యం సుసాధ్యం అయ్యేట్లుగా కనిపించడం లేదు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ – పరిశ్రమలకు నీటి అవసరాలు పెరగడంతో రానున్న రోజుల్లో ప్రపంచ మానవాళి నీటి ఒత్తిడి సంక్షోభంలో పడే విధంగా కనిపిస్తున్నది. వాతావరణ ప్రతికూల మార్పులు, కార్బన్ ఉద్గారాల పెరగడం, హరిత గృహ వాయువులు అధికం కావడం, భూతాపం పెరగడం లాంటి కారణాలతో హిమానీనదాలు లేదా గ్లేసియర్లు వేగంగా కరుగుతూ తరుగుతూ రానున్న ప్రమాద హెచ్చరికగా మారనున్నాయి. గ్లేసియర్లు వేగంగా కరగడం వల్ల సముద్ర మట్టాలు పెరగడం జరిగి మానవాళికా మరో ప్రమాద ఘంటికలు మోగించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. హిమానీనదాల పరిరక్షణే ఏకైక లక్ష్యంగా చేసుకొని 2025 ఏడాదిని "అంతర్జాతీయ హిమానీనదాల సంవత్సరం"గా కూడా ప్రకటించు తగు ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు భారీ ఏర్పాట్లు చేయడం జరిగింది. అదే విధంగా ప్రప్రథమంగా 2025, మార్చి 21న "ప్రపంచ గ్లేసియర్స్ దినం" కూడా నిర్వహించడం జరిగింది. క్రియోస్పియర్, వాతావరణ మార్పులు, నీటి చక్రం, ఆర్థికాభివృద్ధి, పర్యావరణం, పౌర సమాజాల మధ్య నెలకొని ఉన్న సంబంధాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. నీరు ద్రవ రూపంలో కాకుండా ఘన మంచు రూపంలో అధికంగా ఉన్నపుడు దాని ప్రతికూల ప్రభావం భూమిపై పడుతుంది. దీనితో పాటు 2025–34 దశాబ్దాన్ని కూడా "క్రియోస్పియరిక్ సైన్సెస్ చర్యల దశాబ్దం"గా ప్రకటించడం జరిగింది. ఇదే క్రమంలో నీరు – పారిశుద్ధ్యాలకు సంబంధించిన నివేదికను "వాటర్ టవర్స్ : మౌంటేన్స్ అండ్ గ్లేసియర్స్" అనబడే పేరుతో విడుదల చేయడం జరిగింది. భూతాపం పెరిగిన కొద్ది హిమానీనదాలు క్రమంగా, వేగంగా కరుగుతూ తరిగిపోతున్నాయి. అధిక మొత్తంలో హిమానీనదాలు కరిగితే వరదలు, కొండ చరియలు విరిగి పడడం, సముద్ర మట్టాలు పెరగడం, కరువు కాటకాలు రావడం, జీవ వ్యవస్థల్లో లోపాలు జరగడం లాంటి ప్రతికూలాలు అనుభవంలోకి వస్తాయి. 2023లో గ్లేసియర్స్ కరగడం వల్ల 600 గిగాటన్నుల నీరు వ్యర్థంగా ప్రవహిస్తున్నది. భూగోళంపై ఉన్న మంచి నీటిలో 70 శాతం వరకు మంచు రూపంలోనే ఉంటున్నది. గ్లేసియర్స్ కరగడంతో 1900 నుంచి నేటి వరకు దాదాపు 20 సెమీ సముద్ర ◌ట్టం పెరగడం గమనించారు. భూతాపాన్ని తగ్గిస్తేనే గ్లేసియర్స్ కరిగే వేగం అదుపు చేయబడి ఉంటుందని తెలుసుకోవాలి.



మధుసూదన్ రెడ్డి
9949700037



# గ్రేటర్ హైదరాబాద్



## ఐక్యత చాటుదాం.. విద్వేషాలను దాటుదాం



**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**కాంగ్రెస్ నేతలకు సయ్యద్ సాధిక్ రంజాన్ విందు**
**భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహించిన సాధిక్**
**ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల శుభాకాంక్షలు**

**షాద్ నగర్, మార్చి 21 (వుదయం) :** ఐక్యతను చాటుదాం.. విద్వేషాలను దాటుదాం.. మతాలు ఏవైనా పండుగలు ఒక్కటే.. పూజించే దైవం ఒక్కడే.. సంప్రదాయాలు వేరైనా మనమంతా ఒక్కటే.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలం రంగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ సాధిక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డిలతో పాటు కాంగ్రెస్ నేతలకు రంజాన్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికి, అనంతరం దగ్గరుండి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలరోజుల ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ వేడుకలకు హాజరు కావడం సంతోషకరంగా ఉందని అన్నారు. భారీ ఏర్పాట్లు చేసిన సయ్యద్ సాధిక్ ను ఆయన అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఎవరి మతాన్ని వాళ్ళు ప్రేమించాలని, ఇతర మతాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. గ్రామంలో ఉన్న ముస్లిం సోదరులందరికీ వారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ సీనియర్ నేత సయ్యద్ సాధిక్ గ్రామంలో నాయకుల కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. తమ గ్రామానికి ఎమ్మెల్యేతో సహా అగ్ర నాయకులందరూ రావడం ఎంతో సంతోషకరంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులున్నారు.

## హరీశ్‌రావు స్ఫూర్తితోనే ప్రజాసేవలోకి..

**ప్రజల కోసం అహర్నిశలు శ్రమించే నాయకుడు**
**మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్**
**శాలువాతో సన్మానించి.. ఉగాది శుభాకాంక్షలు**



**పటాన్‌చెరు, మార్చి 21 (వుదయం) :** హరీశ్‌రావు స్ఫూర్తితోనే ప్రజాసేవలో ముందడుగు వేశానని పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుని వారి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ పరస్పరం అభినందనలు పంచుకున్నారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, నాయకులు పండుగ ఆనందాన్ని పరస్పరం పంచుకున్నారు. ప్రజలతో అనుబంధం పెంపొందించుకోవడం రాజకీయ నాయకుల ముఖ్య బాధ్యత అని ఈ సమావేశం మరోసారి చాటిచెప్పింది. ఉగాది పర్వదినం సందర్భంగా ఈ కలయికకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. నాయకుల మధ్య ఉన్న అనుబంధం, పరస్పర గౌరవం ఈ సందర్భంగా స్పష్టంగా కనిపించింది. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నిజమైన నాయకుడు హరీష్ రావుని కొనియాడారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి ఉండటం ఆయన ప్రత్యేకత అని తెలిపారు. ప్రజా సేవలో ఆయన చూపుతున్న అంకితభావం ప్రతి నాయకుడికి ఆదర్శమని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలు అంటే ఏమిటో హరీష్ రావు ద్వారా నేర్చుకోవచ్చని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం ఒక నిజమైన నాయకుడి లక్షణమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత ఎంత ముఖ్యమో ఆయన చూపిస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటం ఆయన గొప్పతనం అని కొనియాడారు. కార్యక్రమం చివర్లో అందరూ కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఈ సమావేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే పండుగ రంజాన్

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**శంకర్‌పల్లి, మార్చి 21 (వుదయం) :** పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా శంకర్‌పల్లి మండల ప్రజలందరికీ మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పండుగ ప్రతి ఇంటిలో శాంతి, సౌభ్రాతృత్వం, ఆనందాన్ని నింపాలని ఆమె ఆకాంక్షించారు. సమాజంలో సోదరభావం మరింత బలపడాలని కోరుతూ రంజాన్ ముబారక్ అన్నారు. రంజాన్ మాసం ఆధ్యాత్మిక పరంగా అత్యంత ప్రాముఖ్యత కలిగినదని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.మత సామరస్యం దేశ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసి జీవించాల్సిన అవసరం ఉందని, రంజాన్ పండుగ ఈ ఐక్యతను మరింత బలపరుస్తుందని చెప్పారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవాన్ని పాటించాలని సూచించారు.

## సోదరభావం మరింత బలపడాలి

• రంజాన్ పర్వదినం హృదయపూర్వక శుభాకాంక్షలు • ఎమ్మెల్యే కాలే యాదయ్య



**శంకర్‌పల్లి, మార్చి 21 (వుదయం) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముస్లిం సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దయతో ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, సౌఖ్యం నిండాలని, సమాజంలో సోదరభావం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ పండుగ మనుషుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందించే పవిత్ర సందర్భంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ, శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈద్గా ల వద్ద ఏర్పాటు చేసిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులతో మమేకమై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, మున్సిపల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, పరస్పర శుభాకాంక్షలతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ వేడుకలు ప్రాంతంలో ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచాయి.

## ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్

• ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు • మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్ నగర్, మార్చి 21 (వుదయం) :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలోని పలు ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, వారికి హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షతో, ప్రార్థనలతో పవిత్రతను పెంపొందించుకునే ఈ పవిత్ర మాసం సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి జీవించడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, సహనంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని, ముఖ్యంగా మైనార్టీ సోదరుల సంక్షేమం, అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు అంజయ్య యాదవ్‌ను ఆత్మీయంగా స్వాగతించి, ఆయనతో కలిసి రంజాన్ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రాంతంలో శాంతి, సామరస్య వాతావరణం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ ఆయన పలు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, వేణుగోపాల్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ జిల్లెల వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు నటరాజన్, లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు జయలక్ష్మి కిషోర్, శారద శేఖర్, వసంత శ్రీనివాస్, వాణి పాండు రంగారెడ్డి, ఎస్పీ శివ, గోపాల్, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదగిరి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చీపిరి రవి యాదవ్, గుండు అశోక్, నవీన్, ఈశ్వర్, వినోద్, దుమ్మని నవీన్, హనుమంతు, శ్రీకాంత్, నరసింహా, రాజశేఖర్, విజయ్, రాములు, శ్రీనివాస్, సంజు నాయక్, ప్రవీణ్, తేజ, సాయితేజ, పవన్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈద్ ముబారక్ ఖాజా బాయ్..

**జర్నలిస్టు కెపికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల శుభాకాంక్షలు..**



**షాద్ నగర్, మార్చి 21 (వుదయం) :** ఈద్ ముబారక్ ఖాజా భాయ్.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాపరెడ్డి, భీశ్వ కిష్టయ్యలు జర్నలిస్టు కేపీని కలుసుకున్నారు. రంజాన్ ఉత్సవాల నేపథ్యంలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపేందుకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి ప్రార్థనల నిమిత్తం వచ్చిన జర్నలిస్ట్ కేపీని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. కాసేపు మాట ముచ్చట్లతో అక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రంజాన్ పండుగ అందరికీ కొత్త వెలుగులు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

## డయాలసిస్ రోగుల సమస్యలు పరిష్కరిస్తాం

**ఎమ్మెల్యే కాలె యాదయ్య**



**చేవెళ్ల మార్చి 21 (వుదయం) :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్ లోని డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పందించారు. శనివారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. సెంటర్‌లో ఉన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకుని, రాష్ట్ర వైద్య విధాన జిల్లా అధికారి (డిసిహెచ్ఎస్) అనురాగిణితో ఫోన్‌లో మాట్లాడి వివరించారు. డయాలసిస్ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. అనంతరం పాలియేటివ్ కేర్ కేంద్రాన్ని కూడా పరిశీలించిన ఎమ్మెల్యే, డయాలసిస్ సెంటర్‌ను పాలియేటివ్ కేంద్రంలోకి మార్చే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేపు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్, పాలియేటివ్ కేంద్రాన్ని (డిసిహెచ్ఎస్) అనురాగిణి, స్వయంగా పరిశీలించనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, మాజీ సర్పంచ్,కౌన్సిలర్ బండారి శైలజా ఆగిరెడ్డి, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బ్యాగరి రాములు, మద్దెల చింటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జీ మహిళలకు మార్కెట్ వేదిక

**గ్రామీణ భారత్ మహోత్సవం ప్రారంభం**




**రామచంద్రాపురం, మార్చి 21(వుదయం) :** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో నాబార్డ్ సహకారంతో ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్వయం సహాయక సంఘాల మేళా – గ్రామీణ భారత్ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జిహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వాతి, నాబార్డ్ డీడీఎంలు ఎం.వి. కృష్ణ తేజ, నిఖిల్ రెడ్డి, మెదక్ డీసీసీబీ సీఈఓ సురేష్,భారతీనగర్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మేళా ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, కొనుగోలుదారులతో నేరుగా పరిచయం ఏర్పరచడం, భారీ ఆర్డర్లను పొందే అవకాశం కల్పించడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పట్టణ వినియోగదారుల అభిరుచులు, అవసరాలను తెలుసుకునే వేదికగా కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు – మార్చి 21, 22 తేదీలలో – మేళా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఎస్ హెచ్ జి సభ్యులు తమ ఉత్పత్తులను సమర్థవంతంగా విక్రయించుకునే విధానాలపై ఈశ్వరాంబ మహిళా సొసైటీ సభ్యులు మార్గదర్శనం అందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యవతి, ఎల్ఐజి కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్


**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్**




**గుమ్మడిదల, మార్చి 21 (వుదయం) :** పవిత్ర రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని, కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండటమే నిజమైన పండుగ అని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లోని మసీదులు, ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక నమాజ్ ప్రార్థనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్కల్మషమైన భక్తి మరియు త్యాగానికి నిదర్శనమని పేర్కొన్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలతో భగవంతుని స్మరించడం గొప్ప సంస్కృతి అని, ఈ ప్రార్థనలు ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. మన ప్రాంతంలో మత సామరస్యం బలంగా ఉందని, అందరూ అన్నదమ్ముల్లా కలిసి పండుగ జరుపుకోవడం ఆనందదాయకమని చెప్పారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకోవడంతో మసీదుల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి, మేడిపల్లి మురళి, మూడుచింతల నరేందర్ రెడ్డి, అభి శెట్టి రాజశేఖర్, కిషన్, నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, హుసేన్, వెంకటేశం గౌడ్, మద్ది శేఖర్ రెడ్డి, సప్పటి మహేష్, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీ రంజాన్ కేపీ..

**రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి**



**షాద్ నగర్, మార్చి 21 (వుదయం) :** హ్యాపీ రంజాన్ కేపి.. అంటూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జర్నలిస్టు కేపీకి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఆయన ఈద్గా వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా కేపిని కలుసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్రమైన రంజాన్ పండుగ జరుపుకుంటున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శేఖర్ పంతులు, యారం శేఖర్, ఉపసర్పంచ్ భూపాల్ రెడ్డి, పిల్లి శేఖర్, చిన్న కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రంజాన్ వేడుకల్లో పాల్గొన్న

**మాజీ జడ్పీటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి**

**జిన్నారం, మార్చి 21 (వుదయం) :** బొల్లారం డివిజన్ పరిధిలో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బీరప్ప బస్తీలోని ఈద్గా వద్ద జరిగిన రంజాన్ వేడుకల్లో మాజీ జడ్పిటిసి బాలిరెడ్డి మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... రంజాన్ వేడుకలు మతసామరస్యానికి నిదర్శనం అన్నారు. అల్లా దయవల్ల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులను అలింగనామ్ చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మత పెద్దలు ముస్లిం సోదరులు నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బీరప్ప యాదవ్ సతీష్ సాయి కిరణ్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ మాజీ ఎంపీటీసీ రత్నం నాయకులు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.




## బొల్లారంలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

**జిన్నారం, మార్చి 21 (వుదయం) :** బొల్లారం 272 డివిజన్ పరిధిలో కేజేఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. డివిజన్ శాఖ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ ఎన్నికలకు పార్టీ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పులుపునిచ్చారు. అనంతరం ముఖ్య నాయకులను ఆనంద్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి నాయకులు రవీందర్ రెడ్డి రాఘవేందర్ రెడ్డి మేఘనా రెడ్డి స్రవంతి రెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బానోరి లింగంగౌడ్‌కు ఘన నివాళి

**చేవెళ్ల, మార్చి 21 (వుదయం) :** మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్ట చౌరస్తాలోని స్థూపం వద్ద సిపిఐ దివంగత నేత బానోరి లింగంగౌడ్ 25వ వర్ధంతి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కే.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభు లింగం, చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ జనరల్ సెక్రటరీ శివ శంకర్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎం.సుధాకర్ గౌడ్, సత్తిరెడ్డి తదితరులు మాట్లాడుతూ లింగంగౌడ్ పోరాట స్ఫూర్తి ఈనాటికీ ఆదర్శమని తెలిపారు.కార్యక్రమంలో లింగంగౌడ్ సతీమణి అనసూయ, కుమారులు రాజు, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.



## ఫీజుల దోపిడీపై రెయిన్‌బో స్కూల్ ముట్టడి

• అమీన్‌పూర్‌లో పేరెంట్స్ ఆందోళన • యాజమాన్యంపై ఆగ్రహం • విద్యాశాఖపై విమర్శలు




**అమీన్ పూర్,మార్చి 21 (వుదయం):** విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయంటూ అమీన్‌పూర్‌లోని రెయిన్‌బో ఇంటర్నేషనల్ స్కూల్ ఎదుట తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఫీజులను అడ్డగోలుగా పెంచి, అదనపు పేర్లతో వసూళ్లు చేస్తున్నారంటూ వందలాది మంది పేరెంట్స్, విద్యార్థులు స్కూల్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అడ్మిషన్ సమయంలో ఒక విధంగా చెప్పి, విద్యా సంవత్సరం మధ్యలో ఫీజులు పెంచడం అన్యాయమని తల్లిదండ్రులు ఆరోపించారు. ట్యూషన్ ఫీజులతో పాటు స్పోర్ట్స్ డ్రెస్సులు, స్టడీ మెటీరియల్, డిజిటల్ కిట్లు పేరుతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పుస్తకాలు, యూనిఫాంలు బయట కొనుగోలు చేసే హక్కు ఉన్నప్పటికీ, స్కూల్ సూచించిన చోటే కొనాలంటూ ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు.
ఫీజులపై ప్రశ్నించిన తల్లిదండ్రులకు సరైన సమాధానం ఇవ్వకుండా "నచ్చకపోతే పిల్లలను తీసుకెళ్లండి" అని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజులు ఆలస్యమైతే విద్యార్థులను తరగతి గది బయట నిలబెట్టి అవమానిస్తున్నారని ఆరోపించారు. "వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేస్తూ స్కూల్ గేటు ముందు ముట్టడి కొనసాగించారు.

**విద్యాశాఖపై కూడా విమర్శలు..**

ప్రైవేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని తల్లిదండ్రులు ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు పెంచుతున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రెయిన్‌బో స్కూల్‌పై వెంటనే విచారణ జరిపి ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు.

# కరీంనగర్ | ఆదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటనకు సన్నాహాలు

**పెద్దపల్లి, వుదయం**

నర్మెట్ట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన అయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం. ప్రస్తుత యాసంగి రైతు భరోసా నిధులు కూడా విడుదల. పెద్దపల్లి జిల్లా లో రైతు సోదరి సోదరులకు విజ్ఞప్తి: రేపు అనగా ఆదివారం 22వ తారీఖు నాడు, మన తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి , సిద్దిపేట జిల్లా, పుంగనూరు మండలం, నర్మెట్టా గ్రామంలో రూ.300 కోట్ల తో నిర్మించిన అయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అదే వేదికపై ప్రస్తుత యాసంగి సీజన్ సంబంధించిన, ఎకరానికి రూ.6000 పాయల పెట్టుబడి సహాయం రైతు భరోసాన్ని నిధుల విడుదల కార్యక్రమాలు ఉంటా యి. ఇందుకు కు గాను పెద్దపల్లి జిల్లా లో గల ప్రతి ఏఈఓ క్లస్టర్ నుండి రైతులు ముఖ్యమంత్రి ప్రోగ్రాంలో పాల్గొనుటకు ఉచిత రవాణా బస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ ఉచిత రవాణా బస్సు లో ఉచిత అల్ప హారం, లంచ్, రాత్రి భోజన సదుపాయాలు కల్పించానైనది. ఉచిత రవాణా బస్సు ప్రతీ ఏఈఓ క్లస్టర్ నుండి ఆదివారం (22-3-26) ఉదయం 10 బయలు దేరుతాయి. రైతుసోదరి సోదరులు రేపు మీ గ్రామ సర్పంచులు లేదా మీ వ్యవసాయ విస్తరణ అధికారులు లను సంప్రదించి పేర్లు తప్పక నమోదు చేసుకొని, మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కార్యక్రమంలో భారీగా ఎత్తున అందరూ పాల్గొనాలని వ్యవసాయ శాఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## సమాజంలో ఐక్యత మరింత బలపడాలి

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు | మాజీ ఎమ్మెల్యే దాసరి

**పెద్దపల్లి, వుదయం :**



రంజాన్ పర్వదినం సోదర భావం, సహనం, దాతృత్వం, శాంతి సందేశాన్ని ప్రపంచానికి తెలియజేస్తుందని దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనసును శుద్ధి చేసుకోవడం, పేదలకు సాయం చేయడం ఈ పర్వదినం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మాజీ కౌన్సిలర్ మోబిన్, పెంచల శ్రీధర్, నాంసాన్ని సరేష్ బాబు, పూదరి చంద్రశేఖర్, ఫహీం,జావేద్, బిఆర్ఎస్ నాయకులు ముఖీమ్, లవన్, కాశీపక వాసు, ఖాదర్, ఎన్. వీరేశం, పల్లె మధు, కుక్క మనోజ్, ప్రేమ సాగర్, కిషోర్, గాజుల అరుణ్, మైనార్టీ సోదరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్ ప్రధాని లక్ష్యంగా ఐక్యం కావాలి

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అడ్లూరి

**ధర్మపురి, వుదయం:**



రంజాన్ సందర్భంగా నిర్వహించి న ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పేద మైనార్టీలకు రుణాలు అందే లా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముస్లిం యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.పేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామని వెల్లడించారు. మసీదులు, ఈద్గాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఇక రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడమే లక్ష్యంగా సెక్యులర్ శక్తులు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.మైనార్టీల సంక్షేమానికి మైనార్టీల సంక్షేమా నికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రుణాలు, ఉపాధి,గృహాల విషయంలో సహకారం అందిస్తా మని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనబట్ల.దినేష్,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొ న్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

**జన్నారం, వుదయం :**



జన్నారం మండలంలోని వివిధ గ్రామాల నుండి ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన గౌడ కులస్తులకు,అదేవిధంగా గత పది రోజుల క్రితం జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అమరగొండ సతీష్ గౌడ్ కు శనివారం జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ హాల్ లో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. చింతలపల్లె సర్పంచ్ గా గెలుపొందిన పంజాల సురేష్ గౌడ్, కవ్వాల్ వార్డు సభ్యునిగా గెలుపొందిన పోడేటి మల్లేష్ గౌడ్, బాదంపెల్లి నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన నాయిని రమేష్ గౌడ్, చింతలపల్లి నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన బుర్ర గడ్డ జగన్ గౌడ్, కలమడుగు నుండి వార్డు సభ్యునిగా గెలుపొందిన నాయిని భూమా గౌడ్ లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పొనకల్ గౌడ సంఘం అధ్యక్షులు పోడేటి సతీష్ గౌడ్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వోల్లాల నర్సాగౌడ్, గౌడ సంఘం నాయకులు పోలేటి నరేష్‌గౌడ్, రాసమల్ల ప్రశాంత్ గౌడ్, గద్రెపల్లి శంకర్ గౌడ్, ఏనుగంటి సతీష్ గౌడ్, అంజా గౌడ్, గొల్లపల్లి చంద్రమౌళి గౌడ్, వోల్లాల వెంకటేశ్వర్ గౌడ్, గొల్లపల్లి రమేష్ గౌడ్ వివిధ గ్రామాల గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## శాంతి సౌభాతృత్వానికి ప్రతీక రంజాన్

### మైనారిటీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం..

### కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, వుదయం :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన నడిపిస్తుందని ఈ ప్రజా పాలన లో మైనారిటీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో మంత్రి వివేక్ ఈద్గాల వద్ద ముస్లింలను కలిసి ప్రార్థన లు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసిందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ, ముస్లింలు ఐక్యతగా ఉంటూ సోదర భావంతో మెలగాలని అన్నారు. నియోజకవర్గంలోని ఈద్గా ,దర్గాలకు కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూపొందించామని, సొంత స్థలం ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చారు. రంజాన్ పండుగ శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, రంజాన్ పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నింపాలని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు

### డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్

**నిజాంసాగర్, మార్చి 21(వుదయం ప్రతినిధి):**

ముస్లీంల పవిత్రమైన పండుగ రంజాన్‌ను పురస్కరించుకుని డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్ శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీరఅలీ నివాసానికి వెళ్ళి వారికి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిద్దరు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న ముస్లీం సోదరులకు ఏలే మల్లిఖార్జున్ రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.



## విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- మల్టీ జోన్ – I ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి
- పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం

**రాజన్న సిరిసిల్ల, మార్చి 21(వుదయం ప్రతినిధి) :** జిల్లాకు విచ్చేసిన మల్టీ జోన్ – I ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డికి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్క అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, సర్కిల్ వారీగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ లో భాగంగా రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని, జిల్లాలో



ప్రజల్లో విస్తృత ంగా ప్రచారం చేయాల ని, రాష్ట్ర ప్రభుత్వం చేప ట్టిన "ప్రజాపాల న – ప్రగ తి ప్రణాళిక"లో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్ పై దృష్టి సారించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠిన తరం చేయాలని ఆదేశించారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని భాగంగా అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ లు శ్రీనివాస్,నాగేశ్వరరావు, వెంకటేష్,వెంకటేశ్వర్లు,రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి,సురేష్,పాల్గొన్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే, చైర్మన్, కమిషనర్



**పెద్దపల్లి, వుదయం**

ముస్లింల పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఈ రోజు ఈద్గా వద్ద గౌరవ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు గారితో కలిసి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య గారు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌గారు,గౌరవ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు,మత పెద్దలు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23న గొంగడి ధర్నా

### గొర్రెల కాపరులు ధర్నాకు తరలిరండి

### గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం



**పెద్దపల్లి, వుదయం**

పెద్దపల్లి జిల్లాలోని గొర్రెల కాపరుల హక్కులు, ఆత్మగౌరవం, మార్కెట్ స్థలాల రక్షణ కోసం ఈ నెల 23న జిల్లా కలెక్టరేట్ ముందు భారీ గొంగడి ధర్నా నిర్వహించనున్నట్లు గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ప్రకటించింది. శనివారం పెద్దపల్లి శాంతినగర్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరు పతి యాదవ్, జిల్లా అధ్యక్షులు సలేంద్ర రాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్ మాట్లాడుతూ తమ జీవనోపాధిని,మార్కెట్ స్థలాలను కాపాడుకోవడానికి ఇది ఒక చారిత్రాత్మక పోరాటమని, హక్కుల కోసం నిశ్శబ్దంగా ఉంటే భవిష్యత్తు అంధకారమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మన హక్కుల ను కాపాడటానికి ఎవరూ రారని, మనకోసం మనమే పోరాడాలని పిలుపునిచ్చారు. మార్చి2 3న ఉదయం10:30 గంటల కు పెద్దపల్లి కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న గొంగడి ధర్నాకు జిల్లాలో ని ప్రతి గ్రామం నుండి యాదవులు, కురుమలు, గొర్రెల కాపరులు వందలాదిగా తరలి రావాలని కోరారు. ముఖ్యం గా ప్రతిఒక్కరూ తమ సాంప్రదాయ గొంగడి ధరించి వచ్చి తమ ఐక్యతను, శక్తిని ప్రభుత్వానికి చాటి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం నిరసన మాత్రమే కాదని,రాబోయే తరాల భవి ష్యత్తు కోసం చేసే ఉద్యమమని వారు పేర్కొన్నారు.అనంతరం గొంగడి ధర్నా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నర్ల అంజయ్య యాదవ్, మండలాధ్యక్షుడు దాడి చంద్రమౌళి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## బడ్జెట్‌లో.. విద్య రంగానికి మొండిచేయి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

**కరీంనగర్, వుదయం;**



విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని, ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం స్థానిక గీతా భవన్ చౌరస్తా వద్ద ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బడ్జెట్ పతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందని కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ను కూడా విద్యారంగని కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఈ సంవత్సరానికి 8.22 శాతం మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రీయంబర్స్ 4.343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్లు, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వ విద్యాలయాల పరిస్థితి ఏంటని రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదన్నారు.యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటని,సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల ఊసే లేదన్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవు. ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు,విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి బోయిని విష్ణు వర్ధన్, నాయకులు సంపత్, సాయి కృష్ణ అశోక్, అభి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై కక్షసాధింపు చర్యలు ఆపాలి

### పెద్దపల్లి కార్మిక అధికారిణిపై మంత్రికి ఫిర్యాదు

**పెద్దపల్లి, వుదయం**

పెద్దపల్లి కార్మిక అధికారిని హేమలత తీరుపై భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారిణి, వారిని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం చెన్నూర్ నియోజవర్గంక్యాంపు కార్యాలయంలోతెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక వెంకటస్వామికిదళిత బహుజన లేబర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొంకూరి కైలాసం మాట్లాడుతూ.. పెద్దపల్లి కార్మిక అధికారి హేమలత ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ, అనవసరపు కొర్రీలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ అంశంపై గతం లోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, వారు మందలించినా సదరు అధికారిణి తీరులో మార్పు రాలేదని పేర్కొన్నారు. గతంలో పెద్దపల్లి జిల్లా మంథనిలో విధులు నిర్వహించిన సమయంలో కూడా, కార్మికుల తరపున మాట్లాడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు తప్పుడు కేసులు నమోదు చేయించారని, దీనివల్ల ప్రస్తుతం కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని కైలాసం వివరించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న కార్మిక అధికారిని తక్షణమే బదిలీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను కార్మికులకు అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవత వెలుగు అవార్డు గ్రహీత దార మధు తదితరులు పాల్గొన్నారు.



## బడ్జెట్లో గల్ఫ్ కార్మికులకు మొండి చేయి

**జన్నారం, వుదయం**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షే మం కోసం ఎటువంటి నిధులను కేటాయించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందనీ ఈ బడ్జెట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య అన్నారు.శనివారం అయన మండలం కేంద్రంలో మాట్లాడు తూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయం లో ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధితోపాటు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నప్పటికీ, ఇప్పుడు ఆ దిశగా ఎటు వంటి చర్యలు తీసుకోకపోవడం బాధా కరం అన్నారు.గల్ఫ్ దేశాల్లో కష్టపడి సంపాదిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్న వేలాది మంది కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఏప్రిల్ 16 2024 న హైదరాబాదులో గల్ఫ్ సంఘాల నేతల తో సమావేశమై త్వరలో మీకు పాలసీ తో కూడిన గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేస్తా మని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించినందుకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి స్వాగతం పలికిందని అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సభ్యులకు బ్యాంకు బోర్డు ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని లేని యెడల గల్ఫ్ జేఏసీ తో కలసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి,ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య (రెడ్డి), ఉపాధ్యక్షులు కొండుకూరి ప్రశాంత్, టౌన్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజేష్, క్యాషియర్ మరిపెల్లి అంజయ్య పాల్గొన్నారు.

## విజ్ఞాన్ సూపర్ క్యాంపస్ విజయోత్సవ సభ

**జన్నారం, వుదయం :**



జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి లో ప్రవేశానికై విజ్ఞాన్ సూపర్ 30 క్యాంపస్ కోచింగ్ సెంటర్ నుండి అర్హత సాధించిన విద్యార్థులను ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పొనకల్ గ్రామపంచాయతీ సర్పంచ్ సుష్మ భూమేష్ విచ్చేసి సంస్థ డైరెక్టర్ పీ.రంజిత్ ను ప్రశంసించారు. శనివారం రోజున జన్నారం పట్టణంలోని క్యాంపస్ ఆవరణలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ రాబోయే కాలం లో ఇంకా ఇలాంటి ఎన్నో విజయాలు సాధించాలని జన్నారం ప్రాంత విద్యాభివృద్ధిలో తోడ్పడాలని కోరారు. అనంతరం సంస్థ డైరెక్టర్ రంజిత్ మాట్లాడుతూ కేవలం జ్ఞానాన్ని బోధించడమే తన లక్ష్యమని, మొదటి సంవత్సరం లోనే మంచి ఫలితాలు సాధించినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉందని ఇలాంటి విజయాలు రాబోవు కాలంలో సాధించడానికి నాకెంతో ఉపకరిస్తుందని, అలాగే సహకరించిన తల్లిదండ్రులకు హాజరైన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను సర్పంచ్ శాలువా కప్పి మెమెంటోఅందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా రంజాన్

### ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు



**జన్నారం, వుదయం :**

జన్నారం మండలంలోని వివిధ గ్రామాలలో ముస్లింలు రంజాన్ పండుగను ఉత్సాహ వాతావరణంలో జరుపుకున్నారు.రంజాన్ పురస్కరించుకొని శనివారం మండలంలోని పోన్కల్, జన్నారం, తదితర గ్రామాలలో ఉన్న ముస్లింలు సమీప ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం తమ కుటుంబ సభ్యులతో కలిసి ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలకు మాజీ సర్పంచులు నందు నాయక్, జక్కు భూమేష్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపి అలాయ్ బలాయ్ చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రజాక్,క్యాషియర్ మోసిన్, కాంగ్రెస్ నాయకులు మౌలానా ఉన్నారు.



## లింగంపల్లిలో రికవరీ డ్రైవ్

**నాగిరెడ్డిపేట్, వుదయం :**

మండలంలోని లింగం పల్లి గ్రామ సంఘంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో బీఎల్ @ ఎస్ఎన్ రికవరీ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎల్‌డీపీఎం, ఎస్ఎన్ఆర్ఎం, మండల ఏపీఎం అధికారులు హాజరై పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎస్ఎన్ఏఎం, క్లస్టర్ సీసీలు, సంబంధిత వీఓఏలు పాల్గొని రికవరీ ప్రక్రియను సమర్థవంతంగా కొనసాగించారు. సంఘ సభ్యులకు రుణాల చెల్లింపుల ప్రాముఖ్యతను వివరించి, సమయానికి రికవరీ చేయాలని సూచించారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ఈద్-ఉల్-ఫితర్











- ఈద్గా ల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు
- నాగర్ కర్నూల్ ఈద్గా వద్ద ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి శుభాకాంక్షలు

నాగర్ కర్నూల్ మార్చి 21 (వుదయం ప్రతినిధి)

ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ ను శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకున్నారు. రంజాన్ ఉపవాస దీక్షలు నెలవంకతో శుక్రవారంతో ముగియడంతో శనివారం పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా లు ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజు కోసం వచ్చిన భక్తులతో కిట కిట లడాయి. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డు నగల ఈద్గాలో అల్లామా హఫీజ్ , ఆలీం మహమ్మద్ షాకీర్ సిద్దిఖి, హఫీజ్ మహమ్మద్ మహబూబ్ అలీ లు రంజాన్ ప్రాముఖ్యత, పవిత్రత గురించి వివరించారు. హఫీజ్ మహమ్మద్ అన్వర్ ఉల్ హక్ ఈదుల్ ఫితర్ ప్రత్యేక నమాజ్ తో పాటు కుత్బ ను చదివించారు. వక్ఫ్ కాంప్లెక్స్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, జమా మస్జిద్ కమిటీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖాదర్ ఏర్పాట్లకు సహకరించిన మున్సిపల్ అధికారులు చైర్మన్ ఇతర కౌన్సిలర్లకు జిల్లా స్థాయి అధికారులకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలపడానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్లా రాజేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ సునేంద్రలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగం శశిధర్ రెడ్డి లతో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లు నాయకులు తదితరులు ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**నారాయణపేట మార్చి 21( వుదయం ప్రతినిధి)** పేద ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు ఎంపీ డి కే అరుణ అన్నారు.శనివా రం ఆమె క్యాంపు కార్యాల యంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన అయిదు మంది లబ్ధిదారుల కు సి ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను పంపిణీ చేశారు. నారాయణపేట పట్టణానికి చెంది న అనారోగ్యంతో బాధపడిన వారికి వైద్య ఖర్చుల నిమి త్తం ప్రభుత్వం పరంగా చెక్కు లుఅందజేశారు.నారాయణపేట పట్టణానికి చెందిన టక్ సూర్యకాంత్ కు 14 వేలు, రూప కు 24 వేలు,కందు కూరు నర్సమ్మ కు 11 వేలు, దామరిగిద్ద మండలం జే.మొగులప్ప కు 11 వేలు,సిసి కుంటకు చెందిన గోళ్ళ మణెమ్మకు 38 వేల చెక్కు లను అందజేశారు.ఈ సంద ర్భంగా ఎంపి అరుణమ్మ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథ కాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ,బిజెపి నాయకులు మొగులప్ప,ఉమాకాంత్,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శాంతి సామరస్యాలకు ప్రతీక రంజాన్

- ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే
- ఐక్యతతో జీవించాలన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపు





**గద్వాల, మార్చి 21 (వుదయం ప్రతినిధి)** రంజాన్ పండుగ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించేందుకు ఈ పర్వదినం దోహదపడుతుందని అన్నారు. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం గద్వాల ఈద్‌గాహ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం పరస్పర గౌరవం, సేవాభావం, దానగుణాలను పెంపొందిస్తుందని తెలిపారు. సమాజంలో హిందువులు, ముస్లింలు సహా అన్ని మతాల ప్రజలు సఖ్యతతో జీవిస్తూ ఐక్యతను కాపాడాలని సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యతను కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ తోడ్పడాలని కోరారు. ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు ముస్లిం సోదరులు ఆచరించిన ఉపవాస దీక్షల ఫలితంగా అల్లా దీవెనలతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించేందుకు రంజాన్ పర్వదినం దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని పలువురు ముస్లిం సోదరులు సన్మానించి ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముందు ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాంతి, సామరస్యానికి సంబంధించిన సందేశాలను అందించారు. కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి , వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు, ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రంజాన్ సందర్భంగా సదాశివపేటలో ఆధ్యాత్మిక వాతావరణం

### ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శుభాకాంక్షలు

**సంగారెడ్డి వుదయం** సంగారెడ్డి జిల్లా సదాశివ పేట పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముస్లిం సోదరుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా పలకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే రంజాన్ పండుగ సోదరభావం, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనేలా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.



## రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్ మార్చి 21( వుదయం ప్రతినిధి)** ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజనుల సర్వీసుల, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకునే పండుగ రంజాన్ అని ఈ నెల అంతా ముస్లింలు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మంచి నీరు కూడా తీసుకోకుండా కఠినమైన ఉపవాస దీక్ష చేస్తారని తెలిపారు.దీనివల్ల క్రమశిక్షణ, సహనం, ఆకలి విలువ తెలుస్తుందన్నారు. రంజాన్ అంటే కేవలం ప్రార్థనలే కాదని, తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానంగా ఇవ్వడం ముస్లిం సోదరుల గొప్పతనమన్నారు . సోదరభావం,అందరితో కలిసిమెలిసి ఉంటూ, ఇతరులకు సహాయం చేస్తూ జీవనం సాగించడం రంజాన్ పండుగ మనకు ఇచ్చే గొప్ప సందేశం అని పేర్కొన్నారు. అనంతరం మక్తల్ నియోజకవర్గం ఆత్మకూరు లో ఈద్గా వద్ద జరిగిన రంజాన్ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను అలింగనం చేసుకొని వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా?

- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగ లేఖ
- రద్దు చేసిన రూ.1070 కోట్ల నిధులు తిరిగి కేటాయించాలి
- సిద్దిపేట నియోజకవర్గాన్ని సీఎం పట్టించుకోలేదని ఆరోపణ
- ఆయిల్ ఫామ్ ప్రారంభోత్సవ వేళ లేఖ విడుదల
- ఖాళీ చేతులతో వచ్చి రిబ్బన్ కట్ చేసి వెళ్తే, సిద్దిపేట ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి



**వుదయం, సిద్దిపేట బ్యూరో (మార్చి 21)** సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు బహిరంగ లేఖ రాశారు.శనివారం సిద్దిపేట లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేపు ( నేడు ) సిద్దిపేటకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ లేఖను ఆయన మీడియాకు విడుదల చేశారు. హరీష్ రావు లేఖలో తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ, "మాదేమో శ్రమ ఫలితం.. మీదేమో శిలా ఫలకమా?" అంటూ వ్యాఖ్యానించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తమ ప్రభుత్వ హయాంలో జరిగినప్పటికీ, ప్రారంభోత్సవం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుంటోందని మండిపడ్డారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన రూ.1070 కోట్ల నిధులను రద్దు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ నిధులను వెంటనే తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా మూడు సార్లు అందలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాతే సిద్దిపేటకు వస్తున్నారని, ఇప్పటివరకు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితంగానే ఫామాయిల్ సాగు సాధ్యమైందని, దానిపై విమర్శలు చేసిన వ్యక్తి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభించడం శోచనీయమన్నారు. 2018లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ (IIOPR) సిద్దిపేటలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలం కాదని చెప్పినప్పటికీ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి వనరులు పెరగడంతో 2021లో అనుకూలమని ప్రకటించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే రూ.300 కోట్లతో ఈ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించిందని, నర్మేట గ్రామంలో 62 ఎకరాల భూమిని సేకరించి 2022లో పనులు ప్రారంభించామని తెలిపారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (ZLD) సాంకేతికతతో మలేషియా టెక్నాలజీ ఆధారంగా ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు.రైతుల్లో చైతన్యం కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టి, నర్సరీలు ఏర్పాటు చేసి, సబ్సిడీలతో ప్రోత్సహించామని పేర్కొన్నారు. ప్రస్తుతం 15 వేల ఎకరాలకు పైగా పామాయిల్ సాగు జరుగుతోందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులో శూన్య పాత్ర పోషించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ కృషి ఫలితమే ఈ ఫ్యాక్టరీ అని స్పష్టం చేశారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అడిగితే ఆ విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా రద్దయిన అభివృద్ధి పనుల జాబితాను వెల్లడిస్తూ, వాటిలో వెటర్నరీ కళాశాల, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, ఔటర్ రింగ్ రోడ్, అగ్రికల్చర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల భవనం, స్పోర్ట్స్ హబ్, పోలీస్ స్టేషన్లు, ఫోర్‌లేన్ రోడ్లు, మల్టీపర్పస్ ఆడిటోరియం వంటి అనేక ప్రాజెక్టులు ఉన్నాయని వివరించారు.సిద్దిపేటలో 22,819 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, దాదాపు రూ.300 కోట్ల రుణమాఫీ నిధులు విడుదల చేయాలని, అలాగే రూ.170 కోట్ల రైతు భరోసా బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వడగళ్ల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. చివరగా, "నిధులు కేటాయించకుండా ఖాళీ చేతులతో వచ్చి కేవలం రిబ్బన్ కట్ చేసి వెళ్తే, సిద్దిపేట ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి" అని హరీష్ రావు లేఖలో పేర్కొన్నారు.



## రాష్ట్ర బడ్జెట్లో పేద వర్గాలకు అన్యాయం

- ఎన్నికల్లో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని పూర్తి చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మోసం
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**అందోల్ జోగిపేట్ వు దయం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద వర్గాలకు అన్యాయం చేసే విధంగా ఉందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. జోగిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారం లో కి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని ఇప్పటివరకు నెరవేర్చ లేదని అన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణ్ లక్ష్మి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని, వృద్ధాప్య పెన్షన్లు 3000 పెంచుతామని, మహిళలకు 2500, దళితులకు 12 లక్షల దళిత బంధు, విద్యార్థులకు స్కూటీలు, తదితర హామీలు ఇచ్చి తెలంగాణ సమాజాన్ని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ అమలు చేస్తున్న అన్ని పథకాలను కాపీ కొట్టి దానికి అదనంగా ఇస్తామని చెప్పి తెలంగాణ ప్రజలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తూ ప్రజలను వంచించడం తప్ప తెలంగాణ ప్రజలకు ఏమి చేసింది లేదని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని లేనియెడల ప్రజలు క్షమించరన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు ఆగ్రహం గా ఉన్నారని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, కౌన్సిలర్లు శేఖర్, నాయకులు చేపల వెంకటేశం తదితరులున్నారు.

## ఖేడ్ లో ఘనంగా రంజాన్ వేడుకలు





**నారాయణఖేడ్ మార్చి 21(వుదయం)** రంజాన్ వేడుకలు ఖేడ్ లో ఘనంగా ముస్లిం సోదరులు అలాయి, ఆలింగనాలతో శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జహీరాబాద్ ఎంపీ, నారాయణఖేడ్ శాసనసభ్యులు, మున్సిపల్ చైర్మన్, తదితర నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లిం సోదరులు అల్లాహ్ తలచుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర దినాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నారాయణఖేడ్ రంజాన్ పండగ వేడుకలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేశ్ కుమార్ షెట్కర్, పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మసీదులలో మసీదులలో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు చేసి ఇస్తార్ విందులను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పట్టణ ముఖ్య నాయకులు ముస్లిం మత పెద్దలు, ముస్లిమ్స్ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు

- భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు
- హెలీప్యాడ్, సభ స్థలీ, స్టాల్ సందర్శన
- రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలులో ముందంజలో ఉందని వెల్లడి
- అధికారులతో సమీక్షించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్





**వుదయం - సిద్దిపేట బ్యూరో (మార్చి 21)** సిద్దిపేట జిల్లాలోని నంగునూర్ మండలంలోని నర్మేటలో రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్ అధికారులు తో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.ముందుగా హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రులు, భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం కర్మాగారం ప్రారంభోత్సవ ప్రాంగణానికి చేరుకుని అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను పరిశీలించి, ముఖ్యమంత్రి సందర్శనకు సంబంధించి అవసరమైన సూచనలు ఇచ్చారు.

తదుపరి ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన జరగనున్న ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రులు, అక్కడి నుంచి సభా స్థలికి వెళ్లి సమావేశ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆయిల్ ఫామ్ అభివృద్ధి కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుగా ముందుండి ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుతో కోతుల బెడద ఉండదని, వర్షాల ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని అన్నారు. ఉత్తర తెలంగాణకు ఈ ఫ్యాక్టరీ ప్రధాన కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ ఫ్యాక్టరీ గంటకు 30 టన్నుల నుంచి 180 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం కలిగి ఉందని వెల్లడించారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టిసారించాలని, లాభదాయకమైన పంటగా దీన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రేపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభంతో పాటు రిఫైనరీకి శంకుస్థాపన జరుగుతుందని తెలిపారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ

సిద్దిపేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం రాష్ట్రానికి కీలక ఘట్టమని పేర్కొన్నారు. గత 4-5 సంవత్సరాలుగా రాష్ట్రంలోని 30 జిల్లాల్లో ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని తెలిపారు.తాను వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సంతకం ఈ ఫ్యాక్టరీకే చేశానని వెల్లడించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మితమైన ఈ ఫ్యాక్టరీ 32 ఎకరాల్లో ఏర్పాటు చేయబడిందని చెప్పారు. కేవలం 16 నెలల్లో పూర్తి చేసిన దేశంలోనే మొదటి ఫ్యాక్టరీగా నిలిచిందని తెలిపారు.ఈ ఫ్యాక్టరీ ద్వారా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలతో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, అలాగే ఇక్కడే స్వతంత్ర ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుతో 'విజయ' బ్రాండ్ ద్వారా నేరుగా వినియోగదారులకు నూనె అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతులు పండించిన పంటకు మూడు రోజుల్లోనే చెల్లింపులు జరుగుతాయని వెల్లడించారు.

### రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలులో ముందంజ



తెలంగాణలో ఎక్కడ ఆయిల్ ఫామ్ సాగు జరిగినా, ఉత్పత్తి ఇక్కడి నుంచే జరుగుతుందని, రాష్ట్రం దేశంలో ముందంజలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న వారికి కూడా విడతల వారీగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న రైతాంగ మహోత్సవంలో భాగంగా జరిగే ఈ కార్యక్రమానికి రైతులు భారీగా హాజరవ్వాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా కింద రూ.3600 కోట్ల నిధులు విడుదల కానున్నాయని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పోలీస్ యంత్రం తదితరులు ఉన్నారు.

## రంజాన్ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ లింగయ్య



**నారాయణపేట టౌన్ మార్చి 21( వుదయం ప్రతినిధి)** రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నారాయణ పేట జిల్లాలోని ఈద్గాలు, మసీదులు,ప్రార్థన మందిరా ల వద్ద ఎలాంటి అవాంచనీ య సంఘటనలు జరగకుం డా పోలీసులు పోలీస్ అధికా రులు, సిబ్బంది కట్టుదిట్ట మైన బందోబస్తు నిర్వహిం చారు.ఈ సందర్భంగా డిఎస్పీ ఎన్. లింగయ్య జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా అవస రమైన సూచ నలు సిబ్బందికి ఇచ్చారు. అనంతరం అక్కడికి విచ్చేసి న ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## భక్తి మార్గమే జీవన పరిపూర్ణత

### తంగేడుపల్లి ఆశ్రమంలో ఆధ్యాత్మిక వెలుగు




**సంగారెడ్డి ప్రతినిధి. వుదయం** దైవచింతనతో జీవితం సార్థకమవుతుందని నమ్ముతూ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగుతున్న శ్రీ శ్రీ 108 శివయోగి శివాచార్య మహాస్వామి భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గురువు శ్రీ శ్రీ గురు గంగాధర మహాస్వామి ఆశీస్సులతో సాగుతున్న ఆయన ఆధ్యాత్మిక సేవలు సంగారెడ్డి జిల్లాలో విశేషంగా నిలుస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని యదగిర్ జిల్లాలో జన్మించిన స్వామి చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతన వైపు ఆకర్షితులై, అనేక మహనీయులను కలుసుకుని జ్ఞానం ఆర్జించారు. అనంతరం గురువు ఆశీస్సులతో దీక్ష స్వీకరించి భక్తి మార్గంలో నడుస్తూ, 2010 నుంచి సదాశివపేట మండలం తంగేడుపల్లి గ్రామ శివారులోని కోటి బిల్వ లింగేశ్వర మఠం ఆశ్రమంలో మఠాధిపతిగా సేవలందిస్తున్నారు. ఆశ్రమంలో నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తూ భక్తులకు మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ఆయన బోధనలు వినేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతన ద్వారా మనసుకు ప్రశాంతత లభిస్తుందని భక్తులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, శివయోగి శివాచార్య మహాస్వామి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆశ్రమంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తంగేడుపల్లి గ్రామంలో సాయంత్రం 4 గంటలకు జరగనున్న వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు, భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే ఆహ్వానాలు పంపగా, భక్తులు భారీగా తరలిరానున్నారు.

## తారా ప్రభుత్వ కళాశాలలో 23న ఎం ఎస్ ఎన్ లాబొరేటరీస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్


**సంగారెడ్డి, మార్చి 21:** – వుదయం స్థానిక తారా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల, సంగారెడ్డిలో ఈ నెల 23వ తేదీ (సోమవారం) ప్రముఖ ఫార్మాస్యూటికల్ సంస్థ 'MSN లాబొరేటరీస్', రుద్రారం ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ మరియు కెమిస్ట్రీ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్లేసెమెంట్ డ్రైవ్ ఈ నెల 23 న ఉదయం 10:00 గంటల నుండి సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. బీఎస్సి (కేమిస్ట్రీ )/ ఎం ఎస్సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ )చదువుతున్న లేదా పూర్తి చేసిన అభ్యర్థులు, ఫైనల్ ఇయర్ చదువుతున్న లేదా పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ వెంట రెజ్యూమ్ , విద్యార్హతల కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇది మంచి ఉద్యోగావకాశమని, అర్హులైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ వీరేందర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డా. వినోద్ కుమార్ గౌడ్ మరియు టీ ఎస్ కే సి కన్వీనర్ డా. సుచిత్ర సింగ్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్



**అలంపూర్ మార్చి 21 (వు దయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఐజ పట్టణంలోని ఈద్గా మైదానం భక్తిశ్రద్ధలతో పోటెత్తింది. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.సామూహిక ప్రార్థనలు, ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పట్టణ ముస్లిం సోదరులతో కలిసి సీఎం సురేష్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం మత పెద్దలను, సోదరులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేశారు. ఐజ ప్రజలందరూ ఆర్థికంగా ఎదగాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా అందరూ సోదరభావంతో మెలగాలని, ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ యువత, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



**మరికల్ మార్చి 21 ( వుదయం ప్రతినిధి)** మరికల్ మండల కేంద్రంలోని శనివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిషి వర్ధన్ రెడ్డి (12 ) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మరికల్లో జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయాన్నే సైకిల్ మోటార్ ను కారు ఢీకొనడంతో తలకు బలమైన గాయాలు తగలడంతో వెంటనే హైదరాబాద్ లోని ఓ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## బస్సుల కొరతతో ప్రయాణికుల ఇబ్బందులు



**అలంపూర్ మార్చి 21 (వుదయం ప్రతినిధి )** జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్ ప్రాంతంలో బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు శాంతినగర్ నుంచి అల్లంపూర్ చౌరస్తా అలాగే అక్కడి నుంచి అయిజకు వెళ్లేందుకు సరిపడా బస్సులు అందుబాటులో లేవు దీంతో ప్రజలు గంటల తరబడి రోడ్డుపక్కన నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రాంతంలో బస్ స్టాప్ షెల్టర్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు ఎండలో వర్షంలో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు ముఖ్యంగా వృద్ధులు మహిళలు విద్యార్థులు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు గతంలో కర్నూల్ డిపోకు చెందిన బస్సులు ఈ మార్గంలో ఎక్కువగా నడిచేవి. అయితే ప్రస్తుతం ఆ సర్వీసులు తగ్గిపోవడంతో ప్రయాణికులు తెలంగాణ బస్సులపై మాత్రమే ఆధారపడాల్సి వస్తోంది కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాంతినగర్ అల్లంపూర్ చౌరస్తా వద్ద బస్ షెల్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఈ మార్గంలో బస్సుల సంఖ్యను పెంచాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కర్నూల్ డిపో బస్సులను మళ్లీ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## ప్రభుత్వ కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**వుదయం, దుబ్బాక** ప్రభుత్వ కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాలను విక్రయించాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మెర సంయుక్త శ్రీధర్ గుప్తా, డైరెక్టర్లు చాట్లపల్లి బాలగౌడ్, నగరం లక్ష్మి, కడవెరుగు రమేష్, కూతురి సుమలతతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులు మొక్కజొన్నలను శుభ్రం చేసి నిర్ణీత తేమ శాతం వచ్చేవరకు ఆరబెట్టాలని రైతులకు సూచించారు. తూకంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, అక్బర్ పేట సర్పంచ్ మండల కుమార్, బేగంపేట సర్పంచ్ అన్నబోయిన చంద్రశేఖర్, మండల నర్సింలు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు శేరిపల్లి స్వామి, ఎర్రోళ్ల బాలనర్సు, సతీష్, మాజీ ఎంపీటీసీ పాతూరి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు గుండా శంకర్, ప్రతాప్, పేర్కమధు కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ఉపాధ్యక్షులు ఎల్లన్న గారి వంశీధర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లన్న గారి సురేందర్ రెడ్డి, బాల్తే వెంకటేశం, భీమ్రావు, సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నందారం లలిత రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి పత్రిక ఆవిష్కరణ

**బీరంగూడ (వుదయం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బీరంగూడలోని మల్లికార్జున హిల్స్ ప్రాంతంలో నందారం లలిత రమేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. భక్తి వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పత్రికను ఆవిష్కరించారు. రాబోయే ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై నిర్వాహకులు వివరించారు. కాలనీలో ఐక్యతతో, సమిష్టిగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మల్లికార్జున హిల్స్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామనవమి ఉత్సవాలు కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడమే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. జనరల్ సెక్రటరీ తలారి రాజు కూడా ఉత్సవాలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు.

## ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు



**మరికల్ మార్చి 21 ( వుదయం ప్రతినిధి)** మరికల్ మండల కేంద్రంలోని శనివారం రంజాన్ పండుగ వేడుకలు ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు 30 రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేసి చిన్న పెద్ద పిల్లలందరూ ఉదయాన్నే లేచి ఈద్గులు ప్రార్థనలు చేసినారు ముస్లిం సోదరులకు నారాయణపేట జిల్లా అధ్యక్షులు కే ప్రశాంత్ రెడ్డి ఈద్ ముబారక్ తెలిపారు ఈ సమావేశంలో మాట్లాడుతూ భగవంతుడు ప్రతి ఒక్కరు లౌకిక వాదంతో కులమత బేధాలు లేకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**గద్వాల మార్చి 21 (వుదయం ప్రతినిధి)** రంజాన్ పండుగను పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, ఇతర మండలాల అధికారులు, పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాళ్ శిక్షణ కార్యక్రమం



**సంగారెడ్డి, వుదయం** బీరంగూడ అమీన్‌పూర్ డివిజన్ పండిట్ దీన్ దయాళ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అదెల్లి రవీందర్ ఎడ్ల రమేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి జిన్నారం ఉపాధక్షులు ప్రతాప్ రెడ్డి నర్సింగరావు శంషాబాద్ రాజు ఆగరెడ్డి రమేశరెడ్డి రమేష్ ఈర్ల రాజు తదితరులు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మహాభియాన్ శిబిరం విజయవంతం



**గద్వాల మార్చి 21 (వుదయం ప్రతినిధి)** గద్వాల నియోజకవర్గం కేటీ దొడ్డి మండల కేంద్రంలోని పాగుంట వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమం 20వ తేదీ సాయంత్రం ప్రారంభమై 21వ తేదీ మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఈ శిబిరంలో మండల స్థాయిలో తెలియజేయవలసిన నాలుగు ముఖ్య కాలాంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. అంత్యోదయ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యకర్తల వికాసం, వికసిత భారత్ ముందున్న సవాళ్లు, బీజేపీ పాత్ర మీడియా సంబంధాలపై జిల్లా స్థాయి నాయకులు మండల నాయకులకు వివరించారు శిబిరం సమారోప కార్యక్రమానికి జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్రరెడ్డి హాజరై ముగింపు పలికారు. సిద్ధాంత బలం, కార్యాచరణ శక్తి, క్రమశిక్షణతో బీజేపీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి, గద్వాల నుండి పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, బీజేపీ నాయకులు ఎర్ర భీమ్ రెడ్డి, గోవిందు, దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

**అందోల్ జోగి పేట్ వు దయం** శనివారం జోగి పేట పట్టణంలోని పలువురు ముస్లిం సోదరులను కలిసి ముస్లిం సోదరులు ఇచ్చిన రంజాన్ విందుకు ప్రత్యక్షంగా హాజరై అందరికీ ఈద్ ముబారక్ తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పట్ల జయపాల్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ పి నారాయణ ముద్రాజ్ మున్సిపల్ కౌన్సిలర్ పట్లూరి శివశంకర్ డాకూరి సర్పంచ్ వసంత్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం మాచల విజయ్ కుమార్ బిర్లా శంకర్ కాజా పాషా బాబా ఖాన్ రఫీ ఇమ్రాన్ ఖాన్ సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు భక్తులందరికీ ఆహ్వానం



**గద్వాల మార్చి 21 (వుదయం ప్రతినిధి)** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం చిన్నోనిపల్లి ఆర్ & బి సెంటర్ వద్ద నిర్మించబడుతున్న ఆంజనేయ స్వామి గుడికి విగ్రహాలను తీసుకురావడం జరిగింది. కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి సమీప సంగాపూర్ గ్రామం నుండి ఆంజనేయ స్వామి విగ్రహం మరి బొడ్రాయి లింగమయ్య విగ్రహాలను చిన్నోనిపల్లి గ్రామ పెద్దలు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో భారీ ఎత్తున తీసుకువచ్చారు ఈ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం 23 నుండి 25 వరకు యజ్ఞాలు, హోమాలు, మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించబడును. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై ఆశీర్వాదాలు పొందవలసిందిగా చిన్నోనిపల్లి గ్రామస్థులు హృదయపూర్వ కంగా ఆహ్వానిస్తున్నారు.



## గద్వాల ఈద్గా వద్ద గందరగోళం..

### కమిటీపై మున్నాభాష ఫైర్

**గద్వాల మార్చి 21 (వుదయం ప్రతినిధి)** గద్వాల జిల్లా కేంద్రంలోని రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలపడానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ ఈద్గా కమిటీ సభ్యులపై ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాభాష తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రోజు ఈద్గా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భాల్లో వివిధ పార్టీల నాయకులు కులమతాలకు అతీతంగా వచ్చి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీ అని అన్నారు అయితే ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపిన తర్వాత ఇతర నాయకులకు అవకాశం ఇవ్వకపోవడం కమిటీ వైఖరిగా మారిందని విమర్శించారు ఎమ్మెల్యే వెంట వచ్చిన కొంతమంది క్యాడర్ ఇతర పార్టీల నాయకులను మాట్లాడనీయకుండా గందరగోళం సృష్టించారని ఆరోపించారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా కమిటీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులు స్టేజ్ వద్దకు వచ్చి తమ శుభాకాంక్షలు తెలియజేసేలా అవకాశం కల్పించాలని మున్నాభాష కోరారు.



## ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

- పంట మార్పిడితోనే భూమి సారవంతం
- నేటి నుండి రైతుల ఖాతాలోకి రైతుభరోసా డబ్బుల జమ

**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి మార్చి 21** పంట మార్పిడి చేస్తూ ఆయిల్ ఫామ్ లాంటి లావదాయకమైన పంటలు వండించాలని, భూమి సారవంతాన్నికాపాడుకోవడంలో రైతే ఒక శాస్త్రవేత్త లాగాఆలోచించివాణిజ్యపంటల వైపు మొగ్గు చూపుతూ లాభాలుఆర్జించాలని,మూస ధోరణిలో వ్యవసాయం చేస్తూ నష్టాల ఊబిలో రైతులు చిక్కుకోకూడదనే ఉద్దేశంతో రైతులను ప్రోత్సహిస్తుంది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ సేల్ ప్రెసిడెంట్ అనురూప్ రెడ్డి. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ ప్రాసెసింగ్ కంపెనీని నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిచేతుల మీదుగా ప్రారంభించనున్న సందర్భంగా శనివారం రోజు ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ కి వెళ్తు మార్గమధ్యంలో దుద్దెడలోని మంచాల చిన్న శ్రీనివాస్ వ్యాపార కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అనూరుప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు రైతు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ముందుకు వెళుతుంది అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఇచ్చే పంట ఆయిల్ ఫాంపంట అని, గతంలో ఆయిల్ ఫామ్ అంటే ఖమ్మం, సత్తుపల్లి,అశ్వరావుపేట రైతులకు మాత్రమే తెలుసని, కానీ నేడు తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రదేశాలలో ఆయిల్ ఫాం పంటను రైతులు అధిక సంఖ్యలో పండిస్తున్న నేపథ్యంలో మన సిద్దిపేట ఏరియాలో పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ ప్రాసెసింగ్ కంపెనీ ఏర్పాటు చేయడంతో రైతులకు చాలామేలు జరుగుతుంది అన్నారు. ఎలాంటి చీడపీడలు ఆశించని లాభదాయకమైన పంట ఈ ఆయిల్ ఫామ్ పంట అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉన్నా కానీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు నేటి నుండి రైతు భరోసా నిధులను విడుదల చేస్తున్నారు ముఖ్యమంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోవిందరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, మంచాల కనక రాములు, సిద్దు పాల్గొన్నారు



## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రభాకర్

**సంగారెడ్డి, మార్చి 21:వుదయం** రంజాన్ పండుగ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముస్లిం సోదరుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా పలకరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగం, సహనం, దానధర్మాల గొప్పతనాన్ని ప్రతిబింబించే పవిత్ర పర్వదినమని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనసును పవిత్రం చేసుకుని సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవడం అవసరమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేను కండువా, హిజాబ్‌తో ఘనంగా సత్కరించారు. స్థానికులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా ముచ్చటించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, శ్రీధర్ రెడ్డి, నాగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం సోదరులు, యువకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో రంజాన్

**నారాయణపేట మార్చి 21( వుదయం ప్రతినిధి)** ముస్లింల పవిత్ర పండగ రంజాన్ వేడుకలు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగావ్ ముస్లింలు ఉదయమే చిన్న పెద్దలు అందరూ ఈద్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ ఒకరికొకరు ఆలింగ నం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా నారాయణపేట జిల్లా కేంద్రం లోనీ ఈద్గా లో వివిధ పార్టీల నాయకులు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి,డిసిసి మాజీ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి,జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్య యాదవ్,కౌన్సిలర్ అపిరెడ్డి పల్లి రాము పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మంచాల పోతన్న మృతి

- పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొని కంది శ్రీనివాస రెడ్డి
- కుటుంబ సభ్యులకు పరామర్శ



**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంచాల పోతన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్నఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయన నివాసాన్ని సందర్శించి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించారు.. అనంతరం పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కౌన్సిలర్ ఇజ్జగిరి సంజయ్,నాయకులు కొండా గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి, బండారి సతీష్, బూర్ల శంకరయ్య, తమ్మల చందు, ఖయ్యూమ్, అరవింద్, శంకర్, దాసరి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.




## అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలి

### ఈద్గా వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొన్న షబ్బీర్ అలీ

**కామారెడ్డి, మార్చి 21 (వుదయం ప్రతినిధి):**– పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కామారెడ్డి పట్టణంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, సహనానికి నిలువుటద్దమని ఆయన పేర్కొన్నారు. ఆకలి విలువను తెలుసుకుంటూ, పేదలకు సహాయం చేయడమే ఈ పండుగ యొక్క అసలు పరమార్థమని వివరించారు. గంగా–జమునా తెహజీబ్ సంస్కృతితో అందరూ కలిసి మెలిసి పండుగను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# చక్కని ఆరోగ్యం

## ఈ అలవాట్లతో.. జుట్టు ఆరోగ్యంగా..!

ఆరోగ్యంగా రోజును ప్రారంభిస్తే.. రోజంతా ఉత్సాహంగా ఉండచ్చన్న సంగతి తెలిసిందే! ఈ నియమం జుట్టు ఆరోగ్యానికీ వర్తిస్తుందంటున్నారు నిపుణులు. మనం పాటించే కొన్ని అలవాట్లు జుట్టు ఒత్తుగా, దృఢంగా పెరిగేలా చేస్తాయంటున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం రండి.. నిద్ర లేవగానే కాఫీ, టీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. కానీ వీటికి ముందు గ్లాసు నీళ్లు తాగడం మంచిదంటున్నారు నిపుణులు. ఫలితంగా






కుదుళ్లలో చర్మం తేమగా మారి జుట్టు ఎదుగుదలను ప్రేరేపిస్తుందని చెబుతున్నారు. ఒకవేళ ప్లెయిన్ వాటర్ తాగలేని వారు అందులో నిమ్మరసం, కీరాదోస ముక్కలు.. వంటివి కలుపుకొని తీసుకోవచ్చు. ఉదయాన్నే మనం తీసుకొనే అల్పాహారం ఆకలి తీర్చడానికే కాదు.. జుట్టు ఒత్తుగా పెరిగేలా కూడా చేస్తుందట! అయితే ఇందుకోసం ప్రొటీన్లు అధికంగా ఉండే కోడి గుడ్లు, పెరుగు, పీనట్ బటర్, నట్స్, ప్రొటీన్ బార్స్.. వంటివి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఒత్తిడి ఆరోగ్యాన్నే కాదు.. జుట్టు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. దీన్నుంచి విముక్తి పొందడానికి ఉదయాన్నే చేసే వ్యాయామాలు ఎంతో కీలకమైనవి. ఇందులో భాగంగా నడక, యోగా, ధ్యానం.. వంటివి ప్రయత్నించాలి. ఇవి కుదుళ్లకు రక్తప్రసరణను మెరుగుపరిచి జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తాయంటున్నారు నిపుణులు. కొబ్బరి, బాదం, జొజోబా నూనెల్లో ఏదో ఒక దాన్ని కుదుళ్లకు అప్లై చేసుకొని ఐదు నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. దీనివల్ల జుట్టు కుదుళ్లకు పోషణ అందుతుంది. ఫలితంగా కేశాలు ఒత్తుగా పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అలాగే జుట్టు దువ్వుకోవడానికి చెక్కతో చేసిన, మందపాటి బ్రిజిల్స్ ఉన్న దువ్వెన ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల జుట్టు రాలే సమస్య తగ్గుతుందంటున్నారు. అలాగే తలస్నానానికి గోరువెచ్చటి నీళ్లు ఉపయోగించడం, సల్ఫేట్లు లేని షాంపూలు వాడడం మంచిది. ఇక జుట్టు ఆరబెట్టుకోవడానికి బ్లో డ్రయర్స్ వాడకపోవడం.. జుట్టు కర్లీగా లేదా స్ట్రెయిట్‌గా ఉండేందుకు.. హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడేవారు తక్కువ ఉష్ణోగ్రతను సెట్ చేసుకోవడం, వీటిని వాడే ముందు హెయిర్ స్ప్రే/సీరమ్.. వంటివి ఉపయోగించడం.. ఈ చిట్కాలన్నీ జుట్టు రాలకుండా చేస్తాయంటున్నారు నిపుణులు. ఉదయాన్నే మనకు నచ్చిన పనులకు కాసేపు సమయం కేటాయిస్తే.. ఆ రోజంతా ఉల్లాసంగా గడిపేయచ్చు. అయితే ఈ అలవాటు జుట్టు ఎదుగుదలనూ ప్రేరేపిస్తుందట! అదెలాగంటే.. నచ్చిన పనులు చేయడం వల్ల ఒత్తిడి దరిచేరదు. ఇది జుట్టు ఆరోగ్యానికీ మంచిదేనట. బిగుతుగా జడ వేసుకోవడం లేదంటే బిగుతైన రబ్బర్ బ్యాండ్ ఉపయోగించడం వల్ల జుట్టు తెగిపోయే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే సిల్క్ లేదా శాటిన్ రబ్బర్ బ్యాండ్లు వాడడం.. వదులుగా జడ వేసుకోవడం/ముడేసుకోవడం.. మంచిదంటున్నారు. ఎండ వల్ల చర్మం కందిపోకుండా సన్‌స్క్రీన్ లోషన్ ఎలాగైతే రాసుకుంటామో.. జుట్టు ఆరోగ్యం పాడవకుండా కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో బయటికి వెళ్లేటప్పుడు హెయిర్ సీరమ్ రాసుకోవడం, జుట్టు పూర్తిగా కవరయ్యేలా స్కార్ఫ్ కట్టుకోవడం, టోపీ పెట్టుకోవడం.. వంటివి చేయాలి. ఈ చిట్కా కాలుష్యం బారి నుంచీ జుట్టును కాపాడుతుంది.

## షాంపూలో ఇవి కలిపితే..!

షాంపూను నేరుగా కాకుండా కొన్ని నీళ్లలో కలుపుకొని తలస్నానం చేయడం మనకు తెలిసిందే. అయితే నీటితో పాటు కొన్ని పదార్థాలను షాంపూలో కలుపుకొని తలస్నానం చేయచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుందంటున్నారు.



రోజ్‌వాటర్‌లో షాంపూను కలిపి తలస్నానం చేస్తే కుదుళ్లలో దురద, అలర్జీ.. మొదలైన వాటి నుంచి ఉపశమనం లభిస్తుందట. అంతేకాదు.. జుట్టు మెత్తగా, పట్టుకుచ్చులా మెరుస్తుందంటున్నారు నిపుణులు. రోజ్ మేరీ, లావెండర్, పెప్పర్ మింట్, టీట్రీ నూనెల్లో ఏదైనా ఒకదాన్ని షాంపూలో కాస్త కలిపి చూడండి. ఇలా చేయడం వల్ల జుట్టు రాలడం తగ్గి మరింత ఒత్తుగా పెరిగే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. షాంపూలో నిమ్మరసం కలిపి తలస్నానం చేస్తే వెంట్రుకలు నిగనిగలాడుతూ పట్టుకుచ్చులా మెరుస్తాయట.షాంపూలో కాస్త తేనె కలిపితే జుట్టు పొడిబారకుండా తేమను సంతరించుకుంటుంది. తేనె కుదుళ్లను ఆరోగ్యంగా మారుస్తుందంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## తరచుగా తుమ్ములు వస్తున్నాయా?

రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? రోజులో ఒక్కసారో రెండుసార్లో తుమ్మడం సాధారణ విషయమే. కానీ రోజూ, పదే పదే, ముఖ్యంగా ఉదయం లేచిన వెంటనే లేదా దుమ్ము, వాసన, చలి తగిలినప్పుడు తుమ్ములు వస్తుంటే చాలామంది ఆందోళన చెందుతుంటారు. కొందరు ఒకేసారి అనేకసార్లు తుమ్ములు తుమ్ముతుంటారు. దీంతో వారిలో "నాకు రోగనిరోధక శక్తి (ఇమ్యూనిటీ) తగ్గిపోయిందా?" అనే సందేహం చాలామందిలో కలుగుతుంది. నిజంగా తరచుగా తుమ్ములు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతమేనా? నిపుణులు ఏమంటున్నారు? పూర్తి వివరాలు తెలుసుకుందాం. తుమ్ము అనేది మన శరీరంలోని ఒక సహజ రక్షణ చర్య. ముక్కులోకి దుమ్ము, అలెర్జీ కారకాలు, బ్యాక్టీరియా లేదా వైరస్‌లు ప్రవేశించినప్పుడు, వాటిని బయటకు పంపడానికి శరీరం తుమ్ము ద్వారా స్పందిస్తుంది. అంటే, తుమ్మడం అనేది శరీరం పనిచేస్తున్న సంకేతమే తప్ప, తప్పనిసరిగా బలహీనతకు గుర్తు కాదు. 1. అలెర్జీలు.. ఇదే అత్యంత సాధారణ కారణం. దుమ్ము, పుప్పొడి (పోలెన్), పెంపుడు జంతువుల వెంట్రుకలు, చలి గాలి, ఇవన్నీ తుమ్ములను ప్రేరేపిస్తాయి.2. వాతావరణ మార్పులు.. ఒక్కసారిగా చలి నుంచి వేడికి లేదా వేడి నుంచి చలికి మారితే ముక్కులోని నరాలు స్పందించి తుమ్ములు వస్తాయి.3. సైనసైటిస్ లేదా ముక్కు సమస్యలు.. సైనస్ ఇన్‌ఫెక్షన్, ముక్కులో వాపు ఉండటం వల్ల కూడా తుమ్ములు ఎక్కువవుతాయి. 4. వైరల్ ఇన్‌ఫెక్షన్లు.. జలుబు, ఫ్లూ మొదలైనవి ఉన్నప్పుడు తుమ్ములు సహజం. 5. కాలుష్యం, రసాయన వాసనలు.. పెర్ఫ్యూమ్స్, సిగరెట్ పొగ, కెమికల్స్ కూడా తుమ్ములకు కారణం కావచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఇది కొంతవరకు నిజమే. తరచూ తుమ్మడం అనేది ఎక్కువగా అలెర్జీ లేదా పర్యావరణ కారణాల వల్లే జరుగుతుంది. బలహీనమైన ఇమ్యూనిటీ ఉన్నవారికి సాధారణంగా.. తరచూ జలుబులు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా రావడం, గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడటం, నిరంతర అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి.కేవలం తుమ్ములేఉన్నాయంటే అది ఇమ్యూనిటీ తక్కువగా ఉందని చెప్పలేం. కానీ, తరచుగా తుమ్మడం, పునరావృత జలుబు, గొంతు నొప్పి, అలసట లేదా తరచుగా అనారోగ్యాలు రావడం బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు సంకేతాలు. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు, శరీరం బాహ్య అలెర్జీ కారకాలు, వైరస్లతో సమర్థవంతంగా పోరాడలేకపోతుంది.



## అందుకే నేలపై కూర్చొని తినాలట!

ఈ రోజుల్లో నేల మీద కూర్చొని భోజనం చేసేవారు చాలా తక్కువమందే! కానీ కుర్చీ కంటే నేలపై కూర్చొని తినడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. కాళ్లు ముడుచుకొని నేల మీద కూర్చోవడం వల్ల ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయని చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి.. నేల మీద కూర్చొని తినడం చాలా సౌకర్యంగా ఉంటుంది. అలాగే దీనివల్ల పొట్ట చుట్టూ ఉండే కండరాల్లో నొప్పి ఉంటే తొలగిపోయే అవకాశం ఉంటుందట. ఇలా రోజూ కింద కూర్చొని తినడం అలవాటు చేసుకుంటే కండరాల్లో కదలిక పెరిగి అవి ఫ్లెక్సిబుల్‌గా, దృఢంగా మారతాయి. అలాగే ఈ భంగిమ వివిధ రకాల శారీరక నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. కింద కూర్చొని నేలపై ప్లేట్ పెట్టుకుని తినడం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుందంటున్నారు నిపుణులు. ఈ ప్రక్రియలో భోజనం నోట్లో పెట్టుకోవడానికి ముందుకు వంగడం, తిరిగి వెనక్కి రావడం.. ఇలా వెంటవెంటనే చేసే భంగిమల వల్ల ఆహారం జీర్ణం కావడానికి అవసరమైన ఆమ్లాలు శరీరంలో ఉత్పత్తవుతాయట. తద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి కూడా అందుతుంది. నేలమీద కూర్చొని భోంచేయడం వల్ల బరువు కూడా తగ్గచ్చట! అదెలాగంటే.. సాధారణంగా మనకు సరిపోయేంత తిన్నామా? లేదా? అనే విషయం తెలియడానికి పొట్ట నుంచి మెదడుకు సిగ్నల్స్ అందించే నాడి ఒకటి ఉంటుంది. డైనింగ్ టేబుల్‌పై తినడం కంటే కింద కూర్చొని తినడం వల్ల ఈ నాడి మరింత సమర్థంగా పనిచేస్తుందట! కాబట్టి మనకు సరిపోయేంత ఆహారం మాత్రమే తీసుకుంటాం.. ఫలితంగా బరువును అదుపులో ఉంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఒకసారి మీ కుటుంబ సభ్యులందరితో కలిసి హాయిగా కింద కూర్చొని తినండి.. మనసుకు ఎంత ప్రశాంతంగా ఉంటుందో మీకే అర్థమవుతుంది. ఇది పరోక్షంగా అనుబంధాల్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.




## సన్‌ఫ్లవర్ గింజలతో.. కొత్త మెరుపు!

చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. అయితే– ఇలాంటి సమస్యలన్నిటికీ పొద్దు తిరుగుడు గింజలతో చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు. సన్‌ఫ్లవర్ గింజలతో తయారుచేసిన స్క్రబ్ ఉపయోగించడం ద్వారా చర్మం, చర్మరంధ్రాలు శుభ్రపడి కొత్త కళ సంతరించుకునే అవకాశం ఉంటుందట. ఈ ఫలితాన్ని పొందడానికి.. అరకప్పు పొద్దుతిరుగుడు గింజలను తీసుకొని మిక్సీలో వేసి పొడిలా తయారుచేసుకోవాలి. ఈ పొడిని గాజు సీసాలో వేసి ఫ్రిజ్‌లో భద్రపరుచుకోవాలి. అందులోంచి రోజూ కొంత పొడిని తీసుకుని, కొద్దిగా నీరు కలిపి మిశ్రమంలా చేసుకోవాలి. దాంతో ముఖాన్ని, మెడను రుద్దుకోవడం వల్ల చర్మం శుభ్రపడటంతో పాటు తగిన పోషణ అంది పొద్దు తిరుగుడు గింజలను రెండు నుంచి మూడు గంటల పాటు ఎండలో ఉంచాలి. ఆ



తర్వాత వాటిని మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. ఇలా చేసేటప్పుడు మరీ మెత్తగా కాకుండా.. కాస్త గరుకుగా ఉండేలా చూసుకోవాలి. దీన్ని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ఇలా తయారుచేసిన పొడిని టీస్పూన్ పరిమాణంలో తీసుకొని.. దీనికి మరో టీస్పూన్ వెన్న తొలగించని పాలు, చిటికెడు పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పావుగంట నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఈ ప్యాక్ ముఖంపై పేరుకొన్న మురికిని తొలగిస్తుంది. చర్మానికి తేమనందించి పొడి చర్మం సమస్య నుంచి విముక్తి కలిగిస్తుందట. అలాగే చర్మఛాయ సైతం మెరుగుపడుతుందట. ఈ ప్యాక్‌ని వారానికోసారి వేసుకోవడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది అంటున్నారు నిపుణులు. మిశ్రమ



చర్మతత్వం కలిగిన వారికి చర్మంపై ప్యాచెస్ మాదిరిగా అక్కడక్కడా పొడిగా కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వారికి పొద్దుతిరుగుడు గింజలతో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ చక్కగా నప్పుతుందంటున్నారు నిపుణులు. దీనికోసం పై పద్ధతిలో తయారుచేసి పెట్టుకొన్న సన్‌ఫ్లవర్ గింజల పొడిని టీస్పూన్ తీసుకోవాలి. దీనికి కొద్దిగా గంధం పొడి, రోజ్‌వాటర్ కలిపి మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తడివస్త్రంతో ముఖం తుడుచుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై డ్రై ప్యాచెస్ పోవడంతో పాటు.. చర్మం సైతం అందంగా కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు.

## ఎంత సహజమైనా... జాగ్రత్త!



ఖరీదైన బ్యూటీ చికిత్సల వెంట పరుగెత్తలేం అనుకున్నవాళ్లు చూసేది వంటగది వైపే! అక్కడ వాడే ఎన్నో పదార్థాలు మన సౌందర్యాన్నీ పెంచేస్తాయి మరి. వంటింటి చిట్కాలు వాడటం మేలే కానీ... సరిగానే వాడుతున్నారా? కొన్ని మేలు చేయకపోగా హానికరం కావొచ్చు మరి. నిమ్మ: విటమిన్ సి చర్మానికి మేలు చేస్తుందని చాలామంది నిమ్మని ముఖానికి రాస్తుంటారు. కానీ నిమ్మచెక్కను ముఖానికి రుద్దడం, నేరుగా నిమ్మరసాన్ని రాయడం మంచిది కాదు. చర్మం పొడిబారి... దద్దుర్లు, దురదలకు కారణమవుతుంది. కొన్ని చుక్కలు అది కూడా దేనిలోనైనా కలిపి రాసుకుంటేనే ప్రయోజనం. దాల్చిన చెక్క: దీన్ని ఎక్కువగా మొటిమలు ఉన్నవాళ్లు రాస్తుంటారు. ఇదీ దద్దుర్లు, రంగు మారిపోవడం కొన్ని సార్లు చర్మం మీద మంటకీ కారణమవుతుంది. ఈ నూనె కూడా కొందరిలో ఇరిటేషన్‌కి దారితీస్తుంది. కాబట్టి, గమనించుకోవాల్సిందే. చక్కెర: స్క్రబింగ్‌లో దీన్ని నిమ్మ కాయ లేదా టొమాటో మీద వేసి, కాఫీలో కలిపి రాస్తుంటారు. మృతకణాలు పోగొట్టడానికి మేలు చేస్తుందన్న మాట వాస్తవమే కానీ... గాయాలకీ దారితీస్తుంది. చర్మం ఎంత సున్నితంగా ఉంటుందో తెలిసిందేగా! పంచదార గుళికల ఉపరితం కాస్త పదునుగా ఉంటుంది. ఇవి చర్మ కణజాలానికి గాయం చేస్తాయి. యాక్నే, మొటిమలు ఉంటే సమస్యని మరింత జటిలం చేస్తాయి. కాబట్టి, కరిగే దాకా ఆగడం మేలు. లేదంటే ప్రత్యామ్నాయాలనైనా ఎంచుకోవాలి. యాపిల్ సిడార్ వినెగర్: దీనిలో ఆమ్ల గుణాలెక్కువ.

ఇదీ చర్మంపై కాలిన గాయాలకు కారణమవగలదు. కాబట్టి, నేరుగా వాడొద్దు. నీటిలో గానీ వేరే ఇతర వాటిలోగానీ కలిపి రాయాలి. సున్నిత చర్మతత్వం ఉన్నవాళ్లు వీలైనంత దూరంగా ఉంటే మంచిది.

## వేసవి వచ్చేసింది.. చల్లటి నీళ్లు తాగేద్దామా!

వేసవి తాపం మొదలైందంటే చాలు, అందరికీ గుర్తొచ్చేది మట్టి కుండే. రిఫ్రిజిరేటర్లు ఉన్నా, ఇందులోని చల్లటి నీరు ఇచ్చే తృప్తి, ఆరోగ్యం మరెందులోనూ లభించవు. ఇంకా మరెన్నో ప్రయోజనాలూ ఉన్నాయి. అవేంటి? అసలు దీన్ని ఎలా ఉపయోగించాలో తెలుసా? సహజంగా చల్లదనం... కుండలకు ఉండే సూక్ష్మ రంధ్రాల ద్వారా నీరు ఆవిరవుతూ, లోపల ఉన్న నీటిని సహజంగా చల్లబరుస్తాయి. పైగా ఇవి గొంతుకు ఎటువంటి హానీ చేయవు. పీహెచ్ సమతుల్యత: స్వభావరీత్యా మట్టి క్షార(ఆల్కలైన్)గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది తాగే నీటిలోని ఆమ్ల గుణాన్ని తటస్థీకరించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఖనిజాల లభ్యత: మట్టిలో సహజంగా ఉండే ఖనిజాలు... నీటిలో చేరడంవల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పైగా ఇవి ప్లాస్టిక్ తరహాలో భూమికి హాని చేయవు. విద్యుత్ వినియోగం అసలే అవసరం లేదు. మట్టి కుండలు ఎక్కువ కాలం మన్నాలన్నా, నీళ్లు చల్లగా ఉండాలన్నా ఈ జాగ్రత్తలు తప్పనిసరి. కొన్న వెంటనే కుండను వాడకూడదు. ముందు సీజనింగ్ చేయాలి. ఇందుకోసం దాన్ని కనీసం 24 గంటల పాటు నీటిలో నానబెట్టాలి. దీనివల్ల మట్టి వాసన పోవడమే కాకుండా, పాత్ర గట్టిపడుతుంది. లేదంటే శుభ్రం చేశాక... అందులో గంజి నీళ్లు పోయండి. వాటిని ఏ రోజుకారోజు మారుస్తూ ఇలా మూడు రోజులు చేయండి. దీనివల్ల పగుళ్లు రావు. మట్టి కుండను కడగడానికి సబ్బు వాడకూడదు. ఎందుకంటే అందులోని రసాయనాలు మట్టి రంధ్రాల్లోకి వెళ్లి నీటి రుచిని మారుస్తాయి. కేవలం గోరువెచ్చని నీళ్లు, మెత్తని బ్రష్‌తో శుభ్రం చేయాలి. లేదంటే... బియ్యప్పిండి, సెనగ పిండి, నిమ్మతొక్క... వంటివాటితో స్క్రబ్ చేయొచ్చు. వేడినీళ్లతో కడిగి నీడలో ఆరనిచ్చినా మేలే. నేరుగా ఎండలో మాత్రం పెట్టకండి. నీళ్లు పోశాక... తడి గోనె సంచిని గానీ కాటన్ వస్త్రాన్ని గానీ కుండ చుట్టూ చుట్టాలి. అలాగే దీన్ని గాలి ధారాళంగా తగిలే చోట ఉంచితే నీరు త్వరగా చల్లగా అవుతాయి. నాచు పట్టకుండా ఉండటానికి వారానికి ఒకసారి కుండను ఖాళీ చేసి ఎండలో ఆరబెట్టడం మంచిది.



## రూపాయికి 'డాలర్' షాక్




అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ అధోపాతాళానికి పడిపోయింది. శుక్రవారం అమెరికన్ డాలర్‌తో పోల్చితే 82 పైసలు లేదా 1 శాతం క్షీణించి 93.71కి పడిపోయింది. ఇది భారత చరిత్రలోనే అత్యంత పేలవ, కనిష్ట స్థాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ముడి చమురు బ్యారెల్ 110 డాలర్లు దాటడం, ద్రవ్యోల్బణ భయాలతో ఇన్వెస్టర్లు డాలర్ వైపు మొగ్గు చూపడం రూపీని బలహీనపర్చింది. రూపాయి విలువ 93 మార్కును దాటడం కేవలం ఒక సంఖ్య కాదని.. ఇది ప్రజల కొనుగోలు శక్తిని హరించనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




# ఐఫోన్ యూజర్లకు కొత్త టెన్షన్.. కోట్లాది మందికి పొంచి ఉన్న ముప్పు

ఐఫోన్ వినియోగదారులను వణికించే మరో ప్రమాదకరమైన స్పైవేర్ వెలుగులోకి వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఉన్న ఐఫోన్లను లక్ష్యంగా చేసుకుని 'డార్క్ స్వార్డ్' అనే అత్యంత శక్తివంతమైన స్పైవేర్ దాడి చేస్తోందని భద్రతా పరిశోధకులు హెచ్చరించారు. గూగుల్, లుకౌట్, ఐ-వెరిఫై సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ మాల్వేర్ ఇన్ఫెక్ట్ అయిన వెబ్‌సైట్ల ద్వారా వేగంగా వ్యాపిస్తోందని పేర్కొంది. దీని సాయంతో హ్యాకర్లు వినియోగదారుల ఫోన్ల నుండి అత్యంత సున్నితమైన వ్యక్తిగత డేటాను దొంగిలిస్తున్నట్లు నిపుణులు గుర్తించారు. సౌదీ అరేబియా, టర్కీ, మలేషియా, ఉక్రెయిన్ వంటి దేశాల్లోని ప్రముఖ వ్యక్తులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయని గూగుల్ వెల్లడించింది. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు చెందిన వార్తా వెబ్‌సైట్లు మరియు ప్రభుత్వ సంస్థల సైట్లలో ఈ మాల్వేర్‌ను నిక్షిప్తం చేసినట్లు సమాచారం. ఆ సైట్లను సందర్శించిన వారి ఫోన్ల నుండి సమాచారాన్ని సేకరించేందుకు హ్యాకర్లు దీనిని వాడుతున్నారు. ఈ స్పైవేర్ వెనుక



కొన్ని వాణిజ్య సంస్థలతో పాటు, ప్రభుత్వ మద్దతు ఉన్న హ్యాకర్ల హస్తం కూడా ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇటీవలే వెలుగులోకి వచ్చిన కొరునా అనే మరో స్పైవేర్‌తో కలిసి ఈ 'డార్క్ స్వార్డ్' పనిచేస్తోంది. ఈ రెండు హ్యాకింగ్ టూల్స్ కలిస్తే క్రిప్టోకరెన్సీ వాలెట్లను ఖాళీ చేయడంతో పాటు, ఫోన్‌లోని పూర్తి వ్యక్తిగత సమాచారాన్ని హ్యాకర్ల చేతుల్లో పెట్టగలవని పరిశోధకులు చెబుతున్నారు. అయితే.. ఈ మాల్వేర్ తాజా ఐఓఎస్ వెర్షన్లపై ప్రభావం చూపనప్పటికీ, ఐఓఎస్ 18 వెర్షన్ వాడుతున్న ఫోన్లపై సమర్థవంతంగా పనిచేస్తోంది. ప్రస్తుతానికి మార్కెట్లో దాదాపు పావు వంతు ఐఫోన్లు పాత ఓఎస్ వెర్షన్లపైనే నడుస్తుండటంతో ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉంది. గతంలో కూడా ఆపిల్ పరికరాల్లో ఇలాంటి భద్రతా లోపాలు తలెత్తాయి. గత ఏడాది మే నెలలో ఎయిర్ ప్లే ఫీచర్‌లోని లోపాన్ని ఉపయోగించుకుని ఒకే వైఫై నెట్‌వర్క్‌లో ఉన్న డివైజ్‌లను హ్యాక్ చేసే అవకాశం ఉందని గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా అత్యంత అధునాతన దాడుల ద్వారా లాక్ చేసిన ఐఫోన్లలో 'యూఎస్‌బీ రెస్ట్రిక్టెడ్ మోడ్'ను నిలిపివేసే ప్రయత్నం జరిగిందని ఆపిల్ స్వయంగా వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఐఫోన్ వినియోగదారులు తమ ఫోన్లను వెంటనే లేటెస్ట్ సాఫ్ట్‌వేర్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారీగా బంగారం, వెండి ధరలు పతనం..

గత పదిరోజులుగా బంగారం ధరలు భారీగా పతనమవుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటల తర్వాత బంగారం ధరలు తగ్గాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2940 తగ్గి రూ.1,45,970కి పడిపోయింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2750 తగ్గి రూ.1,33,800కి దిగివచ్చింది. తెలుగురాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో బంగారం ధరలు స్వల్ప తేడాతో దాదాపు ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ ధరలకు జీఎస్టీ, తరుగు అదనంగా ఉంటుంది. మార్చి 12వ తేదీ నుంచి ఈరోజు వరకూ.. అంటే 10 రోజుల సమయంలో బంగారం ధరలు ఊహించని రీతిలో తగ్గడంతో.. కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములపై రూ.17,340 తగ్గగా.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములపై రూ.15,900 తగ్గింది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఇదే మంచి సమయంగా చెప్తున్నారు నిపుణులు. మరోవైపు వెండి ధరలు కూడా క్రమంగా పతనమవుతున్నాయి. శనివారం ఉదయం కిలో వెండి



ధర రూ.10,000 తగ్గి.. రూ.2,50,000వద్ద కొనసాగుతోంది. గడిచిన 10 రోజుల్లో ఏకంగా రూ.50,000 తగ్గడం గమనార్హం. పశ్చిమాసియాలో యుద్ధపరిస్థితుల నేపథ్యంలో.. బంగారం, వెండి పై ఉంచిన పెట్టుబడుల్ని ఇన్వెస్టర్లు విత్ డ్రా చేసుకోవడం వల్లే ఈ డౌన్ ఫాల్ కనిపిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ప్రీమియం పెట్రోల్ ధర పెంపు



ప్రీమియం పెట్రోల్ ధరలను పెట్రోలియం సంస్థలు పెంచాయి. పవర్ పెట్రోల్ ధరను లీటర్‌కు రెండు రూపాయిలను పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ప్రకటించింది. అలాగే, బిపిసిఎల్ స్పీడ్, ఐఓసిఎల్ ఎక్స్‌పి95 వంటి ప్రీమియం పెట్రోల్ ధరలను ఆయా సంస్థలు పెంచాయి. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 వరకూ ఈ ప్రీమియం పెట్రోల్ ధరను పెంచాయి. శుక్రవారం నుంచే పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. సాధారణ పెట్రోల్ ధరల్లో మార్పు లేనట్లు తెలిపింది. అలాగే, ఇండస్ట్రియల్ డీజిల్ ధర లీటర్‌పై రూ.22 పెరిగింది. సాధారణ డీజిల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో మూడు రకాలుగా పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. మూడోది హై ఆక్టేన్ ప్రీమియం. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హై-ఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. అయితే 'ముడి చమురు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదు. అదనపు నిల్వలు కూడా మార్గమధ్యంలో ఉన్నాయి. అధికారిక అప్‌డేట్లను విశ్వసించండి' అనిహెచ్‌పిసిఎల్ ప్రకటనలో తెలిపింది.

## ఎస్‌బీఐకి రూ.6,337 కోట్ల పన్ను నోటీసులు



ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భారీ పన్ను నోటీసులను అందుకుంది. 2023-24 అసెస్‌మెంట్ ఏడాదికిసంబంధించి రూ.6,337 కోట్ల(వడ్డీతో సహా) పన్ను చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందుకున్నట్లు బ్యాంకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వులను సవాలు చేస్తామని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు తన పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తక్కువగా చూపించిందని ఆదాయపు పన్ను శాఖ అభిప్రాయ పడింది. అయితే, పన్ను నిబంధనల ప్రకారమే మినహాయింపులు లెక్కించినట్లు ఎస్‌బీఐ చెబుతోంది. వివిధ కారణాలపై అసెస్‌మెంట్ యూనిట్ చేసిన తిరస్కరణల కారణంగా ఈ పన్ను డిమాండ్ తలెత్తింది. నిర్ణీత కాల వ్యవధిలోగా అప్పీలేట్ అధికారుల ముందు అప్పీల్ దాఖలు చేయడంతో సహా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

# పంజాబ్ కింగ్స్‌తో నిప్పన్ పెయింట్ భాగస్వామ్యం

## 'బ్లాబర్ షేర్' మాస్కట్ ఆవిష్కరణ

భారత్‌లో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకునే దిశగా నిప్పన్ పెయింట్ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఐపీఎల్ 2026 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పంజాబ్ కింగ్స్ జెర్సీపై నిప్పన్ లోగో మెరవనుంది. అభిమానులను ఉత్సాహపరిచేందుకు 'బ్లాబర్ షేర్' అనే సరికొత్త మాస్కట్‌ను కూడా ఆవిష్కరించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో టీమ్ స్టార్ క్రికెటర్లు యుజ్వేంద్ర చాహల్, శశాంక్ సింగ్ ఈ కొత్త జెర్సీని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిప్పన్ పెయింట్ (ఇండియా) గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శరద్ మల్హోత్రా మాట్లాడుతూ పంజాబ్ కింగ్స్‌తో చేతులు కలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. అపారమైన శక్తి, స్ఫూర్తి, గెలవాలనే పట్టుదల కలిగిన జట్టు ఇదన్నారు. 'నెవర్ గివ్ అప్' అనే తత్వం నిప్పన్ పెయింట్ మూల విలువలతో లోతుగా ముడిపడి ఉందన్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న మన దేశ గమనాన్ని ప్రతిబింబించేలా 'మా నయా ఇండియా కే నయా రంగ్' దార్శనికతను ఈ పట్టుదలే ముందుకు నడిపిస్తోందన్నారు. దేశంలోని ప్రతి మూలలో ఉన్న క్రికెట్ అభిమానులతో కనెక్ట్ అవ్వడానికి ఐపీఎల్ ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా రెండు బ్రాండ్ల శక్తిని, రంగులను



అభిమానుల చెంతకు చేర్చాలని నిశ్చయించుకున్నామని తెలిపారు.ఈ సందర్భంగా నిప్పన్ పెయింట్ ఇండియా (డెకరేటివ్ కోటింగ్స్ బిజినెస్) ప్రెసిడెంట్ మార్క్ టైటస్ మాట్లాడుతూ భారతదేశంలోని యువ వినియోగదారులకు చేరువ కావడానికి ఐపీఎల్ అత్యంత శక్తివంతమైన వేదిక అన్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుకు ఉన్న ఉత్సాహభరితమైన గుర్తింపు, అంకితభావం గల అభిమానులు, నిప్పన్ పెయింట్ వృద్ధికి సరైన భాగస్వాములుగా నిలుస్తారన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం జెర్సీపై లోగో ప్రదర్శనకే పరిమితం కాదన్నారు. భారతీయ తదుపరి తరం వినియోగదారులతో శాశ్వతమైన సంబంధాలను ఏర్పరచుకోవడమే మా లక్ష్యమన్నారు.ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ సీఈఓ సతీష్ మీనన్ మాట్లాడుతూ నిప్పన్ పెయింట్‌ను పంజాబ్ కింగ్స్ కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నామన్నారు. జట్టులోని అనుభవజ్ఞులు, ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లతో ఈ సీజన్‌ను విజయవంతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సౌరభ్ అరోరా మాట్లాడుతూ నిప్పాన్ పెయింట్ పంజాబ్ కింగ్స్ కుటుంబంలో చేరడం మాకు దక్కిన గౌరవం అన్నారు. ఆవిష్కరణలు, నాణ్యతకు మారుపేరైన ఈ బ్రాండ్, ఒక డైనమిక్, హై-పెర్ఫార్మెన్స్ ఫ్రాంచైజీని నిర్మించాలనే మా దార్శనికతకు అనుగుణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా భారత స్టార్ స్పిన్నర్, పంజాబ్ కింగ్స్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ మాట్లాడుతూ నిప్పన్ పెయింట్ ఇండియా వంటి బలమైన భాగస్వాముల మద్దతు లభించడం ఎప్పుడూ ఉత్సాహాన్నిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ క్రికెటర్ శశాంక్ సింగ్ మాట్లాడుతూ పంజాబ్ కింగ్స్‌కు అత్యంత ఉద్వేగభరితమైన అభిమాన గణం ఉందన్నారు.





## ఢిల్లీ క్యాపిటల్స్ ఎదురుదెబ్బ.. ప్రారంభ మ్యాచ్‌లకు స్టార్క్ దూరం



ఐపిఎల్ ప్రారంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, ఆస్ట్రేలియా క్రికెటర్ మిచెల్ స్టార్క్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నా డు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్క్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా(సిఎ) ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత ఏడాదిగా మిచెల్ స్టార్క్‌పై తీవ్ర పనిభారం పడిందని, ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడాడని, బిగ్‌బాష్ లీగ్, టెస్ట్‌ల్లో అత్యధిక బంతులు విసిరిన బౌలర్ల జాబితాలో ముందున్నాడని సిఎ తాజాగా పేర్కొంది. టి20ల్లో అతడు వేసేది నాలుగు ఓవర్లే అయినా.. ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని జట్టు మేనేజ్‌మెంట్ భావించింది. అందుకే రాబోయే రోజుల్లో రిటర్న్ టు ప్లే ప్రొటోకాల్స్‌ను అనుసరించి క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇవ్వనుంది. దాంతో తొలి వారంలో మ్యాచ్‌లకు అతను దూరమయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయని క్రికెటర్ వర్గాలు పేర్కొన్నాయి.

# నెట్స్ ప్రాక్టీస్‌లో ధోనీ గాయపడిన ఘటన, అభిమానులు ఆందోళనలో!



గాయం గురించి ప్రకటన చేయలేదు, అయితే అభిమానులలో అతని ఫిట్‌నెస్ పై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ధోనీ ఐపీఎల్ 2023 సీజన్ నుంచే ఎడమ మోకాలి గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ సీజన్ ముగిసిన వెంటనే ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ హాస్పిటల్‌లో ప్రముఖ స్పోర్ట్స్ డాక్టర్ దిన్షా పార్దివాలా శస్త్ర చికిత్స చేసి గాయం సరిచేశారు. సర్జరీ తర్వాత కూడా ఐపీఎల్ 2024, 2025 సీజన్లలో ఆడినప్పటికీ, మోకాలి సమస్య పూర్తిగా తగ్గలేదు. తాజాగా అతని కుంటుతున్న వీడియో ఈ

ఐపీఎల్ 2026 సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ తమ ప్రాక్టీస్ సెషన్లను ప్రారంభించింది. ఇతర ఫ్రాంచైజీల కన్నా ముందుగా, హోమ్ గ్రౌండ్ చెన్నై చెపాక్ స్టేడియంలో ప్రాక్టీస్ క్యాంప్ మొదలుపెట్టారు.మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ నేతృత్వంలో, ఆటగాళ్లందరూ కొత్త సీజన్ కోసం కఠోర శిక్షణలో ఉన్నాయి. గంటలకొద్దీ బ్యాటింగ్, బౌలింగ్ సెషన్స్ మరియు ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లతో జట్టు సన్నద్ధమవుతోంది.45 ఏళ్ల వయసులోనూ ధోనీ తన ఆటను కొనసాగిస్తున్నాడు. అయితే, నెట్‌సెషన్ తర్వాత మైదానం వదిలి వెళ్ళే సమయంలో మోకాలి నొప్పితో కుంటుతూ, కాస్త కష్టంగా అడుగు వేస్తూ కనిపించాడు. ఈ వీడియో సోషల్ డియాలో వైరల్‌గా మారింది. ఇప్పటి వరకు అ*ఐ అధికారికంగా ధోనీ విషయం గుర్తు చేస్తోంది.ఈ వీడియోపై అభిమానులు కలవివిధ రకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. కొందరు 'అంత రిస్క్ తీసుకోవాల్సిన అవసరం లేదు, రిర్మెంట్ ప్రకటించాలి' అని చెబుతున్నారు, మరి కొందరు 'చెన్నై జట్టు, అభిమానులపై ఉన్న ప్రేమతో ధోనీ నొప్పిని భరిస్తూ ఆటలో కొనసాగుతున్నాడు' అని అభినందిస్తున్నారు.ఐపీఎల్ ప్రారంభం నుండి, అ*ఐ తరపున ధోనీ (తన నిషేధం సీజన్లు తప్ప) ఆడాడు. వికెట్ కీపింగ్, విధ్వంసకర బ్యాటింగ్ తో జట్టుకు కీలకంగా నిలిచాడు. కెప్టెన్‌గా మైదానంలో తీసుకునే వ్యూహాలు, నిర్ణయాలు ఏ జట్టు సభ్యుడికీ సాటిలేవు. రిర్మెంట్ గురించి ప్రచారం కొనసాగుతున్న క్రమంలో, ఈ వీడియో అభిమానుల ఆందోళనను మరింత పెంచింది.

# డిసెంబర్లో దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళల జట్టు

ఈ ఏడాది చివర్లో భారత మహిళలజట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరి వెళ్లనుంది. ఈ పర్యటనలో భాగంగా ఏకైక టెస్ట్‌తోపాటు మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. డిసెంబర్ 9 నుంచి 13 మధ్య పోర్ట్‌చెస్ట్రూమ్ వేదికగా మూడు వన్డేల సిరీస్‌ల జరగనుండగా.. కేప్‌టౌన్ వేదికగా ఏకైక టెస్ట్ 20-23 మధ్య జరగనుంది. గత ఏడాది ఐసిసి వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారతజట్టు దక్షిణాఫ్రికాను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అలాగే దక్షిణాఫ్రికాతో ఐదు టి20ల సిరీస్ ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగనుండగా.. ఐసిసి టి20 ప్రపంచకప్ జూన్‌లో జరగనుంది. టి20 ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్లకు ఒకే గ్రూప్‌లో చోటు దక్కాయి. ఇక 2027 ఏప్రిల్‌లో ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు రానుంది. ఆ సిరీస్‌లో భాగంగా మూడు వన్డేలు, మరో మూడు టి20ల సిరీస్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ కూడా జరగనున్నట్లు ఐసిసి తాజా ప్రకటనలో పేర్కొంది.



భారత్-దక్షిణాఫ్రికా మహిళలజట్ల మధ్య పర్యటనకు సంబంధించి ఇరుదేశాల క్రికెట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటనలో షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేశాయి.

## కష్టకాలంలో మానసిక వేదనతో పోరాడుతున్నా..

పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్ ఓడిపోవడం వల్ల ఆమె మానసిక ఒత్తిడికి గురవుతానని, ఓటములు కోర్టులో ఆటపై నమ్మకం కోల్పోతున్నట్లుగా అనిపిస్తాయని తెలిపారు.గురువారం ప్రారంభమైన మియామి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో



స్వియాటెక్ తొలి రౌండ్‌లోనే నిరాశకరంగా నిలిచారు.మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 50వ ర్యాంకర్ మగ్దా లినెట్టె 6-1, 5-7, 6-3తో ప్రపంచ మూడో ర్యాంకర్ స్వియాటెక్‌ను మూడు సెట్లలో ఓడించింది. డబ్ల్యూటీఏ టూర్‌లో 73 వరుస విజయాల తర్వాత మొదటి రౌండ్‌లో ఓడిపోవడం ఆమెకు ఇదే తొలిసారి.మ్యాచ్ తర్వాత స్వియాటెక్ మాట్లాడుతూ, "ఓడిపోయానని నమ్మడం కష్టంగా ఉంది. కొన్ని రకాలుగా టెన్నిస్ ఆట ఇప్పుడు కష్టంగా అనిపిస్తోంది. ఈ ఆట చాలా సులభం అనుకున్నా, కోర్టులో మానసిక స్థితి అత్యంత కీలకం.ఈ ఓటమి నుండి నేర్చుకోవాల్సిన పాఠాలు ఉన్నాయి. తిరిగి శ్రద్ధతో నా ఆటలో మునిగిపోతాను," అని తెలిపారు.అంతేకాక, ఆమె తన ఆటను మెరుగుపరచుకోవడానికి ప్రాక్టీస్ చేయడం, పాజిటివ్‌గా ఆలోచించడం, మరియు అనుభవాల నుండి పాఠాలు తీసుకోవడం కొనసాగిస్తుందని తెలిపారు.ఇగా స్వియాటెక్ ఇప్పటి వరకు ఆరు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలుచుకున్నారు. ఇందులో నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్, ఒకసారి వింబుల్డన్, ఒకసారి యూఎస్ ఓపెన్. డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో 125 వారాల పాటు అగ్రస్థానంలో నిలిచిన అనుభవం కూడా ఆమె కెరీర్‌లో ప్రత్యేక ఘట్టం.

# 23 సంవత్సరాల నిర్లక్ష్యంపై మాజీ ఆటగాడి సంచలన వ్యాఖ్యలు



టీం ఇండియా మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ బీసీసీఐపై సంచలన ఆరోపణలు చేశా రు. బీసీసీఐ కామెంటేటర్ పదవి కి ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.సోషల్ డియాలో వరుసగా పోస్టులు పెట్టిన ఆయన, గత 23 ఏళ్లుగా బీసీసీఐ తనను నిర్లక్ష్యం చేస్తోందని వెల్లడించారు. బ్రాడ్‌కాస్టింగ్‌లో సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ, ఒక్క సారి కూడా కీలక బాధ్యతలు అప్పగించలేదని ఆయన పేర్కొన్నారు.శివరామకృష్ణన్ పేర్కొన్నట్లు, 'నేను బీసీసీఐ కామెంటేటర్ పదవికి రాజీనామా చేస్తున్నాను. గత 23 ఏళ్లుగా పెద్ద మ్యాచ్‌లలో టాస్ వేయడం, అవార్డు ప్రెజెంటేషన్ వంటి బాధ్యతలు నాకు ఇవ్వలేదు. నా తర్వాత వచ్చినవారికి అవకాశాలు వస్తున్నాయి. రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నప్పటికీ, కొత్త వాళ్లతోనే పిచ్ రిపోర్ట్ మరియు ప్రెజెంటేషన్ జరిగింది. నన్ను పక్కన పెట్టి ఇలా చేయడానికి కారణం ఏంటో నాకు తెలియదు. ఆత్మగౌరవాన్ని త్యాగం చేసి, ఎవరికీ దాసోహం కాలేను. ఈ నిర్ణయం కేవలం ఒక కథకు ప్రారంభం మాత్రమే. సాధారణ ప్రజలు, క్రికెట్ అభిమానులు షాక్ అవుతారని తెలుసు. నన్ను ద్వేషించే వాళ్లు సంతోషిస్తున్నందుకు సంతోషంగా ఉంది. కనీసం నేను మంచి వాడినని భావించే వారికి ధన్యవాదాలు.' ఈ పోస్టులపై రవిచంద్రన్ అశ్విన్ స్పందిస్తూ, 'వద్దు' అని రిప్లై ఇచ్చారు.

# చీఫ్ సెలెక్టర్ అగార్కర్ పదవీ కాలం పొడిగించబడింది

భారత పురుషుల క్రికెట్ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీ కాలం త్వరలో ముగియనుంది. అగార్కర్ తన పదవీని మరికొంతకాలం కొనసాగించాలన్న కోరికతో బీసీసీఐ చేసినట్టు వార్తలు వచ్చినా, బీసీసీఐ అధికారుల ప్రకారం ఇవన్నీ నిజం కాదని ప్రకటించారు. వచ్చే వన్డే ప్రపంచకప్ వరకు తనకు పొడిగింపు ఇవ్వాలని అగార్కర్ విజ్ఞప్తి చేసారన్న వార్తలు సోషల్ డియాలో



సంచలనం సృష్టించాయి.అయితే బీసీసీఐ అధికారులు స్పష్టంగా, 'అగార్కర్ తన పదవీ పొడిగింపుపై అడగలేదు. సెప్టెంబర్ వరకు మాత్రమే సెలెక్టర్ల కాంట్రాక్ట్ ఉంటుంది. ఆ తర్వాతే బీసీసీఐ సెక్రటరీ, అగార్కర్ పొడిగింపు విషయాన్ని నిర్ణయిస్తారు. రాజ్యాంగం ప్రకారం సీనియర్ సెలెక్టర్ గరిష్టంగా నాలుగు సంవత్సరాల వరకు కొనసాగవచ్చు' అని పేర్కొన్నారు.చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ తనదైన ముద్ర వేసారు. సీనియర్లను సమంజసంగా చెక్ చేసి, ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చి టీమిండియాను విజయవంతం చేశారు. ఈ సమయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నా, అతను స్థిరంగా ముందుకు సాగాడు.మాజీ పేసర్ అగార్కర్ 2014లో చీఫ్ సెలెక్టర్‌గా ఎంపికయ్యారు.

## రూ. 16వేల కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన రాజస్థాన్ రాయల్స్!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీల విలువ ఆకాశాన్ని తాకుతోంది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేసేందుకు యూఎస్-కెనడాకు చెందిన కొలం



బియా పసిఫిక్ క్యాపిటల్ పార్టనర్స్ కన్సార్షియం ఏకంగా రూ. 16,000 కోట్ల (సుమారు వి1.7 బిలియన్) భారీ ఆఫర్‌ను ప్రకటించింది. కేవలం రెండు వారాల్లోనే పూర్తి మొత్తాన్ని చెల్లిస్తామని నిషా సచ్‌దేవా, దేబ్‌జీత్ గుప్తా నేతృత్వంలోని ఈ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్మ్ అత్యంత భారీ ఆఫర్ తో ముందుకు వచ్చినప్పటికీ, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఈ ఆఫర్‌ను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఈ నిర్ణయం క్రీడా, వ్యాపార వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ ఆఫర్ తమ ఫ్రాంచైజీ యొక్క అసలైన లాంగ్-టర్మ్ వాల్యూను ప్రతిబింబించడం లేదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రిజెక్షన్ వెనుక బలమైన వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం కేవలం డబ్బు కోసమే కాకుండా, ఫ్రాంచైజీకి ఉన్న గ్లోబల్ బ్రాండ్ వాల్యూ, భవిష్యత్తులో రాబోయే ఆదాయ వనరులను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగైన వాల్యుయేషన్ కోసం వేచి చూస్తోందని అంటున్నారు. ముఖ్యంగా డీల్ స్ట్రక్చర్, దాని అమలులో ఉన్న కొన్ని సాంకేతిక పరమైన సర్టెయింటీపై యాజమాన్యానికి కొన్ని సందేహాలు ఉండటం కూడా ఈ డీల్ క్యాన్సిల్ అవ్వడానికి ఒక కారణంగా కనిపిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం రైన్ గ్రూప్ ద్వారా అమ్మకపు ప్రక్రియ కొనసాగుతుండటంతో, ఇతర బిడ్డర్లు దీనికంటే ఎక్కువ మొత్తానికి బిడ్లు వేసే అవకాశం ఉందని, తద్వారా ఫ్రాంచైజీ విలువను మరింత పెంచవచ్చని ఓనర్లు భావిస్తున్నారు.

# వుదయం సినిమా

## మార్చి 24న దేత్తడి గ్లింప్స్



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఆశిష్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా గ్లింప్స్ మార్చి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన గ్లింప్స్ పోస్టర్‌లో బ్లాక్, రెడ్ షేడ్స్‌తో రా ఎనర్జీ కనిపిస్తోంది. హీరో వెనుక నుంచి కనిపిస్తూ ఫైర్ బ్రీతింగ్ యాక్ట్ చేస్తున్న విజువల్ ఆసక్తిని పెంచుతోంది. "దేత్తడి" సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. మెయిన్ స్ట్రీమ్‌లో ఎక్కువగా చూడని అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. తారాగణం: ఆశిష్, నిర్మాతలు: దిల్ రాజు, శిరీష్, కథ, దర్శకత్వం: అదితిరావు గంగసాని, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, క్రియేటివ్, హెడ్: ప్రసన్న కుమార్ బెజవాడ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మురళి పున్నా (బిట్టు).

# ప్రేయసిరావే రేంజ్‌లో హిట్ అవ్వాలి

## 'పిఠాపురంలో అలా మొదలైంది' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీకాంత్



డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు మహేష్ చంద్ర రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉప శీర్షిక 'అలా మొదలైంది'. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్‌పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు ఈ సినిమాకి సంబంధించి బయటకు వచ్చిన కంటెంట్ ప్రేక్షకుల్ని కట్టి పడేసింది. ఇక తాజాగా శుక్రవారం నాడు ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి 'ప్రేయసి రావే' టీం హీరో శ్రీకాంత్, పృథ్వీ, శివాజీ రాజా, ఎంఎం శ్రీలేఖ ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ .. ''ప్రేయసి రావే' కంటే ముందు నేను చేసిన కొన్ని చిత్రాలు సరిగ్గా ఆడలేదు. చంద్ర మహేష్ నాతో తీసిన 'ప్రేయసి రావే' అద్భుతమైన విజయం సాధించింది. అందులో పృథ్వీ , శివాజీ రాజా అద్భుతంగా నటించారు. శ్రీలేఖ ఆ సినిమాకు ఇచ్చిన పాటలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. అప్పట్లో చంద్ర మహేష్ కొత్త వాడే అయినా గొప్పగా సినిమాని తీశాడు. ఈ 'పిఠాపురంలో అలా మొదలైంది' సినిమా కథ గురించి కూడా నాకు మహేష్ చెప్పాడు. మూడు డిఫరెంట్ కథలతో ఈ మూవీని అద్భుతంగా తీశాడని అర్థం అవుతోంది. పిల్లలు, తల్లిదండ్రులు కలిసి ఈ సినిమాని చూడాలి. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని నేను నమ్ముతున్నాను. 'పిఠాపురంలో అలా మొదలైంది' మూవీ మా 'ప్రేయసిరావే' రేంజ్‌లో హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను . మంచి కంటెంట్, కాన్సెప్ట్ దొరికితే చంద్ర మహేష్, నేను కలిసి సినిమా చేస్తామ"ని అన్నారు.

దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ .. ''ప్రేయసి రావే' నాకు ఈ లైఫ్ ఇచ్చింది. ఆ టీంతో మా 'పిఠాపురంలో అలా మొదలైంది' ట్రైలర్ లాంచ్ అవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. 'ప్రేయసి రావే 2' కథ కూడా రెడీ చేశాను. 'ప్రేయసి రావే' చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఫీల్ అయితే వచ్చిందో.. 'పిఠాపురంలో అలా మొదలైంది' టైంలోనూ అదే ఫీలింగ్ వచ్చింది. ఇప్పటి వరకు మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ క్లైమాక్స్‌కి ఎమోషనల్ అయ్యారు. ముగ్గురు హీరోలు, ముగ్గురు హీరోయిన్లు అద్భుతంగా నటించారు. శ్రీరామ్ గొప్ప డైలాగ్స్ రాశారు. ముగ్గురు నిర్మాతలు నాకెంతో సహకరించారు. ప్రతీ ఇంట్లో జరిగే సంఘటనలతోనే ఈ మూవీని చేశాం. సినిమాని చూస్తే ఇది మా ఇంట్లోనే జరిగినట్టు ఉందే అని ఫీల్ అవుతారు. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు.

నిర్మాతలు దుండిగళ్ళ బాలకృష్ణ, మురళీ కృష్ణ మాట్లాడుతూ .. ''పిఠాపురంలో అలా మొదలైంది' అద్భుతంగా వచ్చింది. ఈ మూవీ పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాము' అని అన్నారు. కార్యక్రమంలో శివాజీ రాజా, విరాట్, ప్రత్యూష, గీత, శ్రీలు, ప్రేమ్, డైలాగ్ రైటర్ శ్రీరామ్, నిర్మాత ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రేయసి రావేకి సీక్వెల్ చేస్తా

**- దర్శకుడు మహేష్ చంద్ర**

తన జీవితాన్ని మలుపు తిప్పిన ' ప్రేయసి రావే ' చిత్రానికి త్వరలో సీక్వెల్ చేయబితున్నానని దర్శకుడు మహేష్ చంద్ర వెల్లడించారు. " కథ సిద్ధమైతోంది. పూర్తి వివరాలు త్వరలోనే చెబుతాను. శ్రీకాంత్ కి కూడా ఈ విషయం చెప్పాను. ఆయన కూడా చాలా ఆనంద పడ్డారు. శ్రీకాంత్, రాశి, పృథ్వి, శివాజీ రాజా, ఎంఎం శ్రీలేఖ– మేమంతా కలిసి మళ్లీ పని చేస్తాం'' అని తెలిపారు మహేష్ చంద్ర.

## సఖియే.. లిరికల్ సాంగ్ రిలీజ్



కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజ ర ముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ – నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ ట్రైలర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ రోజు "యూత్" సినిమా నుంచి 'సఖియే..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జీవీ ప్రకాష్ కుమార్ బ్యూటిఫుల్ కంపోజిషన్ చేసిన 'సఖియే..' లిరికల్ సాంగ్ కు కిట్టు విస్సాప్రగడ సాహిత్యాన్ని అందించగా, సింజిత్ యెర్రమల్లి, సింధుజ తణుకు ఆకట్టుకునేలా పాడారు. 'సఖియే..' సాంగ్ ఎలా ఉందో చూస్తే – 'పలికానే పెదాలతోనే పలుమార్లు ఇలా నీ పేరే, అలవాటే లేదాయే వెతికే మాయవి నీవేలే, ఒక మాటే మాటాడమంటే మదిదాటి రాలేను అందే, విన్నావా అంటూనే పిలిచాయే నా మౌనాలే, కలవా, కథవా నను తాకే అలవా, మనసే సంద్రంలా మారిందా,..సఖియే, సఖియే..' అంటూ యువ జంట పాడుకునే అందమైన ప్రేమపాటగా సాగుతుంది. నటీనటులు – కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్, తదితరులు.

## అందరూ గర్వపడేలా గువ్వల చెరువు ఘాట్

**- సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం**

సక్సెస్ ఫుల్ హీరో హీరో కిరణ్ అబ్బవరం అమోజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ కోసం చేస్తున్న వెబ్ సిరీస్ "గువ్వల చెరువు ఘాట్". ఈ వెబ్ సిరీస్ లో తిరువీర్, సంయుక్త, తేజస్వి రావు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గువ్వల చెరువు ఘాట్ వెబ్ సిరీస్ ను డ్రీమ్ ఫార్మర్స్ ఎల్ఎల్ పీ బ్యానర్ పై బాపినీడు.బి, సుధీర్ ఈదర నిర్మిస్తున్నారు. డియర్ కామ్రేడ్ ఫేం డైరెక్టర్ భరత్ కమ్మ ఈ వెబ్ సిరీస్ ను ఆద్యంతం ఆసక్తికర కథా కథనాలతో తెరకెక్కిస్తున్నారు. త్వరలో "గువ్వల చెరువు ఘాట్" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఇటీవల రిలీజ్ చేసిన ఈ వెబ్ సిరీస్ ఫస్ట్ లుక్ వీడియో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ వెబ్ సిరీస్ ఎలా ఉండబోతోంది అనే క్యూరియాసిటీని ఆడియెన్స్ లో క్రియేట్ చేసింది. "గువ్వల చెరువు ఘాట్" వెబ్ సిరీస్ సాధించబోయో సక్సెస్ పై హీరో కిరణ్ అబ్బవరం కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఆయన తన రీసెంట్ సోషల్ మీడియా పోస్ట్ లో స్పందిస్తూ – 'ఈ కంటెంట్ ఏ పొద్దు బయటకు వస్తదో తెలియదు కానీ వచ్చిన రోజు మాత్రం మీ అందరూ గర్వపడతారు.' అని పేర్కొన్నారు. కిరణ్ అబ్బవరం చేసిన ఈ పోస్ట్ తో "గువ్వల చెరువు ఘాట్" వెబ్ సిరీస్ పై అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి.



# విజయ్ ఆంటోని వంద దేవుళ్లు

## ఫస్ట్ లుక్.. పోస్టర్‌తో కట్టి పడేసిన టీం

మళ్లీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం ఎన్ని రికార్డుల్ని క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఈ కాంబో కలిసి వచ్చింది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' అనే చిత్రం రాబోతోంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. తాజాగా డైనమిక్ స్టార్ విష్ణు మంచు ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. చెరుకు తోటలో విజయ్ ఆంటోనీ కత్తి పట్టుకున్న తీరు, వెనకాలే స్వాసిక మాసీ లుక్ అదిరిపోయింది.




విజయ్ ఆంటోని ఇందులో రా అండ్ రస్టిక్ పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తూ చిత్రయూనిట్‌కు విష్ణు మంచు ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఇక ఈ మూవీకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేస్తున్నారు. మున్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ను టీం అలరించనుంది. నటీనటులు : విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు. నిర్మాత : రామంజనేయులు జవ్వాజి, సంగీతం : బాలాజీ శ్రీరామ్.

# సోషియో ఫాంటసీ మూవీలో సందీప్ కిషన్

**పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ని ప్రకటించిన షైనింగ్ పిక్చర్స్**



'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు మళ్లీ ఓ అద్భుతాన్ని సృష్టించేందుకు రెడీ అయ్యారు. 'శంబాల' తరువాత దర్శక, నిర్మాతలు కలిసి ఎటువంటి ప్రాజెక్ట్ చేస్తారా? అని అంతా ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఆ ఎదురుచూపుకి సమాధానంగా సందీప్ కిషన్‌తో ఓ భారీ పాన్ ఇండియా సోషియో ఫాంటసీ మూవీని మేకర్స్ ప్లాన్ చేశారు.

ఈ సినిమా ప్రకటన కోసం ఓ క్రేజీ కాన్సెప్ట్ పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఒక సింహం, తోడేలు కనిపిస్తున్నాయి. యుద్ధభూమి బ్యాక్ గ్రౌండ్ లో సింహం, తోడేలు మధ్య ఒక పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ అలా నిటారుగా నిల్చుని ఉంది. 'కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు' అనే క్యాప్షన్ చూస్తే ఈ చిత్రం ఏ రేంజ్‌లో ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం దర్శక, నిర్మాతలు సక్సెస్ ఫుల్ హీరో సందీప్ కిషన్‌ను ఎంచుకున్నారు. ఈ సోషియో–ఫాంటసీ థ్రిల్లర్‌తో ఒక సరికొత్త ప్రపంచంలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇది దర్శకుడు యుగంధర్ ముని, నిర్మాతలు మహిధర్ రెడ్డి, రాజశేఖర్ కలిసి చేస్తున్న రెండో ప్రాజెక్ట్. ఈసారి సృజనాత్మక, సాంకేతిక ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ఈ సినిమాని రూపొందించేందుకు రెడీగా ఉన్నారు. ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది సందీప్ కిషన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. ఒక గొప్ప సినిమా అనుభూతిని అందించడానికి, నిర్మాతలు ప్రొడక్షన్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్, కథనం విషయంలో అన్ని విధాలా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే లక్ష్యంతో ఈ బృందం ఒక భారీ స్థాయి సోషియో–ఫాంటసీ డ్రామాను రూపొందిస్తోంది. ఎక్కువ మందికి చేరువయ్యేలా, విభిన్న భాషా, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుని, ఈ చిత్రాన్ని పాన్–ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఘనంగా విడుదల చేయడానికి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. 'శంబాల'తో షైనింగ్ పిక్చర్స్ టాలీవుడ్‌లో మంచి గుర్తింపుని సంపాదించుకుంది. ఇక ఈ నూతన ప్రాజెక్ట్‌తో మరోసారి ఆడియెన్స్‌ని ఆకట్టుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇతర నటీనటులు, సాంకేతిక బృందం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాల్ని త్వరలో ప్రకటిస్తామని మేకర్లు తెలిపారు. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు 2026లో ప్రారంభం కానుందని నిర్మాతలు ప్రకటించారు.

# ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్

## ప్రేక్షకుల రివార్డ్స్‌తో పాటు ప్రతిష్టాత్మక అవార్డ్స్



అవార్డ్ విన్నింగ్ చిత్రాలు, కమర్షియల్ మూవీస్..ఈ రెండూ భిన్నమైనవి. పురస్కారాలు గెల్చుకునే సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కదు అలాగే కమర్షియల్ మూవీస్‌కు అవార్డ్స్ వచ్చే అవకాశాలు తక్కువ. కానీ నిర్మాతగా మంచి వ్యాల్యూస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రాలను నిర్మిస్తూ, డిస్ట్రిబ్యూట్ చేస్తూ ప్రేక్షకుల రివార్డ్స్, అవార్డ్స్ సొంతం చేసుకుంటున్నారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్. ఆయన ఇటీవల నిర్మించిన, డిస్ట్రిబ్యూట్ చేసిన సినిమాలు అంబాజీపేట మ్యారేజి బ్యాండు, ఆయ్, తండేల్, లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు కమర్షియల్ గా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడమే కాదు పలు ప్రతిష్టాత్మక అవార్డ్స్ గెల్చుకోవడం విశేషం. బన్నీ వాస్ నిర్మించిన ఆయ్ సినిమా హోల్ సమ్ ఎంటర్‌టైనర్‌గా గతేడాది గద్దర్ అవార్డ్ ను గెల్చుకుంది. అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్ తో పాటు బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్ గా శరణ్య కు గద్దర్ అవార్డ్ దక్కింది. ఈ ఏడాది తండేల్ సినిమా బెస్ట్ యాక్టర్, ఉత్తమ జాతీయ సమగ్రతా చిత్రంగా రెండు గద్దర్ అవార్డ్స్ సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడిగా నాగచైతన్య గద్దర్ అవార్డ్ గెల్చుకున్నారు. బన్నీ వాస్ డిస్ట్రిబ్యూట్ చేసిన లిటిల్ హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి సినిమాలు ఇటీవలి గద్దర్ అవార్డ్స్ లో సత్తా చాటాయి. ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్ తో పాటు ఈ అవార్డ్స్ అందించే ప్రోత్సాహంతో మరిన్ని మంచి ప్రాజెక్ట్స్ చేస్తున్నారు నిర్మాత బన్నీ వాస్.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.